www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 52 | శుక్రవారం | 11 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

నేరెళ్ల ఘటనలో ఎస్ఐ సస్పెన్షన్

మన తెలంగాణ/హైదరాబాద్ : సిరిసిల్ల జిల్లా నేరెళ్ళలో నెల రోజుల క్రితం జరిగిన ఘటనతో సంబంధం ఉందన్న అభియోగంపై ప్రభుత్వం ఎస్ఐని సస్పెండ్ చేసింది. సిసిఎస్ ఎస్ఐ రవిందర్ వల్లే ఘటన జరిగిందన్న నిర్ధారణకు వచ్చిన అధికారులు ఆయనను సస్పెండ్ చేశారు. నేరెళ్ళలో ఇసుక లారీల వల్ల జరుగుతున్న ప్రమాదాలను నిరసిస్తూ గ్రామస్థులు దాడులకు దిగి తగుల బెట్టారు. ఘటనతో

తరువాయి 6లో

నేరెళ్ల బాధితులను **పరీక్షించిన ఎంజిఎం వైద్యులు** 6





ఎస్ఆర్ఎస్‌పిని జూన్‌కల్లా నింపుతాం

వారు కన్నీళ్ల ప్రాజెక్టులు కట్టారు

ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేస్తాం

ఈ ప్రాజెక్టు నుండి 40–45లక్షల ఎకరాలకు నీరు ఇచ్చే వరకు మడమ తిప్పం : పోచంపాడు సభలో కెసిఆర్

(పోచంపాడు నుండి అశ్వథకుమార్‌రెడ్డి)

వచ్చే సంవత్సరం జూన్ కల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టును కాళేశ్వరం నీళ్ళతో నింపడం ఖాయమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ఆరు నూరైనా ఎస్ఆర్ఎస్‌పి నుండి 40–45 లక్షల ఎకరాలకు నీళ్ళొచ్చే వరకు, ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేసే వరకు మడమ తిప్పబోనని అన్నారు. పోచంపాడు వద్ద శ్రీరాం సాగర్ పునరుజ్జీవ పథకానికి ముఖ్యమంత్రి కెసిఆర్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీరాంసాగర్ వరద కాలువ వద్ద ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ నాగార్జునసాగర్‌కు పునాది వేసిన పన్నెండేళ్ళలో ప్రాజెక్టు పూర్తయిందని, మన ఖర్మానికి శ్రీరాం సాగర్‌కు నెహ్రూ పునాది వేసి 54 సంవత్సరాలు అవుతున్నా స్టేజ్–1, స్టేజ్–2, వరద కాలువలు ఇప్పటి వరకు పూర్తి కాలేదన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణలో చేపట్టిన ప్రాజెక్టులు నీళ్ళు వచ్చేవి కావని, ఎస్ఆర్ఎస్‌పి ద్వారా 14 లక్షల ఎకరాలకు నీళ్ళిస్తామని చెప్పినా ఎన్నడూ ఐదున్నర లక్షల ఎకరాలకు కూడా నీళ్ళివలేదన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 8 టిఎంసిల నీళ్ళే ఉన్నాయని, అవి కూడా పాతవని, ఈ సంవత్సరం ఒక్క చుక్క నీరు కూడా రాలేదని చెప్పారు. గోదావరిలో ఇక్కడేమో నీళ్ళు లేవని, మరోవైపు కాళేశ్వరం వద్ద జూన్ నుండి ఇప్పటి వరకు 250 టిఎంసిలు నీరు వృథాగా సముద్రంలో కలిసాయన్నారు. అందుకే అతి తక్కువ సమయంలో

తరువాయి 6లో

అందరూ నిర్దోషులే

టాస్క్‌ఫోర్స్ ఆఫీసుపై మానవబాంబు దాడి కేసు కొట్టివేత

● సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసుకు తెరదించిన నాంపల్లి కోర్టు ● 12ఏళ్లు సాగిన విచారణ



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: బేగంపేటలోని పోలీసు కమిషనర్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై మానవ బాంబు దాడి కేసులో 10 మంది నిందితులను నాంపల్లి కోర్టు నిర్దోషిగా తేల్చింది. ప్రాసిక్యూషన్ ఆధారాలు చూపలేక పోవడంతో పది మంది నిందితులపై కేసును న్యాయస్థానం కొట్టివేసింది. మొత్తం 20 మంది నిందితులను గుర్తించగా 10 మందిని అరెస్టు చేశారు. ముగ్గురు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. కోర్టు తీర్పును డిఫెన్స్ లాయర్ స్వాగతించారు. ప్రాసిక్యూషన్ సాక్ష్యాధారాలు చూపకపోవడంతో నిందితులను నిర్దోషులుగా కోర్టు తేల్చిందని చెప్పారు. నిందితుల్లో కొంత మంది 11 ఏళ్ళుగా జైలులో ఉన్నారు. మరికొందరు ఏడేళ్ళుగా కారాగారంలో ఉన్నారు. తీర్పు పూర్తి పాఠం చదివిన తర్వాత భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని సిసిఎస్ డిసిపి అవినాష్ మహంతి తెలిపారు. ఈ తీర్పును సవాలు చేస్తూ హైకోర్టుకు కూడా వెళ్తామన్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దేశంలోనే మొదటిసారిగా అక్టోబర్ 12న (దసరా పండగ రోజు) 2005లో పోలీసు కమిషనర్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై మానవబాంబు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎ.సత్యనారాయణ (45) అక్కడికక్కడే మృతి చెందగా సెంట్రీ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ వెంకట్‌రావు తీవ్రంగా గాయపడ్డాడు. మానవబాంబు దాడికి పాల్పడిన బంగ్లాదేశ్‌కు చెందిన హుజీ ఉగ్రవాది దాలిన్ (21) ముక్కలు ముక్కలయ్యాడు. దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఈ కేసుపై నాంపల్లి కోర్టులో 12ఏళ్ళు సుదీర్ఘకాలంగా వాదోపవాదాలు నడిచాయి. చివరకు నిందితులంతా నిర్దోషులని తీర్పు రావడంతో వారి కుటుంబాలు సంతోషంతో ఉన్నాయి. ఈ కేసులో అరెస్టు అయి జైలులో ఉన్న నిందితులు కలీం, జాహెద్, షకీల్ అహ్మద్, సయ్యద్ హాజి, అజ్మత్ అలీ ఖాన్, అజ్మత్ అలీ, మహమ్మూద్ బారద్‌వాలా, ఖాజా, నఫీఫ్, హిలాలుద్దీన్‌లు రేపోమాపో విడుదల కానున్నారు. నిందితుల తరపున న్యాయవాదులు ఎం.అజీముద్దీన్, కాలేద్ సైఫుల్లా, రఫతుల్లాఖాన్, ఉమామహేశ్వర్‌రావు, జియావుద్దీన్ వాదించి విజయం సాధించారు.

జీడిమెట్ల ఫ్యాక్టరీలో ప్రమాదం : ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం 2



విమర్శతోనే ప్రజాస్వామ్య మనుగడ

● వీడ్కోలు ప్రసంగంలో ఉప రాష్ట్రపతి అన్సారీ మైనారిటీల అభద్రతపై ఆందోళన 10

ఉల్లి బాంబు


కొండెక్కిన ధర



మన తెలంగాణ/హైదరాబాద్: ఉల్లి ధర మండుతోంది. కొనకముందే కన్నీళ్లు తెప్పిస్తోంది. ఎన్నడూ లేనివిధంగా టమాటా ధరలు పెరగడంతో జనం బెంబేలెత్తిపోతుంటే, మరోవైపు ఉల్లి కూడా అదే దిశగా పరుగులు పెడుతోంది. నిన్న మొన్నటి వరకు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.12

తరువాయి 6లో

కుంచెపోటు



ధరలు పెరగటాన్ని ఆపండి సార్, ఇంకో బోర్డు పెట్టే చోటు లేదు!

మల్లన్నసాగర్ టెండర్లపై స్టేకి హైకోర్టు నో



మన తెలంగాణ/ హైదరాబాద్: మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల టెండర్ పనుల్ని నిలిపివేస్తూ మధ్యంతర స్టే ఉత్తర్వుల మంజూరు చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించబోయే మల్లన్నసాగర్ టెండర్ ప్రక్రియ నిలిపివేసేందుకు న్యాయమూర్తి ఎ.రామలింగేశ్వర రావు అంగీకరించలేదు. అయిదారుగురి కోసం భారీ ప్రాజెక్టు పనులపై స్టే ఇవ్వజాలమని తేల్చి చెప్పారు. బహుళ ప్రజావసరాల కోసమని అంటే ఈ వ్యాజ్యాన్ని ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించాలని రిజిస్ట్రీని ఆదేశిస్తామని న్యాయమూర్తి పిటిషనర్‌కు ప్రతిపాదన చేశారు. అయితే కోర్టుకు వచ్చిన పిటిషనర్లను వారి భూముల నుంచి ఖాళీ చేయించరాదని న్యాయమూర్తి మధ్యంతర ఆదేశాల్లో పేర్కొన్నారు. పర్యావరణ క్లియరెన్స్‌లు రాకుండానే టెండర్ నోటిఫికేషన్ చట్ట వ్యతిరేకమంటూ వేములఘాట్ నివాసి జి.లక్ష్మి, ఇతరులు వేసిన వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది. కాళేశ్వరం భారీ ఎత్తున నిర్మాణం

తరువాయి 6లో

లైడార్ భూసర్వే?

రికార్డుల ప్రక్షాళనకు ప్రయోగించాలని ప్రభుత్వం యోచన



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో నాలుగైదు నెలల్లో భూముల సర్వే పూర్తి చేసేందుకు లైడార్ సర్వే తప్ప మరో మార్గం లేదు. పక్కాగా, కచ్చితత్వంతో కూడిన భూముల లెక్కలు తేల్చేందుకు లైడార్ విధానం ఉత్తమమని అధికారులు సిఎం కెసిఆర్‌కు తెలియచేశారు. అయితే ఖర్చు అధికంగా ఉంటుందని అధికారులు చెప్పగా, రూ. 400 కోట్లు సిద్ధమేనని ఆయన అంగీకారించినట్లు సమాచారం. లైడార్ అనగా లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్. ప్రస్తుతం ఈ విధానాన్ని రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులలో విస్తృతంగా అమలు చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా భూ రికార్డుల ఆధునీకరణపై సిఎం వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రెవెన్యూ శాఖ, సర్వే సెటిల్‌మెంట్ విభాగం అధికారులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సిఎంకు నివేదికల రూపంలో అందచేస్తున్నారు. సర్వే తొందరగా పూర్తి కావాలని సిఎం చెప్పడంతో, పలు రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

మూడు విధానాలపై అధ్యయనం : దేశంలో భూముల సర్వే కోసం మూడు విధానాలను అనుసరిస్తున్నారు. ఒకటి లైడార్ విధానం, రెండోది ఉపరితల విధానం. మూడో విధానం ఉపగ్రహంతో చేపట్టడం. గుజరాత్ రాష్ట్రంలో ఉపరితల సర్వే నిర్వహించారు. ఒడిషా రాష్ట్రంలో ఉపగ్రహ ఛాయాచిత్రాలతో సర్వే చేస్తున్నారు. బీహార్ రాష్ట్రంలో విహంగ

తరువాయి 6లో

వ్యాపారుల మధ్య పోటీతత్వం పెంచాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : రైతులు తమ పంటలను అమ్ముకోవడానికి సాంప్రదాయమైన మార్కెట్లతో పాటు, ఎలక్ట్రానిక్ మార్కెట్ లు ఏర్పాటు చేసి వ్యాపారుల మధ్య పోటీ పెంచాలని వ్యవసాయ కార్యదర్శి పార్థసారథి అన్నారు. తెలంగాణ మార్కెట్ చట్టం 1966 లోని కొన్ని ముఖ్యమైన సెక్షన్‌లకు చేసిన మార్పులకు అనుగుణంగా రూల్స్ ఏర్పాటు చేయుటకు గాను డ్రాఫ్ట్ రూల్స్ నోటిఫై చేశారు. వీటిపై అవగాహన కల్పించేందుకు వరంగల్ రీజియన్‌లోని 18 జిల్లాల జిల్లా మార్కెటింగ్ అధికారులు, మార్కెట్ కార్యదర్శులు 88మందికి గురువారం వర్క్ షాప్ ఏర్పాటు చేశారు. పార్థసారథి మాట్లాడుతూ ప్రస్తుతం 1966లో తయారు చేసినటువంటి చట్టానికి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సరళ తరమైన వ్యాపారం చేయటానికి అనుగుణంగా డ్రాఫ్ట్ రూల్స్ నోటిఫై చేశామన్నారు. రైతులకు ఆదాయం పెంచే విషయమై ఈనామ్ కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఈ వ్యవస్థను అన్ని మార్కెట్లకు విస్తరించాల్సి ఉందన్నారు. అంతే కాకుండా ఇప్పటి వరకు వ్యవసాయ పంటల ఉత్పత్తి పెంపొందించడానికి దృష్టి కేంద్రీకరించామని ఇక పం డిన పంట ఉత్పత్తులకు అధిక ధర ఇచ్చే విషయమై ప్రభుత్వాలు దృష్టి సారించాయన్నారు. మార్కెట్‌లలో ఎక్కడైనా అధిక కమిషన్, ఇతర చార్జీలు తీసుకున్నట్లయితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.



నేడు టి జెఎసి 'అమరుల స్ఫూర్తి యాత్ర'

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ జెఎసి నాలుగవ దశ ''అమరుల సూర్తి యాత్ర''ను శుక్రవారం ప్రారంభం కానుంది. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఈ యాత్ర సాగనుంది. శుక్రవారం ఉదయం సికింద్రాబాద్‌లోని అమరలు స్తూపం వద్ద జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ నివాళులర్పించి బస్సుయాత్రకు బయలుదేరుతారు. రెండు రోజుల పాటు జరిగే యాత్ర సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై బస్సాపూర్, కామారెడ్డి, లింగపేట, ఎల్లారెడ్డి, బాన్స్‌వాడ వరకు కొనసాగుతుంది. మరుసటి రోజు శనివారం బీర్కుర్, కోటగిరి, రుద్రూర్, బోధన్, నవిపేట్, సారంగాపూర్ మీదుగా నిజామాబాద్‌తో ముగించి, అక్కడే బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఇప్పటికే సిఎం కెసిఆర్‌తో పాటు మంత్రులు కె.తారకరామారావు, టి.హరీష్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గాల్లో యాత్రను నిర్వహించారు.

'నేరెళ్ల'పై సమగ్ర న్యాయ విచారణ

అఖిలపక్ష సమావేశం డిమాండ్ • ఎస్‌పిని సస్పెండ్ చేసి కేసు పెట్టాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : నేరెళ్ళ ఘటనలో సిరిసిల్ల జిల్లా ఎస్‌పిని సస్పెండ్ చేయడంతో పాటు, ఆయనపై ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది. ఈ ఘటనపై న్యాయవిచారణతో పాటు, ఇసుక మాఫియాపై కూడా విచారణ చేపట్టాలని కోరింది. నేరెళ్ళ ఘటనపై ఈ నెల 21 లేదా 22వ తేదీల్లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి ఫిర్యాదు చేయాలని, అలాగే జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు, రాష్ట్ర గవర్నర్ నరసింహన్‌కు ఫిర్యాదు చేయాలని తీర్మానించింది. పోలీసులు, ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15వ తేదీన హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కూడా వ్యక్తం చేయాలని నిర్ణయించింది. ''నేరెళ్ళ ఘటన, దళితులపై అత్యాచారాలు'' అనే అంశంపై కాంగ్రెస్ ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో గురువారం అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కాంగ్రెస్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు అరెపల్లి మోహన్ రావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క (కాంగ్రెస్),తెలంగాణ జెఎసి చైర్మన్ కోదండ రామ్, ఎల్. రమణ, రేవంత్ రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు(టిడిపి), చింతా సాంబమూర్తి (బిజెపి),ఎన్. బాలమల్లేశ్(సిపిఐ) , సాధినేని వెంకటేశ్వరరావు (సిపిఐ(ఎంఎల్‌న్యూడెమోక్రసీ), ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు(ఆప్) తదితరులు పాల్గొన్నారు. ఇసుక లారీల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు, పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'నేరెళ్ల'తో ప్రభుత్వ పతనం మొదలైంది: ఉత్తమ్

నేరెళ్ల ఘటనలో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సంఘటనతో టిఆర్‌ఎస్ పతనం మొదలైందన్నారు. మొన్న రెండు గంటల పాటు మీడియా సమావేశంలో సిఎం కెసిఆర్ మాట్లాడిన మాటలతో ఆయనపై ఉన్న గౌరవం పూర్తిగా పోయిందని చెప్పారు. నాడు కెసిఆర్ ఆమరణ దీక్ష చేస్తున్న సమయంలో మీరా కుమార్‌కు ఫోన్ చేసి సహకరించాలని కవిత కోరారని, ఇప్పుడు మీరా కుమార్‌నే అవహేళన చేసే విధంగా మాట్లాడుతున్నారన్నారు. ప్రతిరోజు వేలకొద్ది లారీలు పర్యావరణాన్ని దెబ్బతీసేలా ఇసుక దోచుకుపోతున్నా పట్టించుకోవద్దని పోలీసులకు ఎవరు ఆదేశాలు ఇచ్చారో చెప్పాలన్నారు. ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని, కెసిఆర్‌ను రాష్ట్రం నుంచి తరిమికొడతారని, టిఆర్‌ఎస్‌కు పుట్టగతులుండవన్నారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ వివక్షను దూరం చేసి, ఆత్మగౌరవం కోసం తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నామని అయితే ఆత్మగౌరవమే లేకుండా పోయిందన్నారు. టిఆర్‌ఎస్ పాలన రాచరిక పాలనను మించిపోయిందన్నారు. మైనింగ్ శాఖ మంత్రిగా ఉన్న కెటిఆర్‌కు తన నియోజకవర్గంలో మైనింగ్ మాఫియాకు బలైన నేరెళ్ల బాధితుల గురించి తెలియలేదంటే వారి పాలన ఎలా ఉందో అర్థమౌతోందన్నారు.



న్యాయం సాధించే వరకు పోరాటం : కోదండరాం

జెఎసి చైర్మన్ కోదండరాం మాట్లాడుతూ అవమానకరమైన నేరెళ్ల ఘటనకు బాధ్యులైన వారిపై ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. న్యాయం సాధించే వరకు పోరాడుతామన్నారు. స్థానిక ప్రజలు మానేరు నుంచి ఇసుక తరలివెళ్ళొద్దని భూగర్భం అడుగంటుతోందని ఆందోళన చేస్తున్నారన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి దళితులకు అన్యాయం జరుగుతోందని, ప్రాజెక్టుల భూసేకరణ విషయంలోనూ దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. కొండపోచమ్మ ప్రాజెక్టు విషయంలోనూ అదే చోటుచేసుకుందన్నారు. అసైన్డ్ భూమి కోల్పోయిన దళితులకు ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు.

కెసిఆర్, కెటిఆర్‌లను ప్రశ్నిస్తే దాడులా?: రమణ, రేవంత్

ఎల్. రమణ మాట్లాడు తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి బడుగు, బలహీన వర్గాల ప్రజల కనీస హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. నాడు అసెంబ్లీలో అన్ని పక్షాలతో చర్చించి నిర్ణయాలు ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పి ఇప్పుడు దురంహాకారంతో మాట్లాడుతున్నారన్నారు. సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌లను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు ఇసుక వ్యాపారం చేయలేదని తెలిపారు. నేరెళ్ల బాధితులకు సహాయం అందించే విషయమై కాంగ్రెస్ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాలని, అందుకు టిడిపి మద్దతిస్తుందన్నారు. జిఎస్‌టి మీద న్యాయస్థానానికి వెళతామంటున్న కెసిఆర్, మల్లన్నసాగర్ బాధితులు కోర్టుకు వెళ్లొద్దా అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో కెసిఆర్ ఒక్క ఎంపిగా ఉంటే, అన్ని తానై మీరాకుమార్ రాష్ట్ర బిల్లు పాస్ చేస్తే ఆమె నేరెళ్ల ఘటనపై స్పందించి ఇక్కడకు వస్తే, ఆమెపైనా విమర్శలు చేస్తారా అని మండిపడ్డారు. మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ కెటిఆర్‌కు తన స్వంత నియోజకవర్గంలో ఏమి జరుగుతుందో తెలియకపోతే, ఎక్కడ నిద్రపోతున్నాడనుకోవాలని ప్రశ్నించారు. తన నెల జీతాన్ని నేరెళ్ల బాధిత కుటుంబాలకు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. నేరెళ్ల ఘటన అత్యంత హేయమైనదని, పోలీసుల పహారాతో రాష్ట్రాన్ని పాలిస్తున్నారని సిపిఐ నేత బాలమల్లేశ్ విమ ర్శించారు. కనీసం నిరసన తెలిపేందుకు ధర్నా నిర్వహిం చుకునే అవకాశం లేకుండా చేశారని, ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందన్నా రు. దళిత సిఎం హామీ అటుంచి, దళితులపైనే దాడులు చేస్తున్నారన్నారు. బిజెపి నేత చింతా సాంబమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వా నికి దళితుల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు.

మాకు ఇంకా భయంగానే ఉంది : నేరెళ్ల ఘటన



బాధితుల కుటుంబ సభ్యులు మాట్లాడు తూ తమకు ఇంకా భయంగానే ఉందన్నారు. మంత్రి కెటిఆర్ వచ్చి తనకు ఈ విషయం తెలువ దన్నారని, మళ్లీ మేమే అధికారంలోకి వస్తామని, మీరు ఎవరి దగ్గరకు పోవద్దని చెప్పినట్లు చెప్పారు. అయితే తమకైతే అన్యాయం జరిగిందని, తీరని దుఃఖం మిగిలిందన్నారు. పోలీసుల తీరుతో అన్ని రకాలుగా దెబ్బతిన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సర్కారీ ఇసుక లారీలనే ముట్టుకుంటారా అంటూ పోలీసులు అన్న మాటలు ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చింది తాము చావడానికేనా అని వారు ప్రశ్నించారు. బాధితులైన కోల హరీష్, కోరుగంటి గణేష్, పసుల బాలయ్య, పసు ఈశ్వర్, చెప్యాల బాలరాజు, చీకోటి శ్రీనివాస్‌ల కుటుంబ సభ్యులు ఈ సమావేశంలో మాట్లాడారు.

బియ్యం సేకరణ మరింత వేగం

కార్డుదారులకు ఎస్‌ఎంఎస్ ద్వారా రేషన్ సమాచారం • జెసిలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సివి ఆనంద్



మనతెలంగాణ/హైదరాబాద్ : కస్టమ్ మిల్లింగ్ రైస్(సిఎంఆర్)ను ఈ నెల 31వ తేదీలోగా సేకరించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సి.వి.ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఈ నెల 9 నాటికి మిల్లర్లు 54 శాతం బియ్యాన్ని అప్పగించారని, మిగిలిన 46 శాతం బియ్యాన్ని గడువులోగా అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బియ్యం సేకరణ, ఇ–పాస్ విధానం, దీపం తదితర అంశాలపై గురువారం కమిషనర్ జెసిలు, డిసిఎస్‌వోలు, జిల్లా మేనేజర్లు, ఎఫ్‌సిఐ, ఎన్‌ఐసి అధికారులు, రైస్ మిల్లర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత ఖరీఫ్‌లో జగిత్యాలలో ఒక రైస్‌మిల్ మినహా 99.94 శాతం బియ్యాన్ని మిల్లర్లు గడువులోగా అప్పగించారని, ఈ రబీలో కూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. ఈ ఏడాది రబీలో కొనుగోలు చేసిన 37.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఇచ్చేందుకు మిల్లర్లకు అప్పగించామని తెలిపారు. ఇందుకుగాను 25.27 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుందని, ఈ నెల 9వ తేదీలోగా 13.67 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిలర్లు ఎఫ్‌సిఐకి అప్పగించారని పేర్కొన్నారు. ఇది ఏమాత్రం సరిపోదని, బియ్యం సేకరణలో మరింత వేగాన్ని పెంచాలని అన్నారు. రేషన్ డీలర్లకు సరైన తూకంలో బియ్యం సరఫరా చేయాలని, లేనిపక్షంలో గోదాముల ఇంఛార్జ్‌లు, జిల్లా మేనేజర్లపై తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు. ఇ–పాస్ విధానం అమలులో జాయింట్ కలెక్టర్ల భాగస్వామ్యం పెరగాలని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 1,545 షాపులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 5,775 రేషన్ దుకాణాల్లో ఇ–పాస్ మెషిన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ 19 నాటికి వివిధ జిల్లాల్లో 4,159 షాపుల్లో ఇ–పాస్ మెషిన్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

ఎస్‌ఎంఎస్ ద్వారా రేషన్ సమాచారం

రేషన్ సరుకులకు సంబంధించిన సమాచారాన్ని లబ్దిదారులకు ఎస్‌ఎంఎస్ రూపంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ వెల్లడించారు. గోదాము నుంచి రేషన్ డీలర్‌కు సరుకులు అందగానే లబ్దిదారుని సెల్‌ఫోన్‌కు మీకు రేషన్ సరుకులొచ్చాయనే సంక్షిప్త సమాచారం చేరేలా తీసుకుంటున్నామని అన్నారు. లబ్దిదారుల ఫోన్ నెంబర్ల జాబితాను అనుసంధానించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. దీపం లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని అన్నారు. కార్డుదారుల్లో ఎల్‌పిజి కనెక్షన్ లేనివారిని గుర్తించి తహసీల్దారులు, అసిస్టెంట్ పౌరసరఫరాల అధికారులు అర్హులైన వారి వివరాలను సేకరించి దీపం వెబ్‌సైట్‌లో పొందుపరచాలని అన్నారు.

గిరిజన ఆవాస ప్రాంతాలపై కెసిఆర్ నిర్లక్ష్యం : బిజెపి గిరిజన మోర్చ

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని గిరిజన ఆవాస ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సమస్యల పరిష్కారం విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారనిబిజెపి గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు నానావత్ బిక్షూ నాయక్ ఆరోపించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, గిరిజనులకు మూడెకరాల భూమి, హైదరాబాద్‌లో గిరిజన భవన్ కడతానన్న హామీలను సిఎం కెసిఆర్ విస్మరించారని అన్నారు. తండాలను పంచాయతీ లుగా ప్రకటిస్తామని, ఫలితంగా నిధులు భారీగా సమకూరుతాయని చెప్పిన మాటను కూడా కెసిఆర్ తప్పారన్నారు. గిరిజనుల సమస్యల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేకపోతే కేంద్ర ప్రభు త్వం దృష్టికి తీసుకు వెళ్ళి తామే నేరుగా నిధులను తెచ్చుకుంటామన్నారు.

మేడిపల్లిలో జన్యుపరీక్షల కేంద్రం



మనతెలంగాణ/హైదరాబాద్ : హైదరాబాద్ నగర శివారులోని మేడిపల్లిలో జన్యు పరీక్షల కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి, పద్మశ్రీ అవార్డు గ్రహీత డా. లాల్జీసింగ్ తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటైతే దేశంలోనే మొదటి జన్యు పరీక్షల కేంద్రం అవుతుందని చెప్పారు. మేడ్చల్ జిల్లా బోగారంలోని హోలీమేరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి అండ్ సైన్స్‌లో సివిల్ ఇంజనీరింగ్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే మేడిపల్లిలో నాలుగు ఎకరాల స్థలం కేటాయించిందని, ఆ స్థలంలో ఈ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఈ కేంద్రంలో జన్యువుల్లోని వ్యాధి కారక తేడాలను గుర్తించే పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ పరీక్షలకు అన్ని వర్గాలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఉస్మానియా వర్సిటీలోని సిపిఎంబితో కలిసి పనిచేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని అన్నారు.

సివిల్ ఇంజినీర్లు సృజనాత్మకతతో ముందడుగు

సివిల్ ఇంజనీర్లు ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులను అర్థంచేసుకుంటూ సృజనాత్మకతతో ముందడుగు వేయాలని డా. లాల్జీసింగ్ అన్నారు. ప్రపంచంలోని వివిధ రకాలైన నీటి పద్ధతులను అధ్యయనం చేసి, వాటిని ఎలాంటి పద్ధతుల ద్వారా అన్ని ప్రాంతాలకు అందించవచ్చో ఆలోచించి ఆ దిశగా అడుగులు వేయాలని అన్నారు. హోలీ మేరీ ఇన్‌స్టిట్యూట్‌లో ''ఇటీవల సంభవించిన మార్పులు, జల వనరులు'' అనే అంశంపై జరిగే సదస్సులో లాల్జీసింగ్ మాట్లాడుతూ, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ విభాగం పర్యావరణ మార్పులను, దాని ఒత్తిడులను ఎదుర్కొంటూ కొత్త కొత్త డిజైన్ల ద్వారా నిర్మాణాలను సాగిస్తోందని తెలిపారు. మానవ శరీర నిర్మాణం, దాని ఆకృతి, పనిచేసే కూడా ఒక రకమైన స్ట్రక్చరల్ విధానమే అని పేర్కొన్నారు. ముఖ్యంగా శరీరంలోని కాళ్లు నిలబడేందుకు, నడిచేందుకు, పరుగెత్తేందుకు ఉపయోపగతాయని అన్నారు. కాళ్లలోని చిన్న చిన్న సమస్యలను వాటంతట అవే నయం చేసుకుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో హోలీ మేరీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ అరిమండ వరప్రసాదరెడ్డి, కార్యదర్శి విజయశారదారెడ్డి, వైస్ చైర్మన్ సిద్ధార్థ రెడ్డి, ప్రిన్సిపాల్ సుభాష్‌చంద్ర, సదస్సు కన్వీనర్ ఎం.ఎస్.చౌహాన్, మలేషియాలోని ట్రాపికల్ జియో ఇంజనీరింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సిఎం క్యాంపు కార్యాలయం ముట్టడిస్తాం

మన తెలంగాణ / హైదరాబాద్ : భారత రాజ్యాంగపు 73,74వ అధికరణల కింద గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు, మైనింగ్, స్టాంపు డ్యూటి విడుదల తదితర అధికారాలకు కత్తెర పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ సర్పంచులు ఆందోళన బాట పడుతున్నారు. ఈ మేరకు ఆయా సమస్యలను చర్చించిన వారు భవిష్యత్ కార్యాచరణను ప్రకటిం చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పంచులందరితో కలిసి నెల రోజుల్లోనే ముఖ్య మంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు చింపుల సత్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఛాంబర్ సభ్యులు అంజనీ ప్రసాద్, సుధాకర్, నరేందర్ ప్రభృతులతో కలిసి సత్యనారాయణ రెడ్డి గురువారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 14వ ఆర్థిక సంఘం నిధులను కూడా పంచాయతీలకు దక్కకుం డా చేస్తున్న ప్రభుత్వ పెత్తనాన్ని ఇకపై సహించబోమంటూ సత్యనారాయణ రెడ్డి తెగేసి చెప్పారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చాలా రోజులుగా ప్రయత్నిస్తున్నా ముఖ్యమంత్రి తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వ కుండా తప్పించుకు తిరుగుతున్నారన్నారు. సర్పంచులకే కాదు.. ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలకు కూడా సిఎం అందుబాటులో ఉండడం లేదన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడ్డ తమకు సమయం ఇవ్వక పోవడం బాధాకరమన్నారు. తెలంగాణ కోసం సర్పంచులు కూడా పోరాడారన్నారు. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన తొలి ఏడాది (2013) తామంతా తెలంగాణ ఉద్యమంలోనే ఉన్నామని, తెలంగాణ ఆవిర్భావం తర్వాత మూడేళ్లుగా ప్రజా సమస్యల పరిష్కారంలో వారి సాదక బాధకాల్లో భాగస్వామ్యం అయ్యామన్నారు. అమ్మ పెట్టదు.. అడుక్కోనివ్వదు అన్న చందంగా ఉంది నిధుల విడుదల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి అని సత్యనారాయణ రెడ్డి మండిపడ్డారు. సంఘం గౌర వాధ్యక్షులు సుధాకర్ మాట్లా డుతూ గ్రామజ్యోతి పేరిట సి ఎం కెసిఆర్ డ్రామాలు ఆడుతున్నారన్నారు. పంచాయతీల నుండి వస్తున్న ఆదాయాన్ని రాష్ట్ర ప్రభు త్వమే సంక్షేమ పథకాలను అమలు చేయాల్సి ఉందన్న నెపంతో తీసుకుంటోందని, కనీసం కేంద్ర ప్రభుత్వం నుండి నేరు గా వచ్చే 14వ ఆర్థిక సంఘం నిధులను కూడా పంచాయతీలకు ఇవ్వడం లేదన్నారు. నిధులు లేక పంచాయతీలన్నీ నీరసించిపోయాయన్నారు.

జీడిమెట్ల ప్రమాదంలో కార్మికుడు మృతి

మన తెలంగాణ/హైదరాబాద్/షాపూర్‌నగర్ : స్మైలెక్స్ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యానికి ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులు అగ్నికి ఆహూతులయ్యారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని స్మైలెక్స్ ఫ్యాక్టరీలో బాయిలర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో కార్మికుడు చావు బతుకుల మధ్య ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ సంఘటన బుధవారం సాయంత్రమే జరిగినా విషయాన్ని బయటకు తెలియనివ్వకుండా పరిశ్రమ యాజమాన్యం గోప్యంగా ఉంచింది. చివరకు చికిత్సను అందిస్తున్న ఆస్పత్రి సిబ్బంది సమాచారం అందించడంతో విషయం బయటకు వచ్చిందని జీడిమెట్ల పోలీసులు తెలిపారు. కుత్బుల్లాపూర్ జీడిమెట్ల పారిశ్రామికవాడలోని స్మైలెక్స్ పరిశ్రమలో గత నెల రోజులుగా కాంట్రాక్టర్ రాజశ్రీ ద్వారా సూరారంకు చెందిన అప్పల్ నాయుడు (35), జె.శ్రీనివాస్(36)లు కాంట్రాక్ట్ కార్మికులుగా విధుల్లో చేరారు. రోజూలాగే పనికి వచ్చిన అప్పల్‌నాయుడు, శ్రీనివాస్‌లు బుధవా రం సాయంత్రం పరిశ్రమలో బాయిలర్‌ను శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా అందులో ఉన్న రసాయనాలు పేలాయి. దీంతో కార్మికుడు అప్పల్‌నాయుడు పూర్తిగా అగ్నికి ఆహుతై మృతి చెందగా, శ్రీనివాస్‌కు ఒంటి నిండా గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా వారికి చికిత్స చేయించేందుకు ఆస్పత్రికి తరలించారు. అర్ధరాత్రి 11 తరువాత ఆస్పత్రి నుంచి ఫోన్ రావడంతో సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద ఘటనను ఆరా తీసిన జీడిమెట్ల సిఐ శంకర్‌రెడ్డి, కార్మికుడికి మెరుగైన చికిత్సను అందించేందుకు కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. గురువారం మృతి చెందిన కార్మికుడు అప్పల్ నాయుడు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యాజమాన్యంపై కేసు నమోదు చేసుకున్న జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.మృతుడి కుటుంబానికి రూ.10లక్షలు నష్ట పరిహారం ప్రకటించిన యాజమాన్యం స్మైలెక్స్ ఫ్యాక్టరీ ప్రమాదంలో మృతి చెందిన కార్మికు డు అప్పల్ నాయుడు కుటుంబాన్ని యాజమాన్యమే ఆదుకోవాలని టిఆర్‌ఎస్ పార్టీ సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు దేవగారి రాజేందర్ రెడ్డి యాజమాన్యాన్ని నిలదీ శారు. మృతుడు పేద కటుంబానికి చెందిన వాడని సంప్రదింపులు జరపగా ఎట్టకేలకు దిగి వచ్చిన యాజమాన్యం నష్టపరిహారం కింద రూ.10 లక్షలు రూపాయలు, దహన సంస్కారాలకు రూ.1 లక్ష ప్రకటించినట్లు రాజేందర్ రెడ్డి తెలిపారు.

లంచం కేసులో ఇద్దరు వ్యక్తులు అరెస్టు : సిబిఐ

న్యూఢిల్లీ: లంచం కేసులో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులను గురువారం సిబిఐ అరెస్టు చేసింది. ఈ కేసులో రాజన్ కుమార్, అరుణ్ తివారీ, ఢిల్లీ పోలీసు ఇన్స్‌పెక్టర్ బనాయ్ సింగ్ మీనా, ప్రభుత్వాధికారి కామేశ్వర్ నలుగురి పేర్లను సిబిఐ ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. నిందితుల్లో ఒకరైన కుమార్ ప్రభుత్వాధికారిగా చెప్పుకుంటూ కోరిన చోట పోస్టింగ్ ఇప్పిస్తానంటూ ఢిల్లీ పోలీసు ఇన్స్‌పెక్టర్ మీనా నుంచి రూ. 10 లక్షల లంచం తీసుకున్నాడని ఆరోపణలు వచ్చాయి. ఆర్‌కెపురంలో కామేశ్వర్‌కు కేటాయించిన ప్రభుత్వ నివాసంలో ఉంటున్న కుమార్ తివారీకి పోస్టింగ్ ఇప్పించేందుకు మీనా నుంచి పెద్ద మొత్తంలో లంచం పుచ్చుకున్నందుకు సిబిఐ వారిద్దరిని అరెస్ట్ చేసినట్టు సిబిఐ ప్రతినిధి ఆర్‌కె గౌర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిందితుడు కుమార్ ఇంట్లో జరిపిన సోదాల్లో రూ. 1.6 కోట్ల నగదును సిబిఐ స్వాధీనం చేసుకుంది. రబ్బర్ స్టాంప్‌లు, నకిలీ లెటర్‌హెడ్స్‌లను కూడా స్వాధీనం చేసుకున్నట్టు గౌర్ చెప్పారు. అంతేకాక నిందితుడు కుమార్ నుంచి లంచం తీసుకున్న రూ. 7 లక్షలతో పాటు తివారీ నుంచి రూ. 3 లక్షలను కూడా సిబిఐ స్వాధీనం చేసుకుందని గౌర్ వెల్లడించారు. కాగా, లంచం ఇచ్చినందుకుగాను ఢిల్లీ పోలీసు ఇన్స్‌పెక్టర్‌ను బదలీ చేసినట్టు సమాచారం.



తెలంగాణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులకు ఎంఎస్ఎంఇ గ్రాంట్స్ చెక్కును అందజేస్తున్న ఎంఎల్ఎ జి. కిషన్‌రెడ్డి

సిఎం కెసిఆర్ ఢిల్లీ పర్యటన రద్దు

మన తెలంగాణ/హైదరాబాద్ : సిఎం కెసిఆర్ ఢిల్లీ పర్యటన రద్దయింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం గురువారం రాత్రి సిఎం ఢిల్లీకి చేరుకుని, శుక్రవారం ఉప రాష్ట్రపతిగా ఎం.వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలతో రద్దు చేసుకున్నట్లు తెలిసింది. ప్రాజెక్టులపై జిఎస్‌టి భారం తగ్గించాలని రాష్ట్రం చేసిన విజ్ఞప్తి పట్ల కేంద్రం సానుకూలంగా లేకపోవడంతో సిఎం కెసిఆర్ ఢిల్లీ పర్యటన రద్దు చేసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

డిగ్రీ తుది విడత సీట్ల కేటాయింపు పూర్తి

మన తెలంగాణ/హైదరాబాద్ : డిగ్రీ తుది విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యింది. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ(దోస్త్) ద్వారా ఈ విడతలో 74,699 సీట్లు కేటాయింపులు చేశారు. చివరి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 19వ తేదీలోగా ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి.

స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కు 40 పాఠశాలలు ఎంపిక

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో 40 ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛ విద్యాలయ పురస్కార్2016 లభించింది. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 6 పాఠశాలలకు ఈ పురస్కారం లభించగా, రంగారెడ్డి జిల్లాలో 4 పాఠశాలలకు, యాదాద్రి జిల్లాలో మూడు పాఠశాలలు ఈ పురస్కారాలు లభించాయి. పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, చెట్ల పెంపకం పాటిస్తున్న పాఠశాలలకు రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు ప్రదానం చేస్తుంది. కేంద్ర స్వచ్ఛ పురస్కారాల కోసం ఈ 40 పాఠశాలలకు సంబంధించిన 10 నిమిషాల నిడివి గల వీడియోను ఈ నెలాఖరులో మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ(హెచ్‌ఆర్‌డి) వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆ వీడియోలను పరిశీలించిన తర్వాత హెచ్‌ఆర్‌డి కేంద్ర స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలను ప్రకటిస్తుంది.

ఆహార, ఆచార విశ్వాసాలపై నిర్బంధాలు ప్రమాదకరం



మన తెలంగాణ/ హైదరాబాద్ : ఆహార, ఆచార, వ్యవహారాలు, విశ్వాసాలపై నిర్బంధాలు విధిస్తే బహుళ సంస్కృతుల భారతదేశంలో గందరగోళానికి దారి తీస్తుందని భారతీయ సాంస్కృతిక సహకార, మిత్ర మండలి (ఇస్కఫ్) అధ్యక్షవర్గ సభ్యులు, మాజీ ఎంపి అజీజ్ పాషా అన్నారు. నగరంలో జరిగిన హైదరాబాద్ ఇస్కఫ్ వ్యవస్థాపక మహాసభలో ఆయన ప్రసంగించారు. గొడ్డు మాంసం పేరుతో 28 మందిని చంపడం దురదృష్టకరమన్నారు. ఇటీవల పార్లమెంటు సమావేశాలకు ముందు గోవును రాజకీయాంశంగా చేయవద్దని ప్రధాని విజ్ఞప్తి చేశారని, ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1394 గోరక్షకులకు రూ.75 లక్షలు పంచిన విషయాన్ని మరిచిపోయారన్నారు. సభలో ఇస్కఫ్ తెలంగాణ అధ్యక్షులు కె.ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్‌లు మాట్లాడారు. మహాసభలో హైదరాబాద్ ఇస్కఫ్ అధ్యక్షులుగా ఉస్మాన్ అల్ హాజిరి, ప్రధాన కార్యదర్శిగా వి.విజయ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

ఇ–లెర్నింగ్ ఉద్యోగులకు ఎంతో దోహదం : డా.జి.ఆర్.రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : ఉద్యోగులు సవాళ్లను అధిగమించేందుకు ఇ–లెర్నింగ్ విధానం ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జి.ఆర్.రెడ్డి అన్నారు. ఇలెర్నింగ్‌లో శిక్షణ ఇచ్చే శిక్షకులకు గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి)లో సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జి.ఆర్.రెడ్డి మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులకు సామర్థ్యం పెంపొందించేందుకు పెద్ద ఎత్తున ఇ– లెర్నింగ్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్(డిఒపిటి) సంయుక్త కార్యదర్శి దేవేష్ చతుర్వేది మాట్లాడుతూ, ఉద్యోగుల నైపుణ్యాలు పెంచడానికి శిక్షణ ఇచ్చేందుకు పైలట్ ప్రాజెక్ట్ కింద డిఇపిటి అస్సాం, హర్యానా,మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, తెలంగాణ ఆరు రాష్ట్రాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇ–లెర్నింగ్ విధానంలో ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే వ్యయం భారీగా తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి డిజి బి.పి.ఆచార్య, డిఇపిటి ట్రైనింగ్ డివిజన్ డైరెక్టర్ విజయ్‌కుమార్ సిన్హా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేరెళ్లపై టిడిపి ఫోటో ఎగ్జిబిషన్

మన తెలంగాణ/హైదరాబాద్ : నేరెళ్ల ఘటన వివరాలను తెలియజేస్తూ హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం టిడిపి ఆధ్వర్యంలో ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌కు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. రేవంత్ రెడ్డి, సీనియర్ నేతలు మోత్కుపల్లి నర్సింహులు, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బుచ్చిలింగం, బిఎన్‌రెడ్డి, పిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జెఎసి ఛైర్మన్ కోదండరామ్, సిపిఐ నేత మల్లేష్ తదితరులు హాజరై సందర్శించారు. ఇందులో నేరెళ్ల ఘటనపై వివిధ పత్రికలలో వచ్చిన కథనాలతో పాటు పోలీసుల దాడిలో బాధితుల గాయాలకు సంబంధించిన ఫోటోలను ప్రదర్శించారు.



ఎపి ప్రాజెక్టులపై అభ్యంతరం

కృష్ణా–గోదావరి బేసిన్‌లో అనుమతుల్లేని ప్రాజెక్టులపై లోక్‌సభలోఎంపి జితేందర్ రెడ్డి ప్రస్తావన

మన తెలంగాణ/న్యూఢిల్లీ: కృష్ణాగోదావరి బేసిన్‌లో అనుమతులు లేకుండా ఎపి ప్రభుత్వం నిర్మిస్తున్న ప్రాజెక్టులపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. లోక్ సభలో గురువారం జీరో అవర్‌లో టిఆర్ఎస్ సభా పక్షనేత జితేందర్ రెడ్డి ఈ అంశాన్ని లేవనెత్తారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుల విషయంలో ఇంతకు ముందే ఉమాభారతి ఇద్దరు సిఎంలను పిలిచి వివాదాల గురించి మాట్లాడి ప్రజెంటేషన్ తీసుకుందని తెలిపారు. ఎపిలో పాలమూరు రంగారెడ్డి, కాళేశ్వరం రెండూ అక్రమ ప్రాజెక్టులు అని ఎపి ఆరోపణలు చేస్తే...... కెసిఆర్ ప్రజంటేషన్ ఇచ్చారు, ఇవన్నీ పాతవే, కొత్తవేం కాదు ఆన్ గోయింగ్ ప్రాజెక్టులు అని చెప్పారన్న విషయాన్ని ఈ రోజు లోక్ సభలో జీరో అవర్‌లో ప్రస్తావించానన్నారు. ఇద్దరు సిఎంలు కూడా సహృద్భావ వాతావరణంలో మాట్లాడుకున్నారు, ఎపిలో ఏ ప్రాజెక్టులు కట్టుకున్నా మాకు అభ్యంతరం లేదని కెసిఆర్ పెద్ద మనసుతో అన్నారన్న విషయాన్ని కూడా ప్రస్తావించిన ట్లు ఎంపి జితేందర్ రెడ్డి తెలిపారు. అయితే ఈ ప్రాజెక్టులపై జులై 1న సెంట్రల్ వాటర్ కమిషన్‌కి ఎపి ప్రభుత్వం మరో లేఖ రాసింది, అందుకే మేం ఇవాళ ఎపి చేపట్టిన కొత్త ప్రాజెక్టుల గురించి పార్లమెంటులో లేవనెత్తామని జితేందర్ రెడ్డి వెల్లడించారు. ఎపి చేపట్టిన కొత్త ప్రాజెక్టులయిన పట్టిసీమ, పురుషోత్తమపట్నం, ముచ్చుమర్రి, గండుమర్రి, తదితర ప్రాజెక్టుల వివరాలు, వాటికి కేంద్రం ఇచ్చిన అనుమతుల వివరాలు చెప్పాలని కోరానన్నారు. ఇవన్నీ కూడా కొత్త ప్రాజెక్టులు అని తెలంగాణ కేంద్రానికి రాసింది, అనుమతులు లేకుండా వాళ్లు కడుతున్నారు, మీరు ఏం చర్యలు చేపట్టారు అని కేంద్రాన్ని అడిగినట్లు ఎంపి జితేందర్ రెడ్డి వెల్లడించారు. ఏపి వాళ్లు కట్టుకుంటే మాకు అభ్యంతరం లేదు, కానీ ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు, అందుకే తెలంగాణ ప్రభుత్వం తరపున ఈ ప్రశ్న అడిగినట్లు జితేందర్ రెడ్డి స్పష్టంచేశారు.

ఉత్తర్వులపై గోప్యమేల?

- కొరవడిన శాఖల పారదర్శకత
- వెబ్‌సైట్‌లో ముఖ్య ఉత్తర్వులపై సెన్సార్

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రతీది ఆన్‌లైన్.. అన్నింట్లో పారదర్శకత ఉండాల్సిందే.. అంటూ పదే పదే ప్రకటనలు గుప్పించే ప్రభుత్వం 'ఉత్తర్వుల' విషయానికి వచ్చే సరికే ఆ పారదర్శకతను కాస్త పక్కన పెట్టినట్లు కనిపిస్తోంది. అధికారిక ఉత్తర్వులు వెలువడే ప్రభుత్వ జివో వెబ్‌సైట్‌లో ముఖ్య ఉత్తర్వులకు(జివో) సెన్సార్ విధించారు. ప్రభుత్వానికి ఉపయోగపడే అంశాలు ఉంటే మాత్రం కొందరు ఉన్నతాధికారులే మీడియాలో ప్రచారం కోసం అధికారికంగా లీకులు ఇస్తున్నారు. అన్ని శాఖలకు పారదర్శకత పాటించాలని ఆదేశాలు జారీ చేసే ప్రభుత్వమే ఉత్తర్వుల విషయంలో మాత్రం గోప్యం పాటించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని శాఖలలో ముఖ్యమైన జివోలపై ఆంక్షలను విధిస్తే, మున్సిపల్, ఎక్సైజ్‌కు సంబంధించిన జివోలను మాత్రం వెబ్‌సైట్‌లో పూర్తిగా నిషేధించారు. ఇటీవల రెవెన్యూ శాఖ తెలంగాణ భూ సేకరణ సవరణ చట్టం మార్గదర్శకాలు రూపొందించింది. మార్గదర్శకాల జారీ, అభ్యంతరాలపై సంబంధిత జివోలను గడువు దాటిన తరువాత వెబ్‌సైట్‌లో పెట్టారు. దీనిపై కోర్టును ఆశ్రయించారు. ముఖ్యమైన జివోలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండవు, తమకు ఉపయోగం అనుకుంటే ఉన్నతాధికారులు అధికారికంగా లీకులిస్తున్నారు. ఇటీవల రియల్ ఎస్టేట్ నియంత్రణ చట్టం (రెరా) మార్గదర్శకాలు, పార్కింగ్ నిబంధనలకు సంబంధించిన ఉత్తర్వులను మున్సిపల్ శాఖ విడుదల చేసినా వాటిని జివో సైట్‌లో పెట్టలేదు. పైగా వాటిని ప్రచారం చేసుకునేందుకు మాత్రం అనధికారికంగా లీక్ చేశారు. అలాగే ఉన్నత విద్యామండలి ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, సభ్యుల నియామకానికి సంబంధించిన జివో కూడా వెబ్‌సైట్‌లో పెట్టలేదు. ఇలాంటి ముఖ్యమైన జివోలను కూడా విడుదల చేయకపోవడం పట్ల ప్రభుత్వ పారదర్శక పాలనను శంకించక తప్పదని పలువురు పేర్కొంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారిక జివో సైట్‌లో అన్ని శాఖలకు సంబంధించిన జివోలు అందుబాటులో ఉండేవి. పరిపాలనకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను బహిర్గతం చేయలేకపోయినా ఆ శాఖ పేరుతో జివో జారీ చేసి దానిపై ''కాన్ఫిడెన్షియల్'' అని వెబ్‌సైట్‌లో పెట్టేవారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో తొలుత అధికారిక వెబ్‌సైట్‌లో జివోలను పెట్టినా ఆ తర్వాత వాటిని పూర్తిగా నిలుపుదల చేశారు. ఈ విషయమై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, జివో సైట్‌ను ఆధునీకరిస్తున్నామని (మాడ్రన్‌గా మారుస్తున్నామని), త్వరలోనే జివో సైట్ అందుబాటులోనికి తీసుకొస్తామని ప్రభుత్వం సమాధానమిచ్చాంది. కాని ప్రభుత్వం అన్న ఆ ''మాడ్రన్ '' పదానికి అర్థమే వేరుగా కనిపిస్తోంది. ప్రస్తుతం వివిధ శాఖలలో సాధారణ జివోలు వస్తున్నప్పటికీ ముఖ్యమైన జివోలు మాత్రం కనిపించడం లేదు. ఫోన్ బిల్లుల నుంచి మొదలు స్టేషనరీ సామాగ్రి, వాహనాల అద్దె, ఇలా చిన్న వాటికి సంబంధించినవి అందుబాటులో ఉండడం గమనార్హం. కాగా సుమారు నాలుగు నెలల నుంచి మున్సిపల్ శాఖకు సంబంధించిన జివోలు వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు. ముఖ్యమైన ఉత్తర్వుల జారీ అంశంలో ఆంక్షలు విధించడంలో ఆంతర్యమేమిటనే విషయమై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అర్హులతోనే బోధన

- ప్రైవేట్ టీచర్లకు బి.ఎడ్, డి.ఎడ్ తప్పనిసరి
- నిర్దేశిత విద్యార్హతలు లేకుంటే 2019 నాటికి పొందాలి



మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లోనూ అర్హులైన ఉపాధ్యాయులే బోధించేలా కేంద్రం చర్యలకు పూనుకుంది. ప్రస్తుతం పనిచేస్తున్న టీచర్లకు బి.ఎడ్, డి.ఎడ్ వంటి ఉపాధ్యాయ విద్య డిగ్రీ లేకపోతే 2019, మార్చి 31 నాటికి విద్యార్హతలు పొందేలా వెసులుబాటు కల్పించింది. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు డి.ఎడ్ విద్యార్హత ఉండాలి. ఇంటర్మీడియేట్‌లో 50 శాతం మార్కులు కలిగి ఉన్న అభ్యర్థులు డి.ఎడ్ కోర్సు చేసేందుకు అర్హులు. ప్రస్తుతం పనిచేస్తున్న టీచర్ల లో ఎవరికైన ఇంటర్‌లో 50 శాతం మార్కులు లేకపోతే దూరవిద్య విధానంలో ఎన్ఐఒఎస్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఒపెన్ స్కూల్) ద్వారా సరిపడా మార్కులు పొందాలని సూచించింది. ప్రస్తుతం ప్రైవేట్, ఎయిడెడ్‌లో పనిచేస్తూ సరైన విద్యార్హతలు లేని ఉపాధ్యాయులు సెప్టెంబర్ 15 నాటికి ఉపాధ్యాయ విద్య కోర్సులో చేరినవారే కొనసాగాలి. లేనిపక్షంలో వారిని ఉద్యో గాల నుంచి తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

అనర్హులు ఎంతమంది..?: విద్యాశాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 11,262 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, అందులో 92,675 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. జిల్లా పాఠశాల విద్యా సమాచారం(డైస్) కింద సేకరించిన సమాచారం ప్రకారం 3,905 మంది ప్రైవేట్ టీచర్లు ఉపాధ్యాయ విద్య(బి.ఎడ్, డి.ఎడ్) లేకుండా పనిచేస్తున్నారు. అలాగే 720 ఎయిడెడ్ పాఠశాలల్లో 3,177 మంది టీచర్లు పనిచేస్తుండగా, వారిలో 25 మంది నిర్ధేశిత విద్యార్హత లు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. అయితే చాలా పాఠశాలలు టీచర్ల విద్యార్హతలకు సంబంధించిన సమాచారాన్ని డైస్‌లో పొందుపరచడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యాజమాన్యాలు అర్హులైన టీచర్ల సమాచారమే ఇస్తున్నారు కానీ అనర్హులు సమాచారం ఇవ్వడం లేదని సమాచారం. రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 32 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలల్లో సుమారు 4 లక్షల మంది టీచర్లు పనిచేస్తుండగా, అందులో లక్ష మందికిపైగా టీచర్లకు నిర్ధేశిత విద్యార్హతలు లేనివారు ఉంటారని సమాచారం. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో టీచర్ల విద్యార్హతలపై యాజమాన్యాలకు ముందుగా అవగాహన కల్పించి, చర్యలు చేపట్టేందుకు విద్యా శాఖ సమాయత్తమవుతోంది.

పెట్టుబడుల ఉపసంహరణను వ్యతిరేకిస్తూ బీమా ఉద్యోగుల నిరసన ప్రదర్శన



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రభుత్వరంగ సాధారణ బీమా కంపెనీలలో పెట్టుబడుల ఉపసంహరణను వ్యతిరేకిస్తూ బీమా సంస్థల ఉద్యోగులు గురువారం హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అఖిల భారత ఇన్స్యూరెన్స్ ఉద్యోగుల అసోసియేషన్ (ఐఐఇఎ) ఇచ్చిన పిలుపు మేరకు యునైటెడ్ ఇండియా రీజినల్ కార్యాలయం ముందు మధ్యాహ్నం నిర్వహించిన నిరసన ప్రదర్శనలో నేషనల్, న్యూఇండియా, ఓరియంటల్, యునైటెడ్ ఇండియా ఉద్యోగులు పాల్గొన్నారు. ఎఐఐఇఎ సహాయ కోశాధికారి కె.వి.వి.యస్.యన్.రాజు మాట్లాడుతూ సాధారణ బీమా కంపెనీలైన జిఐసి ఇన్స్యూరెన్స్, న్యూఇండియా కంపెనీలలో పెట్టుబడుల ఉపసంహరణ చర్యలను వెంటనే ఉపసంహరించుకోనట్లయితే సమ్మె చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని నాలుగు సాధారణ బీమా కంపెనీలను విలీనం చేయాలని వారు డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్‌జిఐఇఎ ప్రధాన కార్యదర్శి వై.సుబ్బారావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడానికి బదులుగా వాటి నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకోవడం ద్వారా బలహీనపరిచే చర్యలను చేపడుతుందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరిచి ప్రైవేటుపరం చేసే కుట్రలో భాగంగానే పెట్టుబడుల ఉపసంహరణకు పాల్పడుతున్నదని ఆరోపించారు.

కౌలు రైతు ఆత్మహత్య

మన తెలంగాణ/ హాలియా: కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అనుముల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనుముల గ్రామానికి చెందిన గొంగడాల కొండల్(22) తన సొంత భూమి 3 ఎకరాలు, మరో 5 ఎకరాలను కౌలుకు తీసుకొని అందులో పత్తి పంట వేయగా గత మూడు సంవత్సరాలుగా దిగుబడి రాక పోగా 7 లక్షల రూపాయలు అప్పు కావడం, ఈసారి వేసిన పత్తిలో వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి వస్తుందో రాదో అని తెచ్చిన అప్పు ఎలా తీర్చాలని తీవ్ర మనస్థాపానికి గురై గురువారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి గొంగడాల చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. సతీష్ పేర్కొన్నారు.



పోరాటాలతోనే హక్కులను సాధించుకుందాం

హెచ్‌యూజె కార్యవర్గ సమావేశం పిలుపు



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: ఉత్సాహవంతులైన యువ జర్నలిస్టులతో ఏర్పాటైన హెచ్‌యుజె నూతన కార్యవర్గం వినూత్న కార్యక్రమాలతో అవిశ్రాంతంగా శ్రమించాలని ఐజెయు సీనియర్ నాయకులు, మన తెలంగాణ దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యుజె) నూతన కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. హెచ్‌యుజె అధ్యక్షుడు రియాజ్ ఆహ్మద్ అధ్యక్షతన బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. కార్యదర్శి శంకర్‌గౌడ్ నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా పాలకులను యాచించి సమస్యలను పరిష్కరించుకునే దుస్థితి నాటి నుంచి నేటి వరకు సంఘానికి లేదని, పోరాటాలతో నిలదీస్తూ హక్కులను సాధించుకోవాలని హెచ్‌యూజె కార్యవర్గ సమావేశం పిలుపునిచ్చింది. హైదరాబాద్ నగరంలో హెల్త్‌కార్డులు, జర్నలిస్టులపై దాడులు, లోకల్ రిపోర్టర్లకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు తదితర సమస్యలపై కార్యవర్గం చర్చించింది. ఐజెయు సెక్రటరీ జనరల్ దేవులపల్లి అమర్ మాట్లాడుతూ టియుడబ్ల్యూజెకు అనుబంధంగా ఉన్న హెచ్‌యుజెకు దాదాపు నాలుగు దశాబ్దాల గొప్ప పోరాట చరిత్ర ఉందన్నారు. ఈ సమావేశంలో టియుడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, ఐజెయు కార్యదర్శి నరేందర్‌రెడ్డి, జాతీయ కార్య వర్గసభ్యుడు మాజీద్,రాష్ట్ర నాయకులు రాజేష్,హెచ్‌యుజె సలహాదారుడు ఎం.శ్రీనివాస్ ఆర్యన్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి మధు తదితరులు పాల్గొన్నారు.




కొత్త జిల్లా కలెక్టరేట్లు, ఎస్‌పి కార్యాలయ స్థలాల ఖరారుపై సచివాలయం నుంచి గురువారం నిర్వహించిన వీడియా కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలకు దిశా నిర్దేశం చేస్తున్న చీఫ్ సెక్రటరీ ఎస్‌పి సింగ్

త్వరలో ఒబిసి వర్గీకరణ!

మన తెలంగాణ/న్యూఢిల్లీ: రాష్ట్రాల తరహాలో జాతీయ స్థాయిలో ఒబిసిలను వర్గీకరించే విషయమై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని, ఇందుకోసం త్వరలోనే జాతీయ బిసి కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్ర సామాజిక, న్యాయ సాధికారిక మంత్రి థావర్ చంద్ గెహ్లాట్ అన్నారు. ఢిల్లిలోని పార్లమెంట్ హౌస్‌లో కేంద్రమంత్రితో రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం గురువారం భేటీ అయింది. ఈ సమావేశంలో దేశ్యాప్తంగా బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ సమావేశాలలోనైనా జాతీయ బిసి కమిషన్ బిల్లుకు ఆమోదం తెలపాలని, జాతీయ స్థాయిలో ఓబిసిలను మూడు గ్రూప్‌లుగా వర్గీకరించాలన్నారు. బిసి జానాభా లెక్కలను అధికారికంగా వెల్లడించాలన్నారు. కేంద్రమంత్రి గెహ్లోట్ సానుకూలంగా స్పందిస్తూ మళ్లీ రెండు, మూడు నెలల్లోనే పార్లమెంట్ సమావేశాలు ఉంటాయని, సవరణలతో కాకుండా నూతన జాతీయ బిసి కమిషన్ బిల్లు రూపొందిస్తామన్నారన్నారు. అలాగే సంచార జాతులను వేర్వేరుగా ఉండాలనే ఆలోచన కేంద్ర పరిశీలనలో ఉందన్నారు. ఇందుకోసం రెండు నెల్లలోనే జాతీయ బిసి కమిషన్ గానీ, కమిటీ వేయాలనే యోచనలో ఉన్నట్లు తెలిపారని జాజుల శ్రీనివాస్ గౌడ్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో ఇ. నిరంజన్, ఎం. భాగ్యలక్ష్మి, దుర్గయ్య గౌడ్, వంటిపులి నాగరాజు, నాగేశ్ తదితరులు ఉన్నారు.





"నీ శత్రువుల మాటలు విను. ఎందుకంటే నీలోని లోపాలు, తప్పులు అందరికన్నా బాగా తెలిసేది వారికే.
-షేక్స్ పియర్"

సంపాదకీయం

సంకల్పాలు చెప్పుకుంటే సరిపోదు

మన దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలకమలుపును సంకేతించిన 'క్విట్ ఇండియా' పిలుపు దేశ ప్రజలను సంకల్ప సిద్ధులను చేసింది. ఐదేళ్లలో (1942–1947) స్వరాజ్యం సిద్ధింపచేసింది. మరో ఐదేళ్లలో 75వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోబోతున్నాం. '2022నాటికి నవభారతాన్ని నిర్మించేందుకుగాను–స్వచ్ఛభారత్, దారిద్ర్యరహిత భారత్, అవినీతి రహిత భారత్, టెర్రరిజం రహిత భారత్, మతతత్వ రహిత భారత్, కులతత్వరహిత భారత్‌ను మనందరం కలిసికట్టుగా సంకల్పిస్తూ ప్రతిన బూనుదాం'. 'క్విట్ ఇండియా' ఉద్యమ 75వ వార్షికోత్సవం (ఆగస్టు 9) సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దేశప్రజల ముందుంచిన 'సంకల్ప్ సె సిద్ధి'. లక్ష్యాలు సమున్నతంగా ఉన్నాయి. ప్రజలు సంకల్పించినంత మాత్రాన లక్ష్యాలు సిద్ధించవు. ప్రజలను ప్రేరేపించ గలిగిన, కార్యోన్ముఖుల్ని చేయగల ఉత్తేజకరమైన నాయకత్వం అవసరం. అహింసా సిద్ధాంత ప్రబోధకుడైన గాంధీజీ నాయకత్వం 'రేవో–చావో' (do or die) అని ఆనాడిచ్చిన పిలుపు ప్రజలను ఐక్యం చేసి కార్యరంగంలో దించింది. బ్రిటిష్ వలస ప్రభుత్వం జాతీయోద్యమ నాయకులందర్నీ జైల్లో పెట్టినా ప్రజలే నాయకులై వివిధ రూపాల్లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం సాగించారు. హిట్లర్ ఫాసిజాన్ని సోవియట్ ఎర్రసైన్యం, మిత్రరాజ్యాలు మట్టుపెట్టిన నేపథ్యం సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల నుంచి వలసదేశాలు స్వాతంత్ర్యం సముపార్జించుకునేందుకు బాటవేసింది. బ్రిటిష్‌వారు 'విభజించు–పాలించు' సిద్ధాంతంతో పోతుపోతూ భారతదేశాన్ని మతప్రాతిపదికపై విభజించారు. మత సామరస్యం కోసం నిలబడిన గాంధీజీని హిందూమతోన్మాది గాడ్సే తుపాకీతో కాల్చిచంపాడు. హిందూరాజ్య డిమాండ్‌ను త్రోసిపుచ్చుతూ జాతీయోద్యమ విలువలకు అనుగుణంగా ప్రజాస్వామిక, లౌకిక రాజ్యాంగాన్ని రాజ్యాంగ నిర్ణాయక సభ ఆమోదించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో 'క్విట్ ఇండియా' తీర్మానం ప్రతిపాదించిన జవహర్‌లాల్ నెహ్రూ స్వతంత్ర భారత తొలి ప్రధానిగా నవభారత నిర్మాణానికి బాటలు వేశారు. దేశ ప్రజల అదృష్టమో, దురదృష్టమో నెహ్రూ కుటుంబమే దీర్ఘకాలం పరిపాలించినందున గత 70 ఏళ్ల దేశగమనంలో మంచి–చెడులు రెండింటికీ అదే బాధ్యురాలు.

క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారంనాడు లోక్‌సభలో ప్రసంగించిన ప్రధాని మోడీ, వచ్చే ఐదేళ్లలో స్వాతంత్ర్య సమరయోధులు కలలకనుగుణమైన భారత్ నిర్మాణానికై రాజకీయ పార్టీలు సైద్ధాంతిక విభేధాలను పక్కనబెట్టి కొన్ని అంశాలపై ''ఉమ్మడి కృషి''కి కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. అయితే పలువురు స్వాతంత్ర్య యోధులపేర్లు ప్రస్తావించిన ప్రధానమంత్రి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరు దాటవేశారు. ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపిలు నెహ్రూ పేరును ఉద్దేశపూర్వకంగా మరుగు పరిచే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, క్విట్ ఇండియా ఉద్యమ పవిత్ర సంస్మరణ సందర్భంలో ప్రధాని ఆ పేరు ప్రస్తావించి ఉంటే ఔచిత్యంగా ఉండేది.

స్వాతంత్ర్యోద్యమంలో, నవభారత నిర్మాణంలో నెహ్రూ పాత్రను గుర్తు చేయటం కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధి వంతు అయింది.''భారతదేశం అనే భావన సంకుచితత్వం, విభజనతత్వం, మతోన్మాద భావజాలంలో బందీకావటాన్ని మనం అనుమతించరాదని క్విట్ ఇండియా వార్షికోత్సవం మనకు గుర్తు చేస్తున్నద''ని భావస్ఫోరకంగా అన్నారు. ''లౌకిక, ప్రజాస్వామిక, ఉదార విలువలు ప్రమాదంలో ఉన్నట్లున్నాయి. చర్చ, భిన్నాభిప్రాయాలకు అవకాశం కుంచించుకుపోతున్నది. అనేకసార్లు, చట్టవిరుద్ధ శక్తులు చట్టపాలనపై ఆధిపత్యం వహిస్తున్నట్లు కనిపిస్తున్నదని'' మర్మగర్భంగా వ్యాఖ్యానించారు.

బిజెపి ప్రభుత్వ ఆర్థిక విధానాలతో, సంఘ్‌పరివార్ దుందుడుకు చేష్టలతో, ప్రధాని ప్రతిపాదించిన సంకల్పాలు ఎంతమేరకు నెరవేరతాయో ఎవరైనా ఊహించుకోవచ్చు. జాతి, మత, కుల భిన్నత్వాలతో నిమిత్తం లేకుండా ప్రజలందర్నీ కలుపుకు పోగలిగిన విధానాలే భిన్నత్వంలో ఏకత్వాన్ని పరిరక్షిస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలవు. అవినీతి రహితమైన ఉజ్వల భారత్ నిర్మాణానికి, మంచి పరిపాలన, సైన్స్ అండ్ టెక్నాలజీలో పురోగతి, సామరస్యం, జాతీయతత్వం, ప్రజాస్వామ్య విలువలకు నిబద్ధమైన భారత్ నిర్మాణానికి కృషి జరగాలంటూ ఈ సందర్భంగా లోక్‌సభ ఆమోదించి తీర్మానం మార్గదర్శకం కావాలి.

త్రివిధ దళాల ఏకీకరణ?

చూపు

రక్షణ శాఖలో సైబర్, స్పేస్ తదితర ప్రత్యేక కార్యకలాపాల విభాగాన్ని త్వరలో నెలకొల్పనున్నట్లు ఆ శాఖ కార్యదర్శి ఇటీవల త్రివిధ దళాల కమాండర్ల సమావేశంలో ప్రకటించారు. ఈ సంకల్పం సైన్యం, నౌకాదళం, వైమానికదళం మూడింటిని ఒక గొడుగు కిందకు తేవడానికి ఉద్దేశించింది. అందువల్ల ఆ దళాల ఉమ్మడి సామర్థ్యం మరింతగా పెంపొంది భవిష్య యుద్ధాలకు దీటుగా మన సన్నద్ధత రూపుదిద్దుకుంటుందని ఆశిస్తున్నారు. గగనతల, సైబర్ యుద్ధ రీతులను మిళితం చేయడం, ఉమ్మడి కార్యకలాపాల కమాండ్లను నెలకొల్పడం అన్న ఆలోచన 40 ఏళ్ల నాటిది. ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయిల్లో అధికారులు అందుకు సంకల్పించాలి. అయితే ఆ స్థాయిలో ఆ ఆలోచనకు సంపూర్ణ మద్దతు ఇంతవరకు లభించలేదు. పాకిస్థాన్, చైనాలతో సరిహద్దు ఉద్రిక్తతలు ముదురుతున్న ప్రస్తుత నేపథ్యంలో కూడా ఆ ప్రతిపాదన విషయంలో కదలిక కొరవడింది.

జాతీయ భద్రతా సలహాదారు కార్యాలయం నుండి ఇటీవల ఈ ప్రతిపాదన మళ్లీ వినిపించింది. గత సెప్టెంబర్ 18న కశ్మీర్‌లోని యురి సైనిక స్థావరంపై పాక్ ఉగ్ర దాడి తర్వాత ఆ సలహాదారు ఈ విషయమై ప్రయత్నాలు మొదలుపెట్టారు. 19మంది సైనికులు మరణించిన ఈ దాడి పాక్ నుంచి చొరబడిన ఉగ్రవాదులు సాగించినదని భావిస్తున్నారు. ఆధునిక తరహా యుద్ధ పద్ధతులకు తాము తయారుగా లేని విషయం మన సైన్యానికి తెలుసు. అందుచేత తక్షణ సంస్కరణలు మన సైన్యంలో ప్రవేశపెట్టవలసిన అవసరం ఉంది. అంతేకాకుండా యురి వంటి ఉగ్ర దాడులు సాంప్రదాయ ఆయుధాలతో జవాబు చెబితే ఆగే ప్రశ్నే లేదని కూడా మన సైన్యంలో అవగాహన పెంపొందుతోంది. అందుచేత ఆధునిక సామర్థ్యాన్ని పోరాట రీతుల్లో అవలంబించాల్సిన అవసరం ఉంది.

ఈ అంశాలు పరిశీలించి, ప్రభుత్వానికి సిఫార్సులు చేయాల్సిందిగా సైన్యం, నౌకాదళం, వైమానిక దళాల ఉప అధిపతులకు సూచించారు. సాయుధ దళాలకు సంబంధించిన వివిధ విభాగాల మధ్య మంచి సమన్వయం వుండేలా చూడాలని, రక్షణ బలగాల యాజమాన్యంలో సంస్కరణలు ప్రవేశపెట్టాలని గతంలో అనేకసార్లు సూచించడం జరిగింది. 1999లో కార్గిల్ రివ్యూ కమిటీ నుంచి 2012 నాటి నరేష్ చంద్ర టాస్క్ ఫోర్స్ దాకా అనేక కమిటీలు చేసిన సిఫార్సులపై పురోగతి లేదు. ఫలితంగా కాలం చెల్లిన సైన్యం మనకు మిగిలింది. ఆధునిక యుద్ధరీతులు అవలంబించడానికి కావలసిన ఉమ్మడి పోరాట సామర్థ్యం దానికి కొరవడింది.

ఈ లోపం గురించి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ప్రధాని మోడీతో, అప్పటి రక్షణ మంత్రి మనోహర్ పారికర్‌తో చర్చించారని తెలిసింది. సైనిక ప్రధాన కార్యాలయం వారు కూడా అందించిన సమాచారం పరిశీలించిన అధికారుల బృందం 'ప్రత్యేక కార్యకలాపాల విభాగం' నెలకొల్పాలన్న సిఫార్సుతో ముందుకు వచ్చింది. గత 10 ఏళ్లుగా అనేక రక్షణ సంబంధిత సంస్థలు అటువంటి ఉమ్మడి కమాండ్‌ల ప్రస్తావన చాలా సార్లు చేశాయి. అయితే ఆయా సర్వీసుల మధ్య అంతర్గతంగా ఉన్న ఎడంవల్ల ఈ ప్రతిపాదన నిజం కాకుండా ఉండిపోయింది. ఒక సీనియర్ సైనికాధికారి చెప్పినట్లు రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన త్రివిధ సర్వీసుల ఏకీకరణ ప్రతిపాదన కార్గిల్ రివ్యూ కమిటీ చేసింది. అయితే ప్రభుత్వం, అధికార గణం, చివరకు సైన్యం వ్యతిరేకించిన ఫలితంగా ఈ సంస్కరణ ఆచరణలోకి రాకుండా మిగిలిపోయింది.



ఉమ్మడి థియేటర్ కమాండుల ప్రతిపాదనను సైన్యం వ్యతిరేకిస్తూనే ఉంది. త్రివిధ దళాల ఐక్య కమాండ్ల వల్ల వాటిమధ్య సమన్వయం, సంఘీభావం పెరుగుతుంది. తూర్పు సరిహద్దులకు సంబంధించిన ఆర్మీ కమాండర్ కలకత్తాలో కూర్చుంటారు. వైమానిక కమాండర్ షిల్లాంగ్‌లో, నౌకాదళ కమాండర్ విశాఖపట్నంలో ఉంటే ఉమ్మడి దళంగా ఎలా పోరాటం చేయగలం అన్నది ఆయన ప్రశ్న. ఉత్తర, పశ్చిమ ఫ్రంట్లలో కూడా అదే పరిస్థితి ఉంది.

అమెరికా సైన్యం నుంచి మన సైన్యం ఈ విషయంలో పాఠాలు నేర్చుకోవాలి. సాంప్రదాయబద్ధంగా అలవాటయిన రీతిలో ఆలోచించడం మానాలి. 1980లో ఇరాన్‌లో 52 మంది అమెరికా పౌరులు బందీలుగా ఉన్నప్పుడు అధ్యక్షుడు జిమ్మికార్టర్ ఒక విస్తృత సహాయక వ్యూహాన్ని ఆమోదించారు. 'ఆపరేషన్ ఈగిల్ క్లా' దాని సంకేత నామం. ఈ సంక్లిష్టమైన వ్యూహం ప్రకారం అనేక బలగాలు ఏకమయి రహస్యంగా టెహ్రాన్‌కు 200 మైళ్ల అవల దిగాయి. చివరకు బందీలను రక్షించే ప్రయత్నంలో విఫలమైనా అమెరికా సైన్యాన్ని ఆమూలాగ్రం క్షాళన చేయడానికి ఆ అనుభవం దారి తీసింది. ఫలితంగా 'గోల్డ్ వాటర్ నికోల్స్ రక్షణశాఖ పునర్వ్యవస్థీకరణ చట్టం 1986లో వచ్చింది. అలాగే 1987 ధ్రువీకరణ చట్టానికి ప్రత్యేక సవరణ తెచ్చారు. దాని కింద ప్రత్యేక కార్యకలాపాల ఉమ్మడి కమాండ్ అస్తిత్వంలోకి వచ్చింది. అందులో అమెరికా సైన్యం, నౌక, వైమానిక దళాలకు చెందిన ప్రత్యేక బలగాల ప్రతినిధులు ఉన్నారు.

మన దేశంలో త్రివిధ దళాల ఉమ్మడి కమాండ్ల విషయంలో ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేస్తే రెండు అడుగులు వెనక్కి వేస్తున్నట్లుగా కదులుతోంది. గతనెల మొదట్లో ఉమ్మడి కమాండర్ల సమావేశంలో రక్షణ కార్యదర్శి చేసిన తాజా ప్రకటన తర్వాత కొన్ని రోజులకు ప్రతిష్టాత్మక కాంబ్రియన్ గస్తీ విన్యాసాల్లో పాల్గొనడానికి సైన్యాన్ని అనుమతించలేదు. ఈ అంతర్జాతీయ విన్యాసాలు ప్రపంచంలోనే సంక్లిష్టమైనవని పేరుపడ్డాయి. అనేక దేశాలు ఇందులో పాల్గొని ఉమ్మడి సామర్థ్యాన్ని పెంచుకుంటాయి. వీటిలో భారత్ పాల్గొనక పోవడానికి చెప్పిన అధికారిక కారణం ఏమిటంటే ధీటయిన విధంగా మన సైన్యం తయారు కాలేదని. గతంలో ఈ విన్యాసాల్లో మన సైన్యం అనేక పతకాలు గెలిచింది. వాటిలో స్వర్ణ పతకాలు కూడా ఉన్నాయి. ఈ ఉదంతాలను ప్రధాని నరేంద్రమోడీ అప్పుడు ప్రశంసించారు కూడా.

అయితే ఇప్పుడు ఆ విన్యాసాల్లో పాల్గొనలేని పరిస్థితిలో మన సైన్యం ఉండడం పొంతనలేని విషయం. నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) దేశాలు వాడే ఆయుధాలతోనే ఆ విన్యాసాలు జరుగుతాయని కొందరి వాదన. అవి భారతీయ పరిస్థితులకు సరిపడవని వారంటున్నారు. నాటో దేశాలకు మాత్రమే ప్రత్యేకమైన ఆయుధాలను భారత సైన్యం కూడా వాడుతున్న విషయం వారు మరిచారు. మరింతగా అటువంటి ఆయుధాలను కొనడానికి పథకాలు కూడా ప్రభుత్వం రూపొందిస్తోంది. సాంప్రదాయ రష్యా ఆయుధాల స్థానే వాటిని కొనదలిచారు. అటువంటప్పుడు ఆ విన్యాసాలకు దూరంగా ఎందుకు ఉంటున్నట్లు? దీనికి సూటైన జవాబు లేదు.

*** మంజునాథ కిరణ్**

కాలుష్య కర్మాగారం

ఫార్మా సిటీ నిర్వాసితులు, కాలుష్యం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నప్పుడు, తెలంగాణాలో విపరీతంగా పెరుగుతున్న పారి శ్రామిక కాలుష్యం ఒక అవినీతిమయ, ఆలోచనా రహిత, స్థానిక వనరులకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రపూరిత పరిణామంగా చూసిన రాజకీయ దృక్పథం మనకు తెలిసిందే.

తెలంగాణా రాష్ట్రంగా ఏర్పడినాక ఈ జాడ్యం పోతుందని, కాలుష్య భూతానికి పరిష్కారం లభిస్తుంది అని అంతా భావించారు. ఇక్కడి ఆకాంక్షలకు, వనరులకు, పరిస్థితులకు అనుగుణమైన పారిశ్రామిక అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన జరుగుతది అని ప్రజలు ఆశించారు. కాని, గత మూడు ఏళ్లలో, ఇంకో 169 ఫార్మా కంపెనీలకు అనుమతి లభించటం, ప్రస్తుతం ఉన్న కంపెనీలు 'ఉత్పత్తి సామర్థ్య' విస్తరణకు దరఖాస్తు చేయటం, అనుమతులు పొందటం, ఫార్మా సిటీ ప్రాంతానికి రూపకల్పన జరగడంతో వీటి మీద 'నీళ్లు' పోసినట్లే. అత్యంత భయంకరమైన కాలుష్యం ఎదుర్కొంటున్న గ్రామాలకు తోడు, ఇంకా అనేక తెలంగాణా గ్రామాలను కూడా ఈ ఫార్మా కంపెనీల అభివృద్ధి వల్ల ఏర్పడే 'నర్మ'కాండలో విధిలేని పరిస్థితులలో నూకుతున్నారు.

తెలంగాణ సహజవనరుల భక్షణతోపాటు, కలుషితం అవ్వడం వలన, గ్రామీణ జీవనం తీవ్ర అనారోగ్యం పాలు అయ్యే పరిస్థితులను రాష్ట్రప్రభుత్వ నిర్ణయాలు సృష్టిస్తున్నాయి.

మూస ధోరణిలో, విస్తృత సంప్రదింపులు లేకుండా, వనరుల మదింపు లేకుండా, అనుభవాలను పరిగణనలోకి తీసుకోకుండా, ఏకాఎకిన పెట్టుబడిదారులకు అనుగుణంగా నూతన పారిశ్రా మిక విధానాన్ని తయారు చేయడం శోచనీయం.

జిడిపి ఆధారంగా ప్రణాళిక రచన ప్రపంచ వ్యాప్తంగా తగ్గుతున్నతరుణంలో, సహజ వనరులను ధ్వంసం చేసే పారిశ్రామిక ప్రక్రియలు తెలంగాణ ప్రజలకు విఘాతం కలిగిస్తాయి. ప్రోత్సాహకాలు, రాయితీలు, ఇంకా ఇతర 'బుజ్జగింపు'లతో కూడిన ప్రస్తుత తెలంగాణ పారి శ్రామిక విధానం 'రెడ్' క్యాటగిరి పరిశ్రమల ఏర్పాటుకు రెడ్ కార్పెట్ పరుస్తున్నది. ease of doing business, single window clearance తదితర సంస్కరణలు పారిశ్రామిక కాలుష్యం వంటి తీవ్ర సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నాయి.

ప్రజల మీద, పర్యావరణం మీద పారిశ్రామిక కాలుష్య దుష్ప్రభావం పెరుగుతున్నది.

చేయాల్సింది :

- పర్యావరణ అనుకూల, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణా రాష్ట్ర పారిశ్రామిక విధానం రూపకల్పన జరగాలి.
- TSiPASS, Ease of Doing Business, ఫార్మా సిటీ ప్రతిపాదనలను సమీక్షించాలి.
- పారిశ్రామిక కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి.
  గ్రామాలను, ప్రజలను కాలుష్యం నుంచి కాపాడాలి.
- వ్యవసాయ యోగ్య భూమిని ఎట్టి పరిస్థితులలో మార్చరాదు.
- ఫార్మా కంపెనీలను కొత్తగా, కొత్త యూనిట్లను, తెలంగాణా రాష్ట్రంలో అనుమతించవద్దు.
- సమగ్ర నష్ట పరిహార ప్యాకేజీ ప్రకటించాలి.
- పారిశ్రామిక కాలుష్యాన్ని ఉపేక్షించరాదు. గట్టి చర్యలు చేపట్టాలి.
- తెలంగాణా అభివృద్ధి నమూనా తయారు చేసి, ప్రజలతో సంప్రదింపుల ద్వారా దానిని ఆమోదించాలి.

*** డా॥దొంతి నరసింహారెడ్డి,**
nreddy.donthi16@gmail.com



- * 20 శాతం ఎగుమతులు హైదరాబాద్‌నుంచి (భారత ఫార్మా ఎగుమతులు)
- * దేశంలో, మూడింటిలో ఒక శాతం ఫార్మా ఉత్పత్తి తెలంగాణాలో
- * తెలంగాణాలో 412 ఫార్మా కంపెనీలు (173బల్క్ డ్రగ్స్ కంపెనీలు)
- * ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ (2009–10)లో 566 ఫార్మాకంపెనీలు.
- * ప్రపంచ మందుల ఉత్పత్తిలో దాదాపు 10శాతం భారత్‌లో జరుగుతోంది. పరిమాణంలో, విలువపరంగా భారత్ వాటా 2.4శాతం ఉంది.
- * భారత కంపెనీల ఆదాయంలో 70శాతం జనరిక్ ఔషధాల ద్వారానే లభిస్తోంది.
- * మందుల పరిశ్రమ మొత్తం విక్రయాలు రూ.2,10,622.50కోట్లు.
- * ఇందులో రూ.1,07,226కోట్లు ఎగుమతులు
- * 2016లో అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ ప్రపంచవ్యాప్తంగా(డీఏఎఫ్‌యూఎస్)598 ఏఎన్‌డీఏలకు ఆమోదం తెలపగా, భారత కంపెనీలు అందులో 201అనుమతులు (33.6%) పొందాయి.

ఎడిటర్‌కు లేఖలు

కన్నీళ్ల నేరెళ్లను ఓదారుద్దాం..

సాధారణ జన జీవనానికి తీవ్ర విఘాతం కలగటమే నేరెళ్ల లొల్లికి అసలు కారణం..ఒకటి కాదు రెండు కాదు అనుమతించిన లారీలు, ట్రక్కులే వెయ్యి. అనధికారికంగా మరో అయిదు వందల వరకూ వాహనాలు రేయింబవళ్ళూ ఆ పల్లె గుండెల మీద రయ్ రయ్ మని రాకపోకలు సాగిస్తూ కంటి మీద కునుకు లేకుండా చేయటమే కాదు అధిక స్పీడు అజాగ్రత్త డ్రైవింగులతో స్థానికుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తున్నాయ్..

ఈ కారణంగా ఆ గ్రామంలో ఎందరో గాయపడ్డారు మరి కొందరు ప్రాణాలు పోగొట్టుకున్నారు.. ప్రమాదాల తీవ్రత ఎంత అంటే ప్రమాదాలకు గురైన వారు కోలుకోకముందే మరెవరో గాయపడటం ప్రాణాలు కోల్పోయిన సంఘటన మరువకమునుపే మరెవరికో ఆపద వాటిల్లటం..

ఇసుక రీచులనుండి కోట్లు తవ్వుకోవటం తెలిసిన కాంట్రాక్టర్లు గ్రామంలో వేగాన్ని నియంత్రించే స్పీడ్ బ్రేకర్లు వేయించడం వంటి జాగ్రత్తలు చేపట్టకపోవటంతో రోడ్లు తదితర సహజ వనరుల విధ్వంసంతోపాటు ప్రాణాలను మూల్యంగా చెల్లించాల్సి వస్తోంది..

దుమ్ము ధూళి వాహనాల పొగ, లౌడ్ హారన్ల రొదలతో వాతావరణ కాలుష్యం గ్రామాన్ని ప్రశాంత పల్లె జీవనాన్ని అన్ని విధాలా విచ్ఛిన్నం చేస్తుండటంతో గ్రామస్తుల తిరుగుబాటు మొదలయ్యింది. ఈ నేపథ్యంలో ఇసుక రవాణా తీరును ప్రశ్నించటం.. సరైన సమాధానం రాని కారణంగా అడ్డగించటం ఆందోళనలకు పూనుకోవటంతో నేరెళ్ళ అందరి నోళ్ళల్ల నానుతోంది..

ఉధృతమైన ఆందోళనలో భాగంగా స్థానికుల్లో కొందరు తీవ్ర ఆగ్రహానికి లోనై ఇసుక రవాణా లారీలకు నిప్పు పెట్టటంతో నేరెళ్ళ యుద్ధభూమిగా మండుతోంది..

ఇసుక కాంట్రాక్టర్లకు సంబంధించిన విలువైన వాహనాలను దగ్ధం చేశారన్న కారణంగా ఆ ఊరికి చెందిన దళితులు వెనుకబడిన తరగతులకు చెందిన వారిని చిత్రహింసల పాలు చేశారు.. ఎంతంటే సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేంత.. మనిషిలో ఆటవికత్వం ఇంకా మిగిలే ఉంది అన్నంత..

వాహనాలు తగులబెట్టి ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేయటం నేరమే.. ప్రకృతిని విధ్వంసం చేసిన ఇసుక మాఫియా చర్యలను నేరంగా పరిగణించని నిర్లక్ష్యం ఫలితంగానే ఆ సంఘటన చోటు చేసుకుంది అన్న విషయమూ వాస్తవమే.

– కంచర్ల శ్రీనివాస్

అంగవైకల్య ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ సదరం అమలు పరచాలి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడే రాష్ట్రప్రభుత్వం వికలాంగుల వైకల్యాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్ధారించుటకొరకై సదరం క్యాంపుల ద్వారా కంప్యూటర్ పద్ధతిలో అంగవైకల్య, మెడికల్ ధృవీకరణ పత్రాల్ని జారీచేయడం ఆరంభించింది. దీనిప్రధాన ఉద్దేశం అర్హులైన వికలాంగులకే లబ్ది చేకూర్చడం, నకిలీ వైకల్య సర్టిఫికెట్లకు చోటు లేకుండా చేయడం.

సదరంకు ముందు సంబంధిత వైద్యులు జిల్లా మెడికల్ బోర్డుల పేరిట మాన్యువల్ సర్టిఫికెట్స్ మంజూరు కారణంగా నకిలీలకు స్థానం లభించింది. అర్హత లేని ఉద్యోగ ఉపాధ్యాయులు ఆక్టోపస్‌లా అన్ని ఉద్యోగ నియామకాలలో, నెలవారి అలవెన్సులు, బదిలీలు, ప్రమోషన్స్ తదితర లాభదాయక అవకాశాలన్నిటినీ పొందుతూ అర్హత గల వికలాంగులకు అన్యాయం చేస్తున్నారు. అంతే కాకుండాప్రభుత్వ ఖజానాను కూడా కొల్లగొడుతున్నట్లు ఇటీవల వెల్లడైన అక్రమాల వల్ల తెలుస్తున్నది. ఇది వరంగల్, కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో అర్హతలేని దొంగవైకల్య ఉపాధ్యాయులను గుర్తించిన రాష్ట్ర విద్యాశాఖ విచారణ జరిపిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెండ్ చేశారు.

ఇదే రాష్ట్రప్రభుత్వం సాధారణ వికలాంగులకు నెలనెలా ఇచ్చే రూ.1500/– పింఛనుకు సదరం 'సర్టిఫికెట్ అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఇదే విధానాన్ని కొన్ని జిల్లాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు'సదరం' అమలు చేస్తున్నా మరికొన్ని జిల్లాల్లో అమలు చేయడం లేదు. ఈ కారణంగా నకిలీ వైకల్యకారులు లబ్దిపొందుతూనే ఉన్నారు. దీనికి మన ఉమ్మడి వరంగల్ జిల్లాయే ఉదాహరణగా చెప్పవచ్చు.

ఇటీవల కేంద్రప్రభుత్వం ఏకీకృత సర్వీసులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కారణంగా త్వరలో బదిలీలు, ప్రమోషన్లు, రాష్ట్రప్రభుత్వ ఉపాధ్యాయ నియామకాలు జరిపే ప్రయత్నంలో ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది.

కావున 'సదరం' సర్టిఫికెట్ సమర్పించిన ఉపాధ్యాయులకి పైన పేర్కొన్న నియామకాలు, బదిలీలు, అలవెన్సులు, ప్రమోషన్స్ ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

– నల్లెల్ల రాజయ్య, రాష్ట్ర కార్యదర్శి
డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్,టిఎస్.

నేత కార్మికులకు అండగా ఉండాలి

తెలంగాణా రాష్ట్రంలో నేత కార్మికులకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ శాఖలు, పథకాలకు సేకరించే ప్రతి మీటర్ వస్త్రంని మన రాష్ట్ర నేత కార్మికుల నుండే కొనుగోలు చేయాలనుకోవటం హర్షణీయం.

కుల వృత్తులని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది కాబట్టి దీని కోసం ఒక వార్షిక క్యాలెండర్‌ను కూడా రుపొందించాలనుకోవటం సంతోషకరం. ఈ వార్షిక క్యాలెండర్ ద్వారా ఏ నెలలో ఎంత వస్త్రాలు కొనుగోలు చేయొచ్చు అని ఒక నిర్దిష్ట ప్రణాళిక ఉంటుంది. నేత కార్మికులను ఆర్థికంగా, సామాజికంగా అండగా ఉండాలని ప్రభుత్వం చేస్తున్న ఈ విధానం అభినందనీయం. బతుకమ్మ చీరల ద్వారా సిరిసిల్ల నేత కార్మికులకు, మరియు ఇతర ప్రాంతాల నేత కార్మికులు ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వం సంబంధించిన అన్ని శాఖలు కూడా అన్ని రకాల వస్త్రాల టెండర్‌లు నేత కార్మికులకే ఇవ్వాలి దీని ద్వారా నేత కార్మికుల సామజిక, ఆర్థిక అభివృద్ధి జరుగుతుంది. ఈ పనులను అధికారులు పారదర్శకంగా జరపాలి.

– కందగట్ల శ్రవణ్ కుమార్, సామజిక రచయిత, కాకతీయ యూనివర్సిటీ





సైకాలజిస్ట్ గీతతో ముఖాముఖి

సహనం పెరిగితే సమరం తప్పుతుంది

ఒక మనిషి విజయానికి వందకారణాలు ఉండవచ్చు.. కానీ, అపజయానికి ఒక కారణం చాలు.. అని మన పెద్దలు అంటారు. అందుకే విజయం చేరువ కావాలంటే శతవిధాల ప్రయత్నం చేయాలని చెబుతారు. అయితే అన్ని విధాల ప్రయత్నం చేసినా ఆత్మవిశ్వాసం లోపిస్తే.. జయం దరిచేరదని అంటున్నారు రచయిత్రి, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ చల్లా గీత. పిల్లలైనా, పెద్దలైనా వారి మనసెరిగి మాట చెప్పాలి అప్పుడే తాము ఎంచుకున్న రంగంలో రాణిస్తారంటున్నారు.

ప్రశ్న : సైకలాజికల్ కౌన్సెలింగ్ ఎందుకు? దాని వల్ల ఏమిటి ఉపయోగం?

ఆరోగ్యం అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది శారీరక ఆరోగ్యం మాత్రమే! శరీర ఆరోగ్యం అవసరమే కాదనను. కానీ మానసిక ఆరోగ్యం అంతే అవసరం..ఇంకో మాటలో చెప్పాలంటే అంతకన్నా అవసరం. మనసు అశాంతితో అల్లాడుతుంటే ప్రశాంతంగా పనులెలా చేసుకుంటాం? మనసు బాగోలేదని డాక్టర్ దగ్గరకు వెళదామా అంటే వాళ్ళను జనం పిచ్చివాళ్ళను చూసినట్టు చూస్తారు కానీ అలా చేయడం న్యాయంకాదు. మనసులో మంట ఉంటే సజావుగా బతకలేం.

ప్ర : అసలు మనిషికి మనశ్శాంతి ఎందుకు లోపిస్తుంది?

ప్రతి మనిషీ జీవితంలో అనేక సందర్భాలలో ఒత్తిడికి గురవుతాడు. అప్పుడే మాటలతో మనసు మళ్ళించి దారికి తెచ్చి మనిషిని చేయగల మనిషి కావాలి. గతంలో ఉమ్మడి కుటుంబాలుండేవి. ఇంట్లో అనేక తరాల పెద్దవాళ్లు ఉండేవారు. పిల్లల బాగోగులు, యోగక్షేమాలు పట్టించుకుంటూ ఉండేవారు. మంచీ చెడు చెబుతుండేవారు. గద్దించో, బుజ్జగించో వారిని దారినపెట్టే ప్రయత్నం చేసేవారు. ఒకరకంగా వీరే కౌన్సిలర్లే. ఇప్పుడన్నీ చిన్నకుటుంబాలు. ఒకళ్ళే ఇద్దరే పిల్లలు. తల్లీదండ్రి ఇద్దరూ పనిచేస్తేకాని రోజులు గడిచే పరిస్థితికాదు. ఆఫీసుల్లోనే నానా హైరానా పడి వచ్చే పేరెంట్స్‌కు పిల్లలను పట్టించుకుని వారి బాగోగులు చూసేంత ఓపిక ఉండడంలేదు. పైగా పిల్లలను అతిగా ముద్దుచేయడం, వారు అడిగింది లేదనకుండా ఇచ్చేయడం చేస్తున్నారు. అదేమంటే మేమెలాగూ ఏ ముద్దూ ముచ్చటా తీరకుండానే పెరిగాం. ఇప్పుడు మేమిద్దరం సంపాదిస్తున్నాం. మా దరిద్రం మా పిల్లలకెందుకు అంటారు. పెద్దల దరిద్రం పిల్లలకు ఉండకూడదన్న కోరిక న్యాయంగానే ఉన్నా అతిగా ముద్దుచేయడం వల్ల పిల్లలు పాడైపోతారు.

ప్ర : సైకలాజికల్ కౌన్సిలింగ్ ద్వారా మీరు చేస్తున్నదేమిటి? విద్యార్థులకు చెబుతున్నదేమిటి?

సైకలాజికల్ కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులలో ప్రతిభను బయటకు తీసుకువస్తున్నాం. పిల్లలలో పట్టుదల, నిరంతరం శ్రమించే గుణం ఉంది. దానికి మరింత పదునుపెడితే ఇంకా బాగా రాణించడానికి అవకాశం ఉంటుంది. ఆ ప్రయత్నమే మేం చేస్తున్నాం. నేను ఆరు సంవత్సరాలుగా గురుకుల విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాను. ప్రతినెలా ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లలోని అన్ని పాఠశాలలకు వెళ్లి లైఫ్ స్కిల్స్ గురించి చెబుతున్నాను. ఆ తర్వాత కూడా వారికేదైనా సమస్య వస్తే పర్సనల్‌గా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. దాదాపు 150 పాఠశాలలో చదివే లక్ష మందిపైగా విద్యార్థులకు ఇప్పటి వరకు కౌన్సెలింగ్ ఇచ్చాం. విద్యార్థులకే కాదు.. వారి తల్లిదండ్రులకు కూడా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఒక మైండ్ సెట్ ఏర్పాటుచేయడానికి ప్రయత్నిస్తున్నాం.

ప్ర : పేరెంట్స్‌కు కౌన్సెలింగ్ అవసరమా?

గురుకుల పాఠశాలలో చదివే పిల్లల తల్లిదండ్రులు చాలావరకు పేదవారు, నిరక్షరాస్యులు. వారికి పిల్లలను బడికి పంపించడం కన్నా ఏదైనా పనిలో పెడితే డబ్బులు వస్తాయన్న ఆలోచన ఉంటుంది. చదువు కన్నా పనికే వారు ఎక్కువ విలువనిస్తారు. నిరక్షరాస్యత కారణంగా వారిలో మూఢనమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. అలాంటి వాళ్లకు మేం కౌన్సెలింగ్ ఇస్తాం. దీన్ని పాజిటివ్ పేరెంటింగ్ ట్రైనింగ్ అంటారు.

ప్ర : దీని వల్ల ఏం జరుగుతుంది?

పాజిటివ్ పేరెంటింగ్ ట్రైనింగ్ వల్ల చదువు విలువ ఏంటో.. చదువు కోవడం ద్వారా జీవితాలు ఏలా మారిపోతాయో వారికి తెలుస్తుంది. ఇంట్లో గొడవగా ఉంటే హాయిగా ఉండాల్సిన వాతావరణం పాడైపోతుంది. పిల్లల ముందు గొడవ పడితే వారికి ఎంతో భయంగా ఉంటుంది. మానసికంగా ఎంతో డిస్టర్బ్ అవుతారు. అందుకని వారి ముందు గొడవ వద్దని చెబుతాం.ఇల్లన్నాకా ఏవో చిటపటలు లేకుండా ఉంటాయా? ఉంటాయి. కానీ ఎవ్వరూ లేప్పుడు మాట్లాడుకుని పరిష్కరించుకోవాలే తప్ప అందరూ ఉన్నప్పుడు కొట్టుకుని, తిట్టుకుని ఇల్లును యుద్ధరంగంగా మార్చేయకూడదు. తల్లిదండ్రుల గొడవలు పిల్లలను మానసికంగా కుంగదీస్తాయి.

ప్ర : ఈ కౌన్సిలింగ్ మొదలైందా? ఇంకా మొదలు పెట్టాలా?



ఇప్పటికే మొదలైందండి..2016లో యాభై వేల మందికి నిర్వహించాం.

ప్ర : ఇందువల్ల పెద్దవాళ్ళలో ఏమైనా మార్పు కనిపించిందా?

ఇప్పుడిప్పుడే వాళ్ళ ఆలోచనా ధోరణిలో మార్పు వస్తోంది. వాస్తవాలు గ్రహించుకుంటున్నారు. గురుకుల పాఠశాలలకు పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు ధైర్యంగా ముందుకు వస్తున్నారు.

కాసేపు వాళ్ళ సంగతటుంచుదాం. చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న నేటి యువతరం అమ్మానాన్నలు కూడా చిన్నచిన్న విషయాలకే అసహనం పెంచేసుకుని దెబ్బలాడేసుకుంటున్నారు..

భార్యభర్తల మధ్య వచ్చే చిన్న తగవులు, ఇగోల కారణంగా చిన్నచిన్న సమస్యలు కూడా పెద్దగా మారుతున్నాయి. ఆఫీసులో గడబిడలను ఇంటిదాకా తెచ్చుకోవడం వల్ల కూడా ఈ ఇబ్బంది తలెత్తుతోంది. ఎక్కడివి అక్కడే వదిలేసి వస్తే బాగుంటుంది. ప్రతీదీ మనసుకు తీసుకోవడం మంచిదికాదు. ఇద్దరూ ఆఫీసుకు వెళ్ళేవారైనపుడు ఎవరో ఒకరికి చిర్రుబుర్రుతనంగా ఉండడం సహజం. అలాంటప్పుడు రెండోవారు కాస్త ఓపిక పట్టి సర్దుకుంటే సమస్యరాదు. ఒకరన్నారు కదా అని రెండోవారు కూడా రెచ్చిపోయి మాటకు మాట అంటే వివాదం చినికి చినికి గాలివానగా మారుతుంది.

ప్ర : ఈ గొడవలకు కారణమేంటి?

స్పీడ్ యుగం. లేచిందగ్గర్నుంచి పడుకునే వరకు ప్రతిపనిలోనూ ఓవర్‌స్పీడ్ అయిపోయి జీవితం పరుగుపందెంలా తయారైంది. ఉరుకుల పరుగుల వల్ల శారీరకంగా అలసిపోతున్నారు. మానసిక ఒత్తిడి పెరిగి మాటమాట అనుకుంటున్నారు. ఈ కస్సుబుస్సులు పెరిగి పెరిగి గొడవలకు దారి తీస్తున్నాయి. కుటుంబ జీవితం అశాంతితో నిండిపోతోంది. అటు తల్లిదండ్రులు, ఇటు పిల్లలు మానసిక సమస్యలతో సతమతమవుతున్నారు. వీరి గోడు విని పట్టించుకునే వారు లేకపోవడంతో భావోద్రేకాలు బైటికి పోయే దారి దొరకడం లేదు.

ప్ర : మరి దీనికి పరిష్కారమేలేదా?

ప్రతి ఒక్కరికీ సమస్య ఉన్నట్టే ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుంది. దీనికి ప్రధానంగా ప్రతీ ఒక్కరికి అంటే అమ్మానాన్నకు, పిల్లలకు ఓదార్పుకావాలి. ఇది ఇవ్వడానికి పెద్దవాళ్ళు ఉండడంలేదు కనుక ఎవరో ఒకరు కాస్తంత సంయమనం పాటించాలి. మనసులో బాధ వినేవారుంటే ఎదుటివాడు తేలకపడతాడు. ఆ తర్వాత తన బాధ చెప్పుకోవచ్చు. మనసులో బాధ చెప్పుకుంటే పోతుంది. ఆనందం పంచుకుంటే పెరుగుతుంది.

ప్ర : వినేవాడు మాటసాయం చేసే వాడు లేకనే ఈ బాధలన్నీ..మరి ఈ సమస్య తీరేదెలా?

మనసెరిగి మాట చెప్పేవారు లేనివారికి సైకాలజీ కౌన్సెలర్స్ ఉన్నారు. మీకు కావలసిన ఊరటను వారు కలిగించగలరు. మీరు కోరుకునే సాంత్వనను వారు చేకూర్చగలరు. ప్రతి గల్లీలో క్లినిక్‌లు ఉన్నట్టే కౌన్సెలింగ్ సెంటర్‌లు కూడా ఉండాలి. విద్యార్థుల పాఠ్యాంశాలలో సైకాలజీని ఒక సబ్జెక్ట్‌గా చేర్చాలి.

ప్ర : స్ట్రెస్‌మేనేజ్‌మెంట్ కోసం ఏం చేస్తున్నారు?

పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోని ఐఎస్‌డబ్ల్యూ, టిఎస్‌పిఎ, సిటీ పోలీస్ విభాగాలలోని ఉద్యోగులకు, ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై తరగతులు నిర్వహిస్తున్నాం. వీటితో పాటు సమాజంలో మానసిక సమస్యలపై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నాం. మనోజాగృతి సంస్థ ద్వారా అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. సుదిశ (ది రైట్ డైరెక్షన్) కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా స్టూడెంట్స్ కౌన్సెలింగ్, ఫ్యామిలీ కౌన్సెలింగ్, డిప్రెషన్, ఓసిడి, ఆంగ్జయిటీ తదితర మానసిక సమస్యలకు కూడా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వీటితో పాటు మేం ప్రచురించిన సుదిశ, ఎబిసిడి ఫర్ సేఫ్టీ ఆఫ్ గరల్స్ పుస్తకాల ద్వారా వేలాది విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర : గ్రామీణ విద్యార్థులలో మానసిక వెనకబాటుతనం ఉంటుంది..దీన్ని ఓవర్‌కమ్ చేయడానికి ఏం చేస్తున్నారు?

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులలో తక్కువ భావన ఎక్కువగా ఉంటుంది. దాన్నే ఆత్మనూన్యతా భావం అంటారు. తమ కన్నా అందరూ బాగున్నారని, తామే ఎందుకూ కొరగాకుండా పోతున్నామని అనుకుంటుంటారు. అందువల్ల స్వశక్తిని గుర్తించలేక దిగాలుగా ఉంటారు. ఈ తేడా భావనతోటే తోటి విద్యార్థులతో కలవలేరు.

ప్ర : టీచర్లు కూడా పేరెంట్సేకదా.. పిల్లల్ని గమనించడానికి ప్రత్యేకించి కౌన్సిలింగ్ అవసరమంటారా?


అవసరమేనండి. ఇంట్లో పిల్లలు ఒకే కల్చర్‌లో పెరుగుతారు. స్కూల్ పిల్లలు అలా కాదు. రకరకాల ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్స్ నుంచి వస్తారు. వారిని అర్థం చేసుకోడం కొంచెం కష్టమైన పనే! దీనికి ఎక్కువ టైము తీసుకోనక్కర్లేకుండా సులువులు లఘువులు చెబుతుంటాం. టీచర్లకు కౌన్సిలింగ్ ఇచ్చినా, పేరెంట్స్‌కు కౌన్సిలింగ్ ఇచ్చినా ఫైనల్‌గా మనసు మార్చుకుని బుద్ధిగా ఉండాల్సింది స్టూడెంటేకదా..ప్రతి విద్యార్థి ఒక ముడి వజ్రం. వారిని సానబెట్టిన వజ్రాలుగా మార్చడానికి ఏం చేయాలో అది మేం చేస్తున్నాం. విద్యార్థి దశ నుంచే వారికి నైతిక విలువల గురించి వివరిస్తున్నాం. ఎలా ఉండాలో చెబుతున్నాం. ఎలా ఉండకూడదో కూడా చెబుతున్నాం. ఈ రెండూ తెలిసినపుడే వారు సామాజిక రుగ్మతల బారినపడకుండా మంచిపౌరులుగాఎదుగుతారు.

ప్ర : బైటి వాళ్ళను బాగుచేయడం కోసం మీరు పడే ఆరాటం అర్థం చేసుకోదగ్గదే..కానీ మీకూ ఒక ఇల్లుంది. మీకూ కుటుంబ బాధ్యతలున్నాయి. మీ శ్రీవారికి, పిల్లలకి అందుబాటులో ఉండడానికి టైంను ఎలా సర్దుబాటు చేసుకుంటున్నారు?

మాది మెదక్. అమ్మనాన్న రమాదేవి, శ్రీరాములు. ప్రభుత్వపాఠశాలలో తెలుగుమీడియంలోనే తొలి దశ చదువులు చదివాను. మా ఆయన దయనంద్ పోలీస్ ఉన్నతాధికారి. మాకు ఇద్దరు పిల్లలు సాయి కిరణ్, సాయి వరుణ్. ఇద్దరూ చెన్నై ఐఐటిలో చదువుతున్నారు. పెళ్లైన తర్వాత మా వారి ప్రోత్సాహంతోనే సైకాలజీలో, సోషల్ వర్క్, చైల్డ్ డెవలప్‌మెంట్‌లో పిజీ చేశాను. రోజులో 18గంటలు పనిచేస్తాను. ఉదయం యోగా, జాగింగ్, ఇంట్లో పనులు చేసుకుంటాను. తొమ్మిది గంటల నుంచి కౌన్సిలింగ్ మొదలవుతుంది. ఇలా ఇంటిని, కౌన్సెలింగ్‌నీ బ్యాలెన్స్ చేసుకుంటున్నాను.

– మన తెలంగాణ





ఆమే ఒక సైన్యం

ఇంటిని చక్కదిద్దుకోవటం ఒక్కటే సర్వంగా చేసినంత మాత్రాన ''గొప్పభార్య'' అనే కీర్తి ప్రతిష్ఠలు కొట్టేయొచ్చుననుకుంటే పప్పులో కాలువేసినట్టేనని సోషియాలజిస్టులంటున్నారు. గృహిణిగా మీరు ఎంత చక్కటి పాత్ర పోషించినా మీ బాధ్యతల పట్ల ఎంత అంటి పెట్టుకున్నా, అందరి సంతృప్తి కోసం ఎంతగా పాటుపడినా... అదొక్కటే మీ కార్య నిర్వహణా సామర్థ్యంగా పరిగణించకూడదు. ఇంటిని మెయింటైన్ చేయటం, భర్తను మలుచుకోవటం, పిల్లల్ని పెంచి పెద్ద చేయటం ఇవ్వన్నీ గొప్ప విషయాలేనా అని మీ తోటి వాళ్ళే తీసి పారేస్తారు. ''నేను నా ఇంటిని చక్కదిద్దుకున్నానోచ్'' అని ఎలుగెత్తి చాటుకోవటానికి నువ్వేమైనా ప్రైమ్ మినిస్టర్ భార్యవా అనడుగుతారు. నిజానికి గృహిణిగా మీరు పాత్రను పోషించేందుకు సిద్ధపడినప్పుడు, మీ విధి నిర్వహణ, రోజుకు మూడు షిఫ్టులూ పనిచేసే సినిమా తారకన్నా భిన్నమైందనే చెప్పాలి. సంవత్సరానికి పది ఇరవై సిన్మాల్లో నటించే బిజీ తారకూడా అన్ని పాత్రలు పోషించదు. గృహిణి అనే మూడక్షరాల మాటలో ఎన్నో పాత్రలు ఇమిడి వున్నాయి. ఆ పాత్రల లిస్టులో కొన్నిటిని మాత్రం మనం ఒక లిస్టుగా రాయగలం. వంటామె, చాకలి, ఆయా, దాసి, పార్ట్ టైం కారు డ్రైవర్, అటక ఎక్కి బూజులు దులిపే పార్ట్ టైం కూలి, గుమస్తా (ఇంటి ఖర్చుల జమా పద్దులు రాయాలి) పుస్తకాలు సర్దాలి. అందంగా వుండాలి (లైబ్రేరియన్), ఇంటికి కావల్సిన వస్తువుల్ని తెలివిగా కొనుగోలు చేసే పర్చేజ్ ఆఫీసర్, ఇంటికి వచ్చే యావన్మందితో సత్సంబంధాలను పెంచుకునే పబ్లిక్ రిలేషన్ ఆఫీసరు, మీ ఆయన అంతరంగిక విషయాలను పర్యవేక్షించే పర్సనల్ అసిస్టెంట్ , ఇంట్లో చిన్నా పెద్దలకు బుద్ధులు, సలహాలు చెప్పే కన్సల్టెంట్, సమస్యలు వచ్చినప్పుడు తెలివిగా పరిష్కార మార్గాలను అందించే ట్రబుల్ షూటర్, చక్కని కార్యనిర్వాహకురాలు, ఎగ్జిక్యూటివ్... ఇలా రకరకాల పాత్రలు 24 గంటల పలు ఉద్యోగాల సందులోనే మీరు ఉద్యోగం చేయాలి. డబ్బు సంపాదించాలి. ఉత్తమురాలన్పించుకోవాలి. మీలో ఏదైనా కళాత్మక లక్షణాలుంటే వాటిని కాపాడుకుంటూ, గాయనీగానో, రచయిత్రిగానో వెలుగొందటం ఎలాగో ఆ పనీ మీరే స్వయంగా చేసుకోవాలి.

''విమన్'' అనే గ్రంథం రచయిత్రి మారినియా ఫెర్డినాండ్ మాటల్లో చెప్పాలంటే.... ''ఇంట్లో ''భార్య'' వుండటం వల్ల ఒక మగ మనిషి ఆదాయం పెరుగుదల మరింత అభివృద్ధి కావటమే కాక, అతగాడి ఖర్చులు 60శాతం నుండి 30శాతానికి పడిపోతున్నట్లు సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయి.

తల్లిదండ్రులే స్నేహితులు

నగర జీవితం, పెరుగుతున్న ఖర్చులు, అంబరాన్ని అంటుతున్న ధరలు వెరసి ఒకరి సంపాదనతో ఇల్లు గడవటం మహా కష్టం కాబట్టి ఇద్దరి సంపాదనలో ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన జీవితాన్ని గడపవచ్చనే ఆలోచనలో భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగాలు చేసుకుంటూ సంసార రథాన్ని నడుపుతున్నారు.

ఈ నేపథ్యంలో వీరికీ పిల్లలకి మధ్య సాంగత్యం తగ్గిపోతోంది. సమయాన్ని పిల్లల కోసం వెచ్చించలేకపోతున్నారు. అలసిపోయి ఇంటికి వచ్చి, రాగానే ఇంటి పనులు మొదలుపెడతారు. దీనితో సమయం గడిచిపోతుంది. పిల్లలు ఏం చేస్తున్నారు? ఎలా చదువుతున్నారు? వారి స్నేహాలు ఎలాంటివి? మొదలైన అంశాలపై దృష్టిపెట్టకపోగా, చదవటం లేదంటూ వారిపై మరింత ఒత్తిడి తెస్తున్నారు. ఇటువంటి సంఘటనల వలన పిల్లలు మానసిక వేదనకు గురవుతున్నారు. వారి ఇష్టా, అయిష్టాలను తల్లిదండ్రులతో పంచలేక, బయటివారితో పంచుకోవటం వలన చెడు ప్రభావాలకు లోనై దారితప్పుతున్నారు. పిల్లల కోసం రోజుకు ఒక అరగంట నుండి గంట సమయాన్ని కేటాయించాలి. వారితో కబుర్లు చెబుతూ వాళ్ల అభిప్రాయాలను తెలుసుకుంటూ ఉండాలి. ఏ విషయం అయినా పంచుకోగలిగే స్వేచ్ఛను వారికివ్వాలి. బాల్యం నుండి స్నేహపూరితమైన, ఆరోగ్యకరమైన కుటుంబ వాతావరణాన్ని పిల్లలకు అందించాలి. తల్లిదండ్రులు పిల్లల మధ్య స్నేహభావంతో కూడిన అనుబంధాలు పెరగాలి. అప్పుడే ఉన్నతమైన విలువలను మనం కోరుకునే మంచి మార్పు సాధ్యమవుతుంది.

పిల్లలకు నీతి అంశాలు చెప్పటానికి సమయం కేటాయించాలి. మానవ ధర్మాన్ని, సహనాన్ని, దయ, ఔదార్యంతో పాటు ఆత్మవిశ్వాసానికి నైతిక విలువలకు పునాది వేయాలి. పిల్లల్లో సామాజిక అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రమశిక్షణతో పాటు నైతిక, ఆధ్యాత్మిక, సంస్కృతి సంప్రదాయాలతో పాటుగా సమాజంలో ఎలా నడుచుకోవాలో నేర్పాలి.

తల్లిదండ్రులుగా తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. తెలిసి తెలియని వయసు, మంచి చెబితే వినిపించుకోరు. వారి ప్రవర్తనలో ఏమైన మార్పు కనిపిస్తే వెంటనే తగిన కౌన్సిలింగ్ ఇచ్చి దారికి తీసుకురావాలి. మనం చెప్పే మాటలు వారికి నచ్చక, ఇతరులు చెప్పిన మాటలు వినటం, స్నేహం, సినిమాలు, టీవీలు, ఇంటర్‌నెట్‌లు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్కూల్లో వుండి ఇంటికి వచ్చిన తమ పిల్లలు ఎలాంటి ప్రవర్తన కలిగి ఉన్నారో గమనించాలి. ముఖ్యంగా ఆడపిల్లల దుస్తుల విషయంలో కాస్త శ్రద్ధ అవసరం. పిల్లలకు స్వేచ్ఛ పరిమితంగా ఉండాలి. ఆ స్వేచ్ఛను వారు అనుభవించే



విధంగా తల్లిదండ్రులు వారిని తీర్చిదిద్దాలి.

పిల్లలకు లెక్కలేనన్ని నియమాలు, నిబంధనలు పెట్టకండి. వారు మీతో మనసు విప్పి మాట్లాడేలా మీ పిల్లలకు, వారి మనసుకు దగ్గరగా ఉండండి. పిల్లలు ఏమైనా చెప్పుకోలేని సమస్యలతో సతమతమవుతుంటే దాన్ని గమనించి స్నేహభావంతో తల్లిదండ్రులు ఆ సమస్యలను సున్నితంగా పరిష్కరించాలి. పిల్లలు ఏదైనా చెబుతున్నప్పుడు కొట్టిపారేయడం అనుమానించడం, అవమానించడం లాంటివి చేయకుండా తల్లిదండ్రులు ప్రవర్తన ఉండాలి. పిల్లలు ఎక్కువ సంతోషంగా ఉండేది మీ సాన్నిహిత్యంలోనే కనుక వారితో వీలైనంత ఎక్కువ సమయాన్ని గడపడానికి ప్రయత్నించండి.

పిల్లలకు ఇష్టం లేని పనులు కొన్ని ఉంటాయి. అవేమిటో మీకు తెలిసే ఉంటయి. వాటికి చెయ్యొద్దు. పిల్లలను ప్రతి విషయంలోనూ ధైర్యపర్చాలి వారు ఎప్పుడూ సంతోషంగా, ఆనందంగా సాహసగుణగణాలలో ఉండేలా చూడండి. పిల్లలు ఆడుకునేటప్పుడు చదువుకునేటప్పుడు వారి ప్రతి పనిలో మీరు ఆసక్తితో వారిని ప్రోత్సహించండి. ప్రేమపూర్వకమైన మీ స్పర్శ, మీ పిలుపే వారికి కొండంత బలం, పిల్లలవి సుతిమెత్తని హృదయాలు, వాటిని గాయపరచకండి. పిల్లలతో ఎక్కువగా మాట్లాడుతూ ఉంటే వారు కూడా వారి భావ ప్రకటన విషయాల్లో ఏ మాత్రం తటపటాయించకుండా వారి అభిప్రాయాలను నిస్సంకోచంగా వెల్లడిస్తారు.

మీ పిల్లలకు చదువుల్లో ఆశించిన ఫలితాలు రాలేదని వారిని ఒత్తిడి చేయకండి వారు చదివేతీరులో లోపాలు సరిదిద్దండి. ప్రశాంత వాతావరణంలో వారు చదువుకునే అవకాశం కల్పించండి. ఏ సబ్జెక్టులో వీక్ అయితే దానికి ట్యూషన్ అవసరం అని భావిస్తే మీ పిల్లలకు ట్యూషన్ అవసరం కల్పించండి. పిల్లల ఆనందమయ జీవితానికి మొదటి మెట్టు చక్కటి ఆరోగ్యం. వారి ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం కాని అశ్రద్ధ కాని చూపించకండి. పిల్లలు చెప్పే కబుర్లు ఓపిగ్గా, శ్రద్ధగా వినండి. దీనివలన వారి పట్ల మీరు చూపించే శ్రద్ధకు పిల్లలెంతో సంతోషిస్తారు. మీ పిల్లల్ని హెచ్చరించాలన్న కూడా గట్టిగా పరుషంగా కాకుండా సౌమ్యంగా, సున్నితంగా హెచ్చరించండి. అంతేగాని పిల్లల్ని విసుక్కోవడం, కొట్టడం, తరచూ తిట్టడం లాటి పనులు అసలు చెయ్యొద్దు. పసి హృదయాలు గాయపరచకండి. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహితులుగా ప్రవర్తించాలి. మీ పిల్లలకు మీరే దర్శకులు. మీరు ఎలాగ మాట్లాడతారో వారు అలాగే ప్రవర్తిస్తారు. కనుక మీ మాటలు, చేతలు కూడా జాగ్రత్తగా పరిశీలించుకోవల్సిన అవసరం ఉంది. పిల్లలు మా తల్లిదండ్రులే మాకు మంచి స్నేహితులు అని గర్వంగా చెప్పుకోవాలి. ప్రతి తల్లిదండ్రులు పిల్లలతో అలాగే ఉండాలని కోరుకుంటూ...

– పాలపర్తి సంధ్యారాణి

కార్తీ గాలింపు ఉత్తర్వులపై మద్రాస్ హైకోర్టు స్టే



చెన్నై: మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ, మరి నలుగురిపై కేంద్రం జారీ చేసిన గాలింపు ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు గురువారం నిలిపేసింది. సిబిఐ దాఖలు చేసిన అవినీతి కేసుపై పాస్‌పోర్టు చట్టం కింద కేంద్రం ఈ గాలింపు ఉత్తర్వును జారీ చేసింది. గాలింపు ఉత్తర్వుల కేసు విచారణకు వచ్చినప్పుడు వాటిని కొట్టేయాలని కార్తీ, మరి నలుగురు పెట్టుకున్న వినతిని స్వీకరించిన న్యాయమూర్తి ఎం.దురైస్వామి తాత్కాలిక స్టేను మంజూరు చేశారు. దీనిపై సెప్టెంబర్ 4కల్లా కౌంటర్‌ను దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించారు. హోం మంత్రి ఆధ్వర్యంలోని ఫారినర్ రీజియనల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఎఫ్ఆర్ఆర్ఓ), బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ జూన్ 16 కార్తీపై, జులై 18 మరి నలుగురిపై గాలింపు ఉత్తర్వులు జారీ చేశాయి. కార్తీ తన పిటిషన్‌లో 'కేంద్ర రాజకీయ కక్షసాధింపులో భాగంగానే గాలింపు ఉత్తర్వులు జారీ చేశారు' అని పేర్కొన్నాడు. విదేశాలకు తాను పర్యటించకుండా నిరోధించడానికి అధికారం లేకున్నా ఏకపక్షంగా జారీ చేశారన్నారు. అయితే కార్తీ వినతిని వ్యతిరేకిస్తూ కేంద్రం తన వాదనను కోర్టుకు విన్నవించింది. మద్యం దిగ్గజం విజయ్ మాల్యా భారత్‌ను వదిలి పారిపోయిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకునే కార్తీకి వ్యతిరేకంగా గాలింపు ఉత్తర్వులను జారీ చేసినట్లు తెలిపింది.

ఎన్ఐఎకు సహకరించండి

న్యూఢిల్లీ: కేరళలో జరిగిన ఒక లవ్‌జిహాద్ ఘటనకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఈ కేసుకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కు సహకరించాల్సిందిగా కేరళ పోలీసులను ఆదేశించింది. ముస్లిం వ్యక్తి ఒకరు హిందూ మహిళను పెళ్లి చేసుకోవడాన్ని లవ్‌జిహాద్ ఘటనగా పేర్కొంటూ కేరళ హైకోర్టు ఆ వివాహాన్ని రద్దు చేసింది. హైకోర్టు తీర్పు వెనుక విస్తృత అంశాలు దాగి ఉన్నాయని ఆ ముస్లిం వ్యక్తి సుప్రీంకోర్టులో పేరొన్న పిటిషన్‌పై ధర్మాసనం స్పందించింది.

కాలుష్య నియంత్రణ పత్రంతోనే బీమా



న్యూఢిల్లీ: కాలుష్యకారక వాహనాలపై సుప్రీంకోర్టు కొరడా ఝుళిపించింది. వాహనాల యజమానులు తప్పనిసరిగా కాలుష్య అదుపు ధృవీకరణ పత్రాలు(పియుసి) చూపించాలని లేకపోతే సంబంధిత వాహనాల బీమా పునరుద్ధరణ జరగకుండా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. దీనికి సంబంధించి పలు మార్గదర్శక సూత్రాలను వెలువరించింది. వీటిని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాలుష్య తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ 1985లో పర్యావరణవేత్త ఎంసి మెహతా దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందించింది. న్యాయమూర్తులు మదన్ బి లోకూర్ ఆధ్వర్యంలోని ధర్మాసనం రూలింగ్ ఇచ్చింది. వాహనాల బీమాకు వచ్చినప్పుడు యజమానులు తప్పసరిగా కాలుష్య నివారణ చర్యలు తీసుకుంటున్నదీ లేనిదీ నిర్ధారించుకోవల్సి ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దేశంలో అన్ని ప్రాంతాలలో కాలుష్య నియంత్రణ మండళ్లు సరిగ్గా పనిచేస్తున్నవీ లేనిదీ తనిఖీ చేసుకోవల్సి ఉంటుందని తెలిపారు. కేంద్ర రహదారులు, రవాణా మంత్రిత్వశాఖకు సుప్రీంకోర్టు వెలువరించిన మార్గదర్శక సూత్రాల మేరకు దేశ రాజధానిలోని అన్ని పెట్రోలు పంపులు, ఇతరత్రా ఇంధన భర్తీ కేంద్రాలకు అనుబంధంగా ఖచ్చితంగా కాలుష్య నియంత్రణ కేంద్రాలు ఉండేలా చూడాల్సి ఉందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దేశ రాజధాని పరిధిలో పియుసిలు ఉంటేనే వాహనాలు తిరిగేలా చూడాల్సి ఉందని, ఇందుకు కేంద్రానికి నాలుగు వారాల వ్యవధి ఇస్తున్నట్లు తెలిపింది. పర్యావరణ నియంత్రణ సంస్థ వారు వెలువరించిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు న్యాయస్థానం తెలిపింది.

ప్రతి గడపకూ 'లవ్ హ్యాండ్లూమ్'

మన తెలంగాణ/హైదరాబాద్: దేశభక్తితో చైనా వస్తువులను బహిష్కరించాలని పిలుపునిచ్చినట్టే, మన చేనేత మీద ప్రేమతో చేనేతను బతికించుకునేందుకు 'లవ్ హ్యాండ్లూమ్' అనే పిలుపును గడప గడపకు తీసుకెళ్లాలని బిసి కమిషన్ సభ్యులు జూలూరు గౌరీశంకర్ అన్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో గురువారం జరిగిన ''చేనేత వస్త్రాలను ప్రోత్సహించేందుకె సాంస్కృతిక సంస్థల సహకారం కోసం'' అనే సమాలోచనా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ఏదో సంతోషానికి బొకెలు ఇస్తారని, అందుకు అయ్యే ఖర్చు రూ. 300 నుంచి రూ.3000ల వరకు ఖర్చు అవుతుందని, దీనికి బదులుగా చేనేత బట్టలను బహుమానంగా ఇస్తే బాగుంటుందని, తద్వారా లక్షలాది మంది చేనేత కార్మికులకు ఆసరా లభిస్తుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌కు వచ్చే అతిథులకు, కవులు, రచయితలకు, సాహిత్య సంస్థల ప్రముఖులకు శాలువాలను బహూకరించేందుకు బదులుగా చేనేత వస్త్రాలను బహూకరిస్తామన్నారు. చేనేతను మన సంస్కృతిగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు.

ఎస్‌సి వర్గీకరణ కాలం చెల్లిన డిమాండ్

మన తెలంగాణ/హైదరాబాద్: ఎస్‌సిల వర్గీకరణ కాలం చెల్లిన డిమాండ్ అని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య అన్నారు. ఎస్‌సిలను వర్గీకరించొద్దని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నా గురువారంతో మూడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు రాజ్యాధికారానికి రాకుండా కుట్ర పన్నుతున్నారన్నారు. దళితులు తమ జనాభా నిష్పత్తి కంటే అధికంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను పొందుతున్నారని ఉషా మెహ్రా కమిటీ తమ నివేదికలో పొందపర్చిందని, మరోసారి కమిషన్ వేసి శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన తెలిపారు. మాలమహానాడు ప్రధాన కార్యదర్శి జంగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

'సరోగసీ' తల్లిదండ్రుల వివరాలివ్వండి

మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని సాయికిరణ్ హాస్పిటల్‌కిరణ్ సంతాన సాఫల్య కేంద్రంలో అద్దె గర్భం (సరోగసి) తల్లులకు పుట్టిన పిల్లల తల్లిదండ్రుల వివరాలివ్వాలని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖను ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. సంతాన సాఫల్య కేంద్రం పేరుతో చట్ట వ్యతిరేకంగా సరగోసి వ్యాపారం చేస్తోందనే ఆరోపణలపై పోలీసులు దాడి చేసి ఆ కేంద్రాన్ని సీజ్ చేశారు. సీట్ చేయడం వల్ల ఆ కేంద్రంలోని పిల్లలు, తల్లుల పరిస్థితి ఏమిటంటూ హైకోర్టు న్యాయమూర్తి సురేష్ కుమార్ కైత్ రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. ఈ కేసును మరోసారి బెంచ్ గురువారం విచారించింది. సరగోసి తల్లులకు పుట్టిన పిల్లల వివరాలను అధికారులకు అందచేయాలని ఆ కేంద్రాన్ని బెంచ్ గురువారం ఆదేశించింది. సరగోసి తల్లులకు పుట్టిన పిల్లలు కావాలనుకునే తల్లిదండ్రులు కూడా తమ వివరాలివ్వాలని బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలన్నీ పూర్తిగా అందిన తర్వాత పిల్లల అప్పగింతపై తగిన నిర్ణయం తీసుకోవాలని అధికారులకు బెంచ్ ఆదేశించింది. కిరణ్ సంతాన సాఫల్య కేంద్రానికి మూడు షోకాజ్ నోటీసులిచ్చామని ప్రభుత్వ న్యాయవాది ప్రసాద్ చెప్పారు. వైద్య వసతులు, సంబంధిత వైద్యులు లేకుండానే ఈ కేంద్రాన్ని నడిపేస్తున్నారని చెప్పారు. షోకాజ్ నోటీసుకు వివరణ ఇచ్చేందుకు పది రోజుల గడువు కావాలని ఆ కేంద్ర తరపు న్యాయవాది కోరారు. ఈ కేంద్రాన్ని సీల్ చేయడాన్ని సవాల్ చేసిన మరో వ్యాజ్యాన్ని బెంచ్ డిస్మిస్ చేసింది. విచారణ వాయిదా పడింది.

నారాయణ విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై నివేదిక సమర్పించాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడలో నారాయణ జూనియర్ కళాశాలల్లో చదువుతూ నారాయణ హాస్టల్‌లో ఉంటున్న శ్రావ్య(16) అనే విద్యార్థిని ఉరి వేసేకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనలో అక్టోబర్ 26లోగా నివేదిక ఇవ్వాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని, రాచకొండ కమిషన్‌ను కమిషన్ ఆదేశించిందని బాలల హక్కుల సంఘం గౌరవాధ్యక్షులు అచ్యుతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనలో కళాశాల ప్రిన్సిపాల్, వార్డెన్‌పై ఐపిసి 324 జెజె యాక్ట్ 75 ప్రకారం కేసు నమోదు చేయాలని తాము కమిషన్‌ను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. కార్పోరేట్ విద్యా సంస్థల ఒత్తిడికి తట్టుకోలేక పిల్లలు మరణిస్తున్నారని, నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం జరిగిన ఘటనలో కళాశాల ప్రిన్సిపాల్, వార్డెన్‌ను వెంటనే అరెస్ట్ చేసేందు ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు.

పారిశ్రామిక ప్రోత్సాహకాలు అరకొరే

- ఏడాదిగా పెండింగ్‌లోనే 4 వేల దరఖాస్తులు
- రూ.1125 కోట్లు అవసరం కాగా కేటాయించింది 410 కోట్లే



మన తెలంగాణ / హైదరాబాద్ : పారిశ్రామిక ప్రోత్సాహకాల కల్పన విషయంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రభుత్వం తీవ్ర నిరాశ పరుస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పావలా వడ్డీ రుణాలు, విద్యుత్ వినియోగం, ఇన్‌కం టాక్స్, సేల్స్ టాక్స్ రాయితీల కోసం రాష్ట్రంలో వివిధ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ సాయం కోసం పెద్ద సంఖ్యలో నిరీక్షిస్తున్నారు. స్థిర పెట్టుబడిపై రాయితీలు వస్తాయన్న నమ్మకమే వారిని ప్రోత్సహక రాయితీల స్కీమ్ వైపు దృష్టి మళ్లిస్తోంది. మరీ ముఖ్యంగా ఎస్ఎంఈ, ఎంఎస్ఎంఈ వంటి పథకాల్లో నూతన యూనిట్లను నెలకొల్పుకుని తమను తాము ఆర్థికంగా నిలదొక్కుకుంటూనే రాష్ట్ర ప్రభుత్వానికి భవిష్యత్తులో వివిధ పన్నుల రూపేణా ఆదాయం, ఆర్థిక స్వావలంభన కల్పించేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చారు. పారిశ్రామిక పొత్సహకాల పథకం కింద రాష్ట్రంలో సుమారు 4 వేల సంస్థలు పారిశ్రామిక రాయితీల కోసం పరిశ్రమల శాఖకు దరఖాస్తు చేసుకున్నాయి. వీటన్నింటికీ ఇన్సెంటివ్స్ పథకం ప్రకారం రాయితీల ఇవ్వదలిస్తే రూ. 1150 కోట్లు అవసరం అవుతాయని పరిశ్రమల శాఖ అధికారులు లెక్క తేల్చారు. వీటిలో జనరల్ కేటగిరిలో 410 కోట్లు, ఎస్‌సి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రూ. 94 కోట్లు, ఎస్‌టి ఔత్సాహిక పారిశ్రామిక వర్గాలకు రూ.124 కోట్లు ప్రోత్సాహక నిధులుగా ఇవ్వాలి. ఇంత మొత్తాన్ని ఒకే దఫా ఇవ్వలేని పక్షంలో దశల వారీగా ఇచ్చేలా ఉంటే ఆ విషయాన్ని కూడా సమాచారం కోసం సంబంధిత యూనిట్ల యాజమాన్యాలకు తెలియజేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో పరిశ్రమలశాఖ అభ్యర్థన మేరకు ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పథకానికి 410 కోట్లు కేటాయించింది. నిధుల డిమాండ్ రూ. 1125 కోట్లు ఉండగా కేటాయింపులు కేవలం 410 కోట్లకే పరిమితం కావడంతో ఎంఎస్ఎంఈ, ఎస్ఎంఈ ఔత్సాహిక పారిశ్రామిక వర్గాల్లో ఆశలు క్రమంగా ఆవిరవుతున్నాయి. కేటాయించిన ఈ రూ. 410 కోట్లు కూడా జనరల్ కేటగిరి కిందనే ప్రభుత్వం ఇచ్చినట్లు తెలిసింది. రిజర్వేషన్ ప్రకారం తీసుకున్నా, ఆయా రంగాల వారిగా తీసుకున్నా ఈ నిధులు ఏమాత్రం చాలవని ఇటు పారిశ్రామిక వేత్తలు, అటు పరిశ్రమల శాఖ అధికారులు ధృవీకరిస్తున్నారు. ఉదా.. టి ప్రైడ్ కింద దరఖాస్తు చేసుకున్న దళిత పారిశ్రామిక వర్గాలకు రూ610 కోట్లు చెల్లించాల్సి ఉంది. పారిశ్రామిక వర్గాల నుండి నిధుల కోసం వస్తున్న డిమాండ్ , ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు సమతూకం లేక పోవడంపై అధికార వర్గాలు ఇలా స్పందిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు నుండి కూడా ఎస్ఎంఈ, ఎంఎస్ఎంఈ సంస్థలకు బడ్జెట్‌లో నిధులు అరకొరగానే జరుగుతున్నాయని, ఈ కారణంగా పారిశ్రామిక ప్రోత్సాహకాల నిధులు 2013 14 ఆర్థిక సంవత్సరం నుండి ఈ నిధులు పెండింగ్‌లో ఉంటూ ఇప్పటి వరకు 1150 కోట్లకు చేరుకున్నాయని గుర్తు చేస్తున్నారు. ప్రోత్సాహకాల చెల్లింపులపై ప్రభుత్వం చెబుతున్నదేంటని అధికారులు అడిగితే వారు సరైన సమాధానం చెప్పలేక సమాధానాన్ని దాట వేస్తున్నారు. ఆన్‌లైన్ సింగిల్ విండో సిస్టమ్ అందుబాటులోకి ఉంది కాబట్టి యూనిట్లు నెలకొల్పుకునే సంస్థలు, వ్యక్తులు తమ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా అంతా ఆన్‌లైన్‌లోనే రాయితీల చెల్లింపులు పొందేలా చూస్తామంటున్నారు.

లైడార్ భూసర్వే?

(మొదటిపేజీ తరువాయి)

ఛాయాచిత్రాలతో సర్వే నిర్వహిస్తున్నారు. ఉపరితల సర్వేకు సమయం తీసుకోవడమే కాకుండా వ్యయం కూడా రెండింతలు పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఒడిషాలో అతి తక్కువ రెజుల్యూషన్ చిత్రాలతో సర్వే నిర్వహించారు. భవిష్యత్తులో ఇది అనేక సమస్యలకు దారితీసే ప్రమాదముందని అంటున్నారు. బిహార్‌లో అమలు చేస్తున్న విహంగ ఛాయా చిత్రాలతో చేసిన సర్వే అందరికన్నా బాగుందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. వంద శాతం స్పష్టంగా, కచ్చితత్వంతో కూడుకుని న్యాయపరంగా వివాదాలు లేకుండా ఉండాలని అనుకుంటే లైడార్, డిజిపిఎస్ విధానంతో సర్వే చేపట్టాల్సి ఉంటుందని అధికారులు ప్రాథమిక నిర్ణయానికి వచ్చారు. ప్రభుత్వం రూ.500 కోట్లు వెచ్చించడంతో పాటు నిపుణులైన మానవ వనరులను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ విధానంలో అయితే ఆరు నెలల్లో విహంగ ఫొటోగ్రఫీ, సర్వే పూర్తవుతుంది. రాష్ట్ర విస్తీర్ణం 1.14 లక్షల చదరపు కిలోమీటర్లు కాగా 86 లక్షల చదరపు కిలోమీటర్ల (2.12 కోట్ల ఎకరాలు) పరిధిలో సాగు (వ్యవసాయం) జరుగుతోంది. సుమారు 2.12 కోట్ల ఎకరాలలో అన్ని రకాల పంటలు పండిస్తున్నట్లు అధికారవర్గాల లెక్కలు చెబుతున్నాయి. పూర్తి డిజిటల్ పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న సర్వే వివరాలు ఇలా ఉన్నాయి.

సర్వే వివరాలు

ప్రాథమికంగా ప్రాంతాల వారీగా భూముల ఫొటోలు తీస్తారు.

ప్రతి మండల తహశీల్దార్ కార్యాలయం కేంద్రంగా సర్వే దిమ్మెలు నిర్మిస్తారు

- **72 గంటలూ ఈ దిమ్మెలపై విహంగ పర్యవేక్షణ**
- **ప్రతి దిమ్మెకు జియో టాగింగ్ ఇస్తారు**
- **1 మెగా ఫిక్సెల్‌తో ఫొటోలు తీస్తారు**
- **ఫొటోగ్రఫీ మ్యాప్‌లు ఆర్థో మ్యాప్‌లతో అనుసంధానం**
- **తుది మ్యాప్‌లతో గ్రామాల్లో జనసభలు, అభిప్రాయాలు, అభ్యంతరాలు స్వీకరణ**
- **గూగుల్ ఎర్త్‌లో ఫైనల్ మ్యాప్‌లు, డిజిటల్ టిప్పన్‌లు**
- **ప్రపంచలో ఎక్కడి నుంచైనా భూమి రికార్డుల వీక్షణ.**

ఉల్లి బాంబు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి రూ.15 పలికిన ఉల్లి ప్రస్తుతం రెండింతలు పెరిగింది. ఇప్పుడు కిలో ఉల్లి ధర రూ.40 పలుకుతోంది. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.35 గా ఉంది. ముందు ముందు ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉల్లి నిల్వలు లేకపోవడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. మరోవైపు దేశంలోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరుగాంచిన మహారాష్ట్రలోని లాసల్‌గాన్‌లో 100 కిలోల ఉల్లిగడ్డల ధర రూ.1,600కు చేరింది. మహారాష్ట్రలో గత ఏడాది ఉల్లికి గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ఈసారి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గించారు. దీంతో ఉల్లి ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల నుంచి ఉల్లి ఎగుమతులు అధికంగా ఉంటాయి. అయితే భారీ వర్షాలు, వరదలతో వల్ల పంట దెబ్బ తిని అక్కడి నుంచి ఎగుమతులు తగ్గాయి. గతంలో రోజుకు 25 వేల క్వింటాళ్ల ఉల్లి రాగా, ప్రస్తుతం అది 10 వేల క్వింటాళ్లకు పడిపోయింది. ఫలితంగా ఇక్కడి మార్కెట్‌లో ఉల్లి ధరలు పెరుగుతున్నాయని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. ఉల్లి సాగు లేదని, ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న సరుకంతా మార్చి, ఏప్రిల్‌లో ఉత్పత్తి అయిందని, స్టోరేజీల నుంచి వాటిని బయటకు తీస్తున్నట్టు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే చాలా మంది రైతులు ఇప్పటికే తమ పంటను అమ్మేసుకున్నట్టు చెబుతున్నారు. అంటే ఉత్పత్తి అయిన ఉల్లి మొత్తం వ్యాపారుల దగ్గరకు చేరిపోయినట్టే. దీంతో ధరలపై వారిదే ఆధిపత్యం ఉండనుంది. ఇంకా ఎంత పెరుగుతోందనని ఆందోళన చెందుతున్న వినియోగదారులు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసుకుంటున్నారు. మరో వైపు దేశ రాజధానితో పాటు, చాలా చోట్ల ఉల్లి ధరలు ఇప్పటికే పెరిగాయి.

జూన్‌కల్లా నింపుతాం

(మొదటిపేజీ తరువాయి)

నీరు తెచ్చేందుకు ఎస్ఆర్ఎస్‌పి పునరుజ్జీవ పథకాన్ని చేపట్టామని, అది పూర్తయితే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ నుండి వరద ఎస్ఆర్ఎస్‌పి వరద కాలువలోకి నీళ్ళు ఎత్తిపోస్తామని, వాటి ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టును నింపే ప్రయత్నం చేస్తామని వివరించారు. పది, పదిహేను నెలల్లో ఇది జరుగుతుందని, జూన్ కల్లా శ్రీరాంసాగర్‌లో కాళేశ్వరం నీళ్ళతో నింపడం ఖాయమని కెసిఆర్ అన్నారు. సుందిళ్ళ, అన్నారం బ్యారేజీలు పూర్తయ్యాక, ఆ పై ఏడాది ఫిబ్రవరి నాటికే శ్రీరాంసాగర్‌ను 90 టిఎంసిలతో నింపుతామని, అప్పటి నుండి మొఘుల్లకు ముఖం చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్కసారి నింపుకుంటే నిర్మల్, నిజామాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాలో రైతాంగానికి రెండు పంటలు పండించుకనే అదృష్టం వస్తుందని చెప్పారు.

పర్యాటక క్షేత్రం చేస్తా: భవిష్యత్తులో ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటక క్షేత్రంగా మారుస్తానని సిఎం కెసిఆర్ చెప్పారు. అందుకు వందల కోట్లు కేటాయిస్తానని, సినిమావాళ్ళంతా ఇక్కడే షూటింగ్‌లు తీసేలా అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. పునరుజ్జీవ పథకం పూర్తయ్యాక ఏడాది పొడవున ప్రాజెక్టులో నీళ్ళుంటాయని, కాబట్టి ఇక్కడి నుండి బాసరకు లాంచ్‌లో పోయే ఏర్పాట్లు కూడా చేస్తామన్నారు.

గోదావరి నది తెలంగాణ జీవధార అని కెసిఆర్ అన్నారు. దీనిపై మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం, తుపాకులగూడం, సదర్‌మాట్‌ల వద్ద బ్యారేజ్‌లు నిర్మాస్తామని, దాని పొడవునా 200 కిలోమీటర్ల వరకు ఏడాదంతా 70–80 టిఎంసిల నీళ్ళు ఉంటాయన్నారు. శ్రీరాంసాగర్ వరద కాలువ ద్వారా వరంగల్ మీదుగా సూర్యాపేట వరకు నీళ్ళిస్తామన్నారు. అలాగే మిడ్‌మానేరును నింపి, అనంతగిరి, మల్లన్నసాగర్, సింగూరు, నిజాంసాగర్, బస్వాపూర్‌లలో రిజర్వాయర్‌లు నింపుతామని, హైదరాబాద్‌కు కూడా నీళ్ళిస్తామన్నారు.

ఉద్యమించాలని ఇక్కడే అనుకున్నా: 1996లో వేణుగోపాలాచారి కేంద్ర మంత్రి కావడంతో అప్పటి వరకు ఉన్న నిర్మల్ ఎంఎల్‌ఎ పదవికి రాజీనామా చేశారని, ఉప ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించుకునేందుకు తాను, ఇప్పటి నల్లగొండ ఎంపి గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇక్కడకు వచ్చామని కెసిఆర్ గుర్తు చేశారు. అప్పుడు నిర్మల్ నుండి శ్రీరాంసాగర్‌కు వచ్చామని, నాడు ఇదే కట్ట మీద నుండి చూస్తే తాళ్ళకు గ్రీసు లేదని, వంతెనపై గంజం లోతు గుంతలు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితిని చూసి ఆంధ్రాకు నీళ్ళుపోయే సాగర్ వైష్ణవాలయంలాగా దగదగలాడితే , తెలంగాణ ప్రాజెక్టు శ్రీరాంసాగర్ శివాలయంలా ఉన్నదన్నట్లు చెప్పానన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నన్ని రోజులు ఈ ఖర్మ తప్పదని, తనకు ఆరోగ్యం సహకరిస్తే తెలంగాణ ఉద్యమాన్ని నేనే ప్రారంభించి, చివరి వరకు కొట్లాడుతానని నాడు చెప్పానని గుర్తు చేశారు. అన్నట్లుగానే తెలంగాణ సాధించానని, ఇరవై ఏళ్ళ తరువాత ఇదే శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకానికి సిఎం హోదాలో శంఖుస్థాపన చేయడంతో జన్మధన్యమైందన్నారు.

కాంగ్రెస్ నాయకులను నిలదీయండి: టిఆర్ఎస్ ప్రభుత్వానికి మంచి పేరు రాకుండా ప్రాజెక్టులను అడ్డుకుంటూ కాంగ్రెస్ నాయకులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని సిఎం కెసిఆర్ ఆరోపించారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు పైనే 96 కేసులు వేశారని చెప్పారు. తన నియోజకవర్గంలో కొండపోచమ్మ రిజర్వాయర్ కోసం 4,600 ఎకరాలు అవసరమైతే, 4,500 ఎకరాల సేకరణ పూర్తయిందని, కాంగ్రెస్ నాయకులకు చెందిన వంద ఎకరాలు ఇవ్వకుండా ఇరవై రోజుల్లో ఆరు కేసులు హైకోర్టులో వేశారన్నారు. ఈ కొట్లాట ఏ ఒక్కరిదో, ప్రభుత్వానిదో కాదని, తెలంగాణ బతుకు దెరువు కొట్లాట అని, మీరంతా కాంగ్రెస్ నాయకులను ఎందుకు ప్రాజెక్టులు అడ్డుకుంటున్నారని నిలదీయాలని అన్నారు. మౌనం పాటిస్తే మనమే నష్టపోతామన్నారు. టిడిపి, కాంగ్రెస్‌లు అధికారంలో ఉన్న 37 ఏళ్ళలో కరెంటు కోసం మనల్ని ఏడిపించారని, తాము అధికారంలో రాగానే దానిని పరిష్కరించామన్నారు.

అంతకుముందు నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ వచ్చినందుకే పోచంపాడు పునరుజ్జీవ పథకం వచ్చిందని, ఇది ఉత్తర తెలంగాణకు జీవం పోసే పథకమన్నారు. సిఎం కెసిఆర్ ఒక రైతు బిడ్డగా, ఒక ఇంజినీర్‌గా ఆలోచించినందునే ఈ పథకం వచ్చిందని, దీనికి కర్మ,కర్త, క్రియ అన్నీ ఆయనేనని చెప్పారు. ఒక్క ఇళ్ళు కూలకుండా, ఒక ఎకరం మునగకుండా, గ్రామం మునగకుండా అతి తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో చేపట్టే పథకమన్నారు.కాంగ్రెస్ నాయకులు ఇలాంటి పథకాల గురించి ఆలోచించలేదన్నారు. సిఎం ఆదేశాల అనుసారం 12 నెలల్లో ఈ పథకాన్ని పూర్తి చేస్తానని మంత్రి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు మహమూద్ అలీ, కడియం శ్రీహరి, మంత్రులు ఈటల రాజేందర్, నాయిని నర్సింహారెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి,పద్మారావు, తలసాని శ్రీనివాస్‌రావు, జోగు రామన్న, మహేందర్‌రెడ్డి, ఎంపిలు బి.వినోద్‌కుమార్, కవిత, డి.శ్రీనివాస్, బాల్క సుమన్, లక్ష్మి కాంతారావు, ఎంఎల్‌ఎలు ప్రశాంత్‌రెడ్డి, ఎంఎల్‌సి పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వడ్డీ లేని రుణం : సిఎం

తాను సభకు వచ్చే ముందు కొంత మంది, కొందరు ఎంఎల్‌ఎలు ఆడబిడ్డలకు వడ్డీలేని రుణం ఇవ్వాలని విన్నవించారని సిఎం కెసిఆర్ తెలిపారు. ఈ విషయాన్ని సానుభూతితో ఆలోచిస్తామని హామీ ఇచ్చారు.

నేరెళ్ల ఘటనలో ఎస్ఐ సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

సంబంధం ఉన్న కొంత మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని చితక బాదారు. అనంతరం వారిపై కేసులను నమోదు చేసి జైలుకు పంపించారు. జైలుకు వెళ్ళిన వారిని పరిశీలించిన తీవ్ర గాయాలున్నందున చికిత్స చేయించి తీసుకు రావాలని కోరడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితులకు మద్ధతుగా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తమైంది. ఘటనపై కూడా కొన్నాళ్లు ప్రభుత్వం చూసీ చూడనట్లుగా వ్యవహరించింది. చివరకు బాధితుల ఫిర్యాదు మేరకు విచారణకు డిజిపి అనురాగ్‌శర్మ ఆదేశించారు. రేంజ్ డిఐజి నాగిరెడ్డిని ఘటనపై విచారణ జరపాలని ఆదేశించారు. ఈ విచారణలో ఎస్ఐ రవిందర్‌ది తప్పని తేల్చుతూ రిపోర్టు రావడంతో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి తమను పోలీసులు చిత్రహింసలకు గురి చేశారని, ఈ చిత్రహింసలన్నీ జిల్లా ఎస్‌పి విశ్వజిత్ ఆదేశాల మేరకే చేశారంటూ బాధితులు అనేక సందర్భాలలో చెప్పారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ముందు కూడా బాధితులు ఎస్‌పిపైనే ఫిర్యాదు చేశారు. కానీ డిఐజి నివేదికలో ఒక ఎస్ఐని బాధ్యుడిగా చేయడంపై మరోసారి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సిసిఎస్ ఎసఐ రవీందర్ అత్యుత్సాహం వల్లనే బాధితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగం చేసినట్లు తెలిందని డిఐజి పేర్కొన్నారు. కాగా ఈ విషయాన్ని మంత్రి కెటిఆర్ కూడా తేల్చి చెప్పారు. ఎస్ఐ అత్యుత్సాహం వల్లె నేరెళ్ల ఘటన జరిగిందని మంత్రి కెటిఆర్ కూడా డిఐజి రిపోర్టు ఆధారంగా ఎస్ఐని సస్పెండ్ చేసినట్లు గురువారం సాయంత్రం ప్రకటించారు.



నేరెళ్ల బాధితులను పరీక్షించిన ఎంజిఎం వైద్యులు

మన తెలంగాణ/సిరిసిల్ల: రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం నేరెళ్ల బాధితులను వేములవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో గురువారం ఎంజిఎం వైద్యులు డా.కృపాల్‌సింగ్, డా.చంద్రశేఖర్‌లు పరీక్షించి వాంగ్మూలాలు తీసుకు న్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి బండి సంజయ్‌కుమార్ వైద్యులను కలిసి తన అభిప్రాయాలను, సంఘటన జరిగిన వివరా లను వివరించారు. వైద్యులు తమ నివేదికను హైకోర్టు అందిస్తామని తెలిపారు.

స్టేకి హైకోర్టు నో

(మొదటిపేజీ తరువాయి)

చేయబోయే ఈ ప్రాజెక్టు కోసం 17 వేల ఎకరాల భూమిని సేకరణ జరుగుతుందని, అతి చిన్న సమస్యతో పిటిషనర్లు కోర్టుకు వచ్చారని తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాష్ రెడ్డి వాదించారు. పిటిషనర్లకు అవసరమైన నష్టపరిహారం చట్ట ప్రకారం చెల్లిస్తామని, బహుళ ప్రయోజనాల్ని గమనంలోకి ప్రాజెక్టు నిర్మాణానికి అవరోధం లేకుండా చేయాల్సిన అవసరముందని ఆయన హైకోర్టును కోరారు. పర్యావరణ అనుమతి ఉంటేనే ప్రాజెక్టు పనులు చేయాలని, చట్ట వ్యతిరేకంగా జరుగుతున్న టెండర్ ప్రక్రియను నిలిపివేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు. బహుళ ప్రయోజనాలతో కూడిన ప్రాజెక్టు పనుల్ని ఆపేయబోమని, అయినా పిటిషనర్లకు పరిహారం చెల్లించే విషయంపై ఎజి హామీ ఇస్తున్నందున స్టే ఇవ్వలేమని న్యాయమూర్తి బదులిచ్చారు. సమగ్ర వివరాలతో ప్రభుత్వ వాదనను తెలియజేయాలని ఆదేశిస్తూ విచారణ నెల రోజులకు వాయిదా వేశారు.

అంతర్రాష్ట్ర బదిలీలపై టిఎన్‌జిఓలు హర్షం

మన తెలంగాణ/హైదరాబాద్ : జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోస్టుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల టిఎన్‌జిఓస్ కేంద్ర సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఒంటరి మహిళలు, వితంతువుల బదిలీల విషయంపై సచివాలయంలో గురువారం ప్రధాన కార్యదర్శి ఎస్‌పి.సింగ్‌ను టిఎన్‌జిఓఎస్ కేంద్ర సంఘం అధ్యక్షులు కారం రవీందర్ రెడ్డి కలిసి వినతి పత్రం అందచేశారు. ఒంటరి మహిళలు,వితంతువులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి కూడా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ఉద్యోగ సంఘాలు చేసిన విజ్ఞప్తిని అంగీకరించలేదన్నారు. ఇలాంటి కారణాలతో బదిలీ కోరుకునేవారు కేవలం 100 మంది లోపే ఉన్నారని ఆయన వివరించారు. ఈ విషయమై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని ప్రధాన కార్యదర్శి సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఇదే అంశంపై ఐటి శాఖ మంత్రి కె.తారకరామారావును కూడా కలిసి వివరించారు. టిఎన్‌జిఓఎస్ కేంద్రం సంఘం ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, కేంద్ర సంఘం నాయకులు ఉపేందర్ రెడ్డి, బి.రేచల్, రామినేని శ్రీనివాస్ రావు తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

నేరంపై ఆధారాలేవీ : కన్హయ్య

ఇండోర్ : తనపై దేశద్రోహ నేరంమోపడానికి ఎలాంటి ప్రాతిపదిక లేదని విద్యార్థి నేత కన్హయ్య కుమార్ స్పష్టం చేశారు. పోలీసుల వద్ద ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని, వారి వద్ద సరైన ఆధారాలు ఉండి ఉంటే కోర్టుకు ఎందుకు సమర్పించడం లేదని ప్రశ్నించారు. తన నిర్దోషిత్వాన్ని సమర్థించుకునేందుకు తాను ఆధారాలు చూపాల్సిన అవసరం లేదని, దళిత విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనపైనే తాను స్పందించానని, దేశద్రోహానికి పాల్పడే నినాదాలకు దిగలేదని, దిగి ఉంటే పోలీసులు ఆధారాలు చూపుతారా? అని ప్రశ్నించారు.



డిసెంబర్ 31 వరకు రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన పూర్తి : ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ

మన తెలంగాణ/చేగుంట : రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని డిసెంబర్ 31నాటికి పూర్తి చేయడం జరుగుతుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. పోచంపాడులో జరిగిన ముఖ్యమంత్రి సభలో పాల్గొని తిరిగి హైదరాబాద్ వెళుతూ మెదక్ జిల్లా చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామాంతపూర్ వద్ద కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి రెవెన్యూ రికార్డ్సులు సరిచేయడం జరుగుతుందని గ్రామాల్లో ఎక్కువ శాతం భూముల వల్లనే తగాదాలు వస్తుంటాయని, దీని ద్వారా తగాదాలకు చెక్ పెట్టవచ్చునని తెలిపారు. గ్రామ స్థాయిలో ఉండే 10 రికార్డులలో ఏ రికార్డు అయినా రాజధానిలో ఉండే రికార్డుతో సరిగా ఉండే విధంగా చూస్తున్నామని తెలిపారు. ఎస్ఆర్ఎస్‌పి ద్వారా నాలుగు జిల్లాలు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. దేశంలోనే పీస్‌ఫుల్ రాష్ట్రంగా తెలంగాణ ఉందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు 8 వేల రూపాయలు తెలంగాణ ప్రభుత్వమే అందిస్తుందని తెలిపారు. స్థానిక నాయకులు డిప్యూటీ సిఎం మహమూద్‌అలీ, ఎంఎల్‌సి మైనంపల్లి హన్మంతరావులను మైనంపల్లి జిల్లా సేవా సమితి అధ్యక్షులు ఉషికె శ్రీనివాస్, చేగుంట ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు తొడుపునూరి నగేశ్‌లు ఘనంగా సన్మానించారు. సమావేశంలో జిఎచ్‌ఎంసి కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడాకు టోకరా

దొంగ పత్రాలతో రూ.కోట్ల రుణం – నిందితుడి అరెస్టు

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో : బ్యాంకు ఆఫ్ బరోడాకు రూ.2 కోట్ల టోకరా వేసిన నిందితుడిని సిసిఎస్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్‌కు చెందిన షేక్ బషీర్ (42) బంజారాహిల్స్‌లోని ఓ వివాదాస్పద ఫ్లాట్‌కు తానే యజమాని అంటూ బ్యాంకు ఆఫ్ బరోడా నుంచి రుణం పొందిన బంగారు నగల వ్యాపారి విమల్ గోయల్‌కు జమానత్ (షూరిటీ)గా సంతకం పెట్టాడు. ఇదే ఆస్తిపై బషీర్ గతంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి పెద్ద మొత్తంలో రుణం పొందాడు. ఈ రుణం చెల్లించకుండానే తమ బ్యాంకుకు బషీర్ షూరిటీ సంతకం చేసి మోసగించాడని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ టి.నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. నిందితుడిపై ఫిర్యాదు చేయడంతో బషీర్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు.

సామాజిక తెలంగాణ సాధన కోసమే దీక్ష చేపట్టాం

తెలంగాణ ఇంటిపార్టీ రాష్ట్ర అధ్యక్షులు చెరుకు సుధాకర్



మనతెలంగాణ/ పరిగి: తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నా ఇంకా దొరల దోపిడీ పాలననే కొనసాగుతుందని తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు సుధాకర్ పేర్కొన్నారు. పరిగిలో తెలంగాణ ఇంటి పార్టీ ఆధ్వర్యంలో గురువారం 'సామాజిక తెలంగాణకై ఉద్యమ దీక్ష' చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు సుధాకర్ మాట్లాడుతూ దొరల దోపిడీ పాలనను అంత మొందించేందుకు ఉద్యమ దీక్ష చేపట్టామన్నారు. దీనికి అందరూ సహ కరించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా తెలంగాణ సాధనకు సహకరించిన ఉద్యమకారులను ఆదుకోవాలన్నారు. ప్రతి జిల్లాలో ధర్నాలు చేసి ప్రజల సమస్యలను తెలుకొనేందుకు దీక్షలు చేపడు తున్నామన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ, దోపిడీని ఎత్తిచూపుతూ ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఇందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వెనుకబడిన తదితరులకు సహకరించాలని కోరారు. ఈ దీక్ష కార్యక్రమంలో టీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు చందాస్, టీఐపీ జిల్లా అధ్యక్షుడు రామన్నమాదిగ, సునీల్‌కుమార్, దేవదాస్, దస్తయ్య, అంజి, రమేష్‌బాబు, వెంకటేష్, ఎదిరె నర్సింహులు, బాలయ్య, నంద కుమార్, కృష్ణ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి కూతుర్లు మృతి

మన తెలంగాణ/ ఏనుకూరు: సోదరుని ఇంట్లో శుభకార్యానికి వెళ్ళి తిరిగివస్తుండగా మృత్యువు లారీ రూపంలో ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. తల్లాడ మండలం బాలపేట గ్రామానికి చెందిన పాలెపు శ్రీను (55) తన కుమార్తె నందిని(30)ని ఇల్లందుకు చెందిన ఎన్నం వెంకటేశ్వర్లుకు ఇచ్చి వివాహం జరిపించాడు. నందిని కుంటుంబం బతుకుదెరువు కోసం ఏనుకూరు వచ్చి చిన్నపాటి హోటల్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం బాలపేటలోని నందిని సోదరుడు కుమారుని అన్నప్రాసన్న వేడుకలకు భార్యాభర్తలిద్దరు వెళ్లారు. భార్య నందినిని అక్కడ వదిలేసి హోటల్ వద్ద పనిఉండడంతో భర్త వెంకటేశ్వర్లు ఏనుకూరుకు తిరిగి వచ్చాడు. వేడుకలు ముగిసిన అనంతరం నందినిని ఆమె తండ్రి పాలెపు శ్రీను తానే స్వయంగా ఆటోను నడుపుకుంటూ వస్తుండగా, గార్లొడ్డు సమీపంలో కొత్తగూడెం వైపునుండి వస్తున్న లారీ అతివేగంగా వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టడంతో నందిని తండ్రి అక్కడికక్కడే మృతిచెందగా, కొన ఊపిరితోఉన్న నందినిని 108 వాహనంలో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయినట్లు బంధువులు తెలిపారు. మృతురాలికి ఒక పాప, బాబు ఉన్నారు. ఏనుకూరు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కటౌట్‌పెకి ఎక్కి మహిళ, టిఆర్ఎస్ సర్పంచ్ భర్త హల్‌చల్

మన తెలంగాణ/ ముప్కాల్ : శ్రీరాం సాగర్ పునర్జీవనం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ బహి రంగ సభలో ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రసం గిస్తున్న సమ యంలో పోచం పాడ్‌కు చెందిన మహిళ, నిర్మల్ జిల్లా కడెం మండలం గంగాపూర్ గ్రామ సర్పంచ్ భర్త చంద్రవాస్ కటౌట్ పైకి ఎక్కి హల్‌చల్ చేశారు. తమ గ్రామానికి 60 సంవత్సరాలుగా రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలుమార్లు అధి కారులకు, ప్రజాప్రతి నిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిం దని వాపోయారు. సుమారు 60 మీటర్ల ఎత్తున్న కటౌట్ పైకి ఎక్కి వినతిపత్రంతో నిరసన చేపట్టడంతో పోలీసులు ఉక్కిరిబిక్కిర య్యారు. పోచంపాడ్‌కు చెందిన విజయలక్ష్మీ సైతం సుమారు 40 మీటర్ల వరకు ఎక్కి పై నుండి దూకుతానని..తెలంగాణ రాష్ట్రంలో తమ కుటుంబానికి న్యాయం జరిగేలా లేదని తమ కుటుంబానికి వెంటనే డబుల్ బెడ్ రూం మంజూరు చేయాలని నిరసన తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమి షనర్ కార్తీకేయ మిశ్రా సంఘటనా స్థలానికి చేరుకొని వారితో మాట్లాడి తమ విన్నపాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని హామీ ఇవ్వడంతో కిందికి దిగి వచ్చారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


ప్రాజెక్టుల రీ డిజైనింగ్ పేరుతో వేల కోట్ల ప్రజాధనం వృథా

ముఖ్యమంత్రి తీరుపై శ్రీధర్‌బాబు మండిపాటు



మన తెలంగాణ / పెద్దపల్లి : కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు చేట్టిన ప్రాజెక్టలకు రీడిజైనింగ్ చేసి తాము కొత్తగా ప్రాజెక్టలు కడుతున్నామని ప్రచారం చేసుకుంటూ ముఖ్యమంత్రి వేల కోట్ల రూపా యల ప్రజాధనాన్ని బడా కాంట్రాక్టర్లకు అప్పనంగా దోచి పెడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ మాజీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆరో పించారు. గురువారం పెద్దపల్లి ఆర్అండ్‌బి అతిథి గృహంలో మీడియా సమావేశంలో మాట్లా డుతూ పునరుజ్జీవం పేరుతో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రతిపాదిత ప్రాజెక్ట నుండి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోచంపాడు 200 మీటర్ల ఎత్తులో ఉందని, రివర్స్ పంపింగ్ చేయడానికి 5 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం ఉం టుందని, ఇంత విద్యుత్ ఎక్కడి నుండి తెస్తారో ప్రజలకు వివరణ ఇవ్వా లని శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. నెహ్రూ హయాంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టను కట్టేటప్పుడు గోదావరిపై ఎలాంటి ప్రాజెక్టలు లేవని ఈ 40 ఏళ్లలో మహా రాష్ట్ర లెక్కకు మించి ప్రాజెక్టలు కట్టడంతో ఎస్ఆర్ఎస్‌పిలోకి నీరు రావ డంలేదని అన్నారు. సమావేశంలో ఈర్ల కొమరయ్య, వేముల రామ్మూర్తి, యాట మల్లా రెడ్డి,మంథని నర్సింగ్,కనుకుంట్ల సదానందం పాల్గొన్నారు.

బొగ్గుబావిలో బ్యాలెట్ సందడి



- 14న కార్మిక సంఘాలతో భేటీ
- అదే రోజు ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఓటు హక్కును వినియోగించుకోనున్న 57 వేల మంది కార్మికులు

బొగ్గు బావిలో బ్యాలెట్ సందడి మొదలు కానుంది. ఏడాది కాలంగా ఎదురు చూస్తున్న ఎన్నికల ప్రకటన రానుండటంతో ఐదు జాతీయ కార్మిక సంఘాలతో సహా మొత్తం 17 సంఘాలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. కేంద్ర కార్మిక శాఖ ఆదేశాలతో ఎన్నికల షెడ్యూల్డ్ విడుదల చేయక తప్పనిస్థితి. లేబర్ కమిషనర్ ఈనెల 14న ఎన్నికల విషయమై కార్మిక సంఘాతో సమావేశం ఏర్పాటు చేశారు. సెప్టెంబరులో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు సింగరేణిలో ఐదు సార్లు ఎన్నికలు జరుగగా మూడు సార్లు ఏఐటియుసి, ఒక్కసారి ఐఎన్‌టియుసి, టిబిజికెఎస్ విజయం సాధించాయి. వారసత్వ ఉద్యోగాల కల్పనే నినాదంగా ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

మన తెలంగాణ/ ఖమ్మం ప్రతినిధి : సింగరేణిలో ఆరో దఫా ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ప్రస్తుత సమాచారం మేరకు సెప్టెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఎన్నికలకు సంబంధించి కార్మిక సంఘాలు పలు ప్రతిపాదనలు చేస్తున్నా మార్పులు, చేర్పులకు యాజమాన్యం సుముఖంగా లేకపోవటంతో పాత పద్ధతిలోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. గతంలో విజయం సాధించిన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గుర్తింపు సమయం ముగిసి ఏడాది కావస్తోంది. సింగరేణి వ్యాప్తంగా 57వేల మంది కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సింగరేణిలో 10 ఏరియాలు, ఒక కార్పొరేట్ ఏరియా ఉంది. ఏరియాల్లో విజయం సాధించిన సంఘం ఏరియాల్లో గుర్తింపు సంఘంగా ఉంటుంది. మొత్తం సింగరేణిలో విజయం సాధించిన సంఘానికి ఏరియాలో ఓడిపోయిన ప్రాతినిథ్య సంఘంగా ఉంటుంది. శ్రీరాంపురం, మందమర్రి, గోలేటి, ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం, భూపాలపల్లి, రామగూడెం, 1,2,3 ఏరియాలతో పాటు కార్పొరేట్ ఏరియా ఉంటుంది. గత ఎన్నికల్లో ఇల్లందు, గోలేటి ఏరియాల్లో ఏఐటియుసి, మణుగూరు కార్పొరేట్‌లో ఐఎన్‌టియుసి, రామగుండం 1,2లలో హెచ్‌ఎంఎస్‌లు విజయం సాధించగా మిగిలిన ఐదు చోట్ల టిబిజికెఎస్ విజయం సాధించింది. గుర్తింపు సంఘంగా టిబిజికెఎస్ ఎన్నికైంది.


సవరణలు : ఎన్నికల సందర్భంగా కార్మిక సంఘాలు పలు సవరణల కోసం డిమాండ్ చేస్తున్నాయి. కార్మికుల నుంచి నిధి సేకరణ, రెండు బ్యాలెట్లు, ఎన్నికల కాల పరిమితిని తగ్గించడం, గేట్ మీటింగ్‌లు ఏర్పాటు చేసుకునే అవకాశం మొదలైన విషయంలో సవరణలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఎన్నికల కాలపరిమితిని రెండేళ్లకు తగ్గిస్తే ఉత్పత్తిపై ప్రభావం చూపుతుందని అందువల్ల ఇప్పుడు నాలుగు ఏళ్ల కాలపరిమితినే కొనసాగించాలని యాజమాన్యం భావిస్తుంది. ఆర్టీసీమాదిరి రెండు బ్యాలెట్ల పద్ధతికి సుముఖత వ్యక్తం చేయడం లేదు. గేట్ మీటింగ్‌లు, నిధి వసూళ్లు అంగీకరించిన కార్మికుని నుంచి రికవరీ చేసి యూనియన్ ఖాతాలో జమ చేసే విషయంలో యాజమాన్యం నుంచి కొంత సానుకూలత వ్యక్తమవుతున్నట్లు సమాచారం.

వారసత్వ ఉద్యోగాల కల్పనే నినాదం :ఈసారి జరిగే సింగరేణి ఎన్నికల్లో వారసత్వ ఉద్యోగాల కల్పనే ప్రధాన నినాదంగా మారనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వారసత్వ ఉద్యోగాల అవకాశాలకు సంబంధించి జీవో విడుదల చేసింది. లోపభూయిష్టమైన జీవో న్యాయస్థానం ముందు నిలబడలేదు. సుప్రీంకోర్టుసైతం తిరస్కరించింది. సింగరేణి సంస్థ నిబంధనల మేరకు గుర్తింపు సంఘంతో ఒప్పందం చేసుకుంటే సింగరేణి కార్మికుల వారసులకు ఉద్యోగాలు లభించేవని న్యాయపరమైన ఇబ్బందులు ఎదురయ్యేవి కావని ఏఐటియుసి వాదిస్తుంది. దీనిపై సింగరేణిలో సమ్మె జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ వారసత్వ ఉద్యోగ ప్రకటన తర్వాత సింగరేణి కార్మిక వారసుల్లో ఆశలు చిగురించాయి. వారసత్వ ఉద్యోగం అనే అంశం ప్రాతిపదికగా వందల కుటుంబాల్లో పెళ్లిళ్లు జరిగాయి. ఆ కుటుంబాల్లో గందరగోళం నెలకొంది. అందు కే వారసత్వ ఉద్యోగాల కల్పనే ప్రధాన డిమాండ్ కానుంది.

రాజకీయాలపై ప్రభావం : సింగరేణి ఎన్నికలు 13 అసెంబ్లీ నియోజక వర్గాలపై రాజకీయ ప్రభావం చూపనున్నాయి. ఐదు పార్లమెంటు నియోజక వర్గాల పరిధిలో సింగరేణి సంస్థ వ్యాపించి ఉంది. 17 కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ప్రధాన పోటీ ఎఐటియుసి, టిబిజికెఎస్ మధ్యన ఉండనుంది. కాగా, అవిభాజ్య ఖమ్మం జిల్లాలో మూడు ఏరియాలు ఒక కార్పొరేట్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ఇల్లందులో వరుసగా ఐదుసార్లు ఎఐటియుసి విజయం సాధిస్తోంది. మణుగూరు, కొత్తగూడెం ఏరియాల్లో సైతం గతంలో ఎఐటియుసి విజయం సాధించగా గత ఎన్నికల్లో మణుగూరును ఐఎన్‌టియుసి, కొత్తగూడెంను టివిజికెఎస్ దక్కించుకున్నాయి. కార్పొరేట్‌లో ఐఎన్‌టియుసి విజయం సాధించాయి.

రాజకీయ ప్రక్షాళన అత్యావసరం : చాడ

సామాజిక న్యాయం కోసం అక్టోబర్ 5 నుండి డిసెంబర్ 5 వరకు తెలంగాణలో సిపిఐ బస్సు యాత్ర



మన తెలంగాణ/సిరిసిల్ల: దేశవ్యాప్తంగా పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్ శక్తులు, గుండాలు, హంతకులు, కుల, మత, ప్రాంతీయ తత్వవాదులు రాజకీయ నాయకుల అవతారం ఎత్తడం తో కలుషిత రాజకీయాలు పెరిగిపోయాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకటరెడ్డి అన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం కార్మిక భవనంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందన్నారు. ప్రక్షాళన జరగాలని, అందుకోసం ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా సిపిఐ ఎదుగుతోందని, కమ్యూనిస్టులపై సిఎం కెసిఆర్ వ్యవ హరిస్తున్న తీరు అహంకార పూరితంగా ఉందన్నారు. సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం కోసం అక్టోబర్ 5 నుంచి డిసెంబర్ 5 వరకు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో సిపిఐ బస్సు యాత్ర చేపడుతుందన్నారు. పెద్దనోట్ల రద్దు వల్ల ప్రధాని మోదీ ఏం ఘనకార్యం సాధించారని ఆయన ఎద్దేవా చేశారు. బ్యాంకుల ముందు క్యూ లైన్లలో నిలబడి 20మంది సామాన్యులు ప్రాణాలు కోల్పోయారని వివరించారు. పశు విక్రయంపై నిషేధం విధిస్తే సుప్రీం కోర్టు స్టే విధించినట్లు తెలిపారు. పాలకుల వ్యవహార శైలి వల్ల కోర్టులను ఆశ్రయించక తప్పడం లేదన్నారు. తెలంగాణ సిఎం కెసిఆర్ పెద్దనోట్ల రద్దుకు, జిఎస్‌టి విధింపుకు అందరి కన్నా ముందుగా మద్దతు ప్రకటించి ఇప్పుడు తలపట్టుకుని కోర్టుకు వెళ్తాననడం ఏమిటన్నారు. తెలం గాణలో రెండు లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టుల పనులు నడుస్తున్నాయని అన్నారు. వాటిపై జిఎస్‌టి 36 వేల కోట్ల రూపాయలు కట్టాల్సి ఉంటుందన్నారు. తెలంగాణలో వస్త్ర పరిశ్రమ, బిడి పరిశ్రమతో సహ అనేక వాటిపై జిఎస్‌టి విధింపు వల్ల పరిశ్రమలు నష్టపోతాయని చెపితే వినలేదన్నారు. పేద వారు వినియోగించే ప్రతి వస్తువుపై జిఎస్‌టి ప్రభావం పడుతోందని చాడా అన్నారు. సబ్బండవర్గాలు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యా ర్థులు పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను సిఎం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, కేంద్రానికి తాకట్టు పెడుతున్నాడని, రాష్ట్ర ప్రజల హక్కులు కాలరాస్తున్నాడని ఆరోపించారు. ఇతరులు న్యాయ పోరాటం చేస్తానంటే తప్పు పడుతున్న సిఎం ఇప్పుడు తాను న్యాయ పోరాటానికి దిగుతాననడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.

30 నుండి నేరెళ్లలో నిరాహార దీక్ష

కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు



మన తెలంగాణ/వేములవాడ : నేరెళ్ల సంఘటనలో అమాయకులను పట్టుకొని చిత్రహింసలకు గురి చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 30న నేరెళ్లలో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి. మనుమంతరావు అన్నారు. గురువారం వేములవాడ పట్టణంలో మనోహర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లారీల దగ్ధం కేసులో అమాయకులను పట్టుకొని చిత్రహింసలకు గురి చేసి వారి మర్మాంగాపై షాకులు పెట్టి నరకం చూపిస్తారా అంటూ ఆయన మండిపడ్డారు. అమాయకుల ప్రాణాలతో చలగాటమాడిన జిల్లా ఎస్పీ విశ్వజిత్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘటన జరిగిన 48 రోజుల గడుస్తున్న తరుణంలో రాష్ట్ర మంత్రి కెటిఆర్ నామమాత్రంగా బాధితులను పరామర్శించి, వారికి స్పష్టమైన హామీలు ఇవ్వలేదన్నారు. పైగా బాధితులను పరామర్శించడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులను టూరిస్టులంటూ ఎగతాళిగా మాట్లాడటం సరికాదన్నారు. వెంటనే నేరెళ్ల బాధితుల డిమాండ్లను పరిష్కరించాలని లేని పక్షంలో ఈ నెల 30న నేరెళ్ల గ్రామంలో నిరాహార దీక్ష చేపట్టి రాహుల్ గాంధీతో సహా, జాతీయ నాయకులందర్ని దీక్షకు రప్పించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తా అన్నారు. కెసిఆర్ వికృతస్వరూపాన్ని ఊరూర ఎండగడుతానని తెలిపారు.

వైద్య కళాశాల సాధించేంత వరకు ఉద్యమం

ముఖ్యమంత్రికి పొన్నం బహిరంగ లేఖ



మన తెలంగాణ/కరీంనగర్ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అంకిత భావంతో ఉద్యమించిన రీతిలోనే కరీంనగర్‌కు ప్రభుత్వ మెడికల్ కళాశాల సాధించేంతవరకు ఉద్యమిస్తానని లోక్ సభ మాజీ సభ్యుడు పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం ప్రభుత్వం నుండి ప్రకటన, కళాశాల ఏర్పాటు కోసం నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసి) వచ్చేంతవరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్, సిద్ది పేటలో మెడికల్ కళాశాలల ఏర్పాటుకు తాను వ్యతిరేకిని కానన్నారు. వీటితో పాటు రామగుండం, జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాలకు కూడా వైద్య కళాశాలల అవసరం ఉందన్నారు. కరీంనగర్ వైద్య కళాశాలకు మూడేళ్ళ క్రితమే ముఖ్యమంత్రి స్వయంగా హామీ ఇచ్చినందున దాని సాధనకోసం ఆమరణ దీక్ష చేపట్టాల్సి వచ్చిందన్నారు. కరీంనగర్ వైద్యకళాశాలకు ఎంసిఐ ఎన్‌ఓసి ఇవ్వలేదని టిఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని తప్పుపట్టారు. కరీంనగర్ కంటే అతి చిన్నదైనా పాండిచేరిలో 12 వైద్య కళాశాలలకు ఎంసిఐ అనుమతి ఇచ్చిన విషయాన్ని తన లేఖలో గుర్తుచేశారు. విషయ పరిజ్ఞానం లేకుండా ఇక్కడ ఏర్పాటు చేయాడానికి హామీ ఇచ్చినా వైద్య కళాశాలలను తిరస్కరించాలని చూస్తే అధికార పార్టీ నేతలను ప్రజలు క్షమించరని స్పష్టం చేశారు. మధ్యమానేరు నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించి హామీ నిలబెట్టుకోలేకపోతున్నందున క్షమించాలని సిఎం ప్రజలను కోరిన విషయాన్ని గుర్తు చేశారు. కరీంనగర్ నుండి లోక్‌సభకు మూడు సార్లు ఎన్నికైనా ముఖ్యమంత్రి మెడికల్ కళాశాల హామీని నిలబెట్టుకోలేకపోతే ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిగా కరీంనగర్ తొలి పర్యటనలో పట్టణాన్ని లండన్, న్యూయార్క్, డల్లాస్ మాదిరిగా తీర్చిదిద్దుతానన్న హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు జిల్లా అనువుగా ఉన్నా దానిని గజ్వేల్‌కు, చొప్పదండి లెదర్ పార్క్‌ను వరంగల్ జిల్లాకు తరలించినా విషయాన్ని గుర్తు చేశారు. స్థల కేటాయింపులు జరిగిన ఐటి పార్క్‌ను ఈ జిల్లాకు రాకుండా తరలించారని తెలిపారు. సిరిసిల్లకు ప్రాధాన్యత ఇవ్వాల్సివుండగా ప్రాజెక్టును వరంగల్‌కు తరలించారన్నారు. కేవలం100 పడకల ఆసుపత్రి ఉన్న సిద్దిపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు 1000 కోట్లు కేటాయించి, ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ప్రభుత్వం ఇక్కడ అన్ని వనరులు ఉన్నప్పటికీ ఏర్పాటుకు ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు.

చికిత్స కోసం నేను కూడా గాంధీకి వస్తా

- ఇక రాష్ట్రం ఆరోగ్య తెలంగాణ : గవర్నర్
- 65 పడకల ఐసియు ప్రారంభం
- ఐసియులో అత్యాధునిక మెషినరీ ఏర్పాటు



మన తెలంగాణ/సికింద్రాబాద్ : రానున్న రెండేళ్లల్లో తెలంగాణ లో వైద్య ముఖచిత్రం సమూలంగా మారనుందని గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ అన్నారు. గురువారం ఆయన ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డితో కలిసి గాంధీ ఆసుపత్రి లోని అత్యవసర విభాగంలోని 65 పడకల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ , పౌర సమాజ సమాచార యంత్రం, డిజిటల్ రేడియోగ్రఫి, సిటి స్కాన్, సెంట్రల్ దయాగ్నసిస్ ల్యాబరేటరీని ప్రారం భించారు. ఒక్కో పరికరం విలువ, వినియోగం వంటి అనేక అంశాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైద్య రంగంలో తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన మార్పులు సానుకూల పలితాలు ఇస్తున్నాయన్నారు.ఆరోగ్య తెలంగాణ కోసం వైదరంగంలో ప్రభుత్వం చేపట్టిన మార్పులు రానున్న ఒకటి రెండేళ్లలో పూర్తి పలితాలిస్తాయన్నారు. అత్యాదునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేసి వైద్యులు, సిబ్బంది ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందిస్తున్నారని చికిత్స కోసం గాంధీకి రావాలని పిలుపునిచ్చారు. గాంధీ ఆసుపత్రి మనందరిదని సెన్సేషన్ కోసం ఆసుపత్రిలోని చిన్న విషయాలను పెద్దవిగా చేసి చూపెట్టొద్దని వైద్యరంగాన్ని సున్నితంగా చూడాలని మీడియాకు సూచించారు. ఆసుపత్రిలో అత్యాదునికి వసతులు అందుబాటులోకి వచ్చాయని నేను కూడ చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి వస్తానన్నారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని అందుకు సహకరించాలని మేయర్ బొంతురామ్మోహన్‌కు సూచించారు.మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వైద్యం మీద ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. ఒపి, ఐపి పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. గవర్నర్ సూచనలు ముఖ్యమంత్రి కెసిఆర్ చొరవతో కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నే రీతిలో గాంధీ ఆసుపత్రిలో అత్యాదునికి వైద్యపరికరాలు ఏర్పాటు చేసి అన్ని వసతులను కల్పించి మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టిఎస్ ఎంఎస్ఐడిసి చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, మేయర్ బొంతు రాంమోహన్, రాజేశ్వర్ తివారి, వేణుగోపాల్, లక్ష్మణ్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, గాంధీ ఆసుపత్రి ప్రిన్సిపల్ డాక్టర్ మంజుల, సూపరిండెంట్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి

మన తెలంగాణ/గొల్లపెల్లి: జగిత్యాల జిల్లా మండలంలోని రాపల్లి గ్రామానికి చెందిన యాదరవేని కొంర య్యకు చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా 20 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన కొంరయ్యకు తన ఇంటి వద్దే నిర్మించుకున్న షెడ్డులోని గొర్రెలపై కుక్కలు దాడి చేశాయి. 20గొర్రెలు సంఘటన స్థలం లోనే మృతి చెందగా గాయపడిన మిగతా గొర్రెలను పశు వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందజే స్తున్నారు. ఈ సంఘటనతో బాధిత రైతుకు రూ.1లక్ష వరకు నష్టం వాటిల్లిందని గ్రామస్థులు తెలిపారు. కొంరయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాగా, గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోకపోవడం వల్లనే రాపల్లి సంఘటనలో గొర్రెలు మృతి చెందాయని జిల్లా గొర్రెల కాపరుల సంఘ అధ్యక్షులు కచ్చు కొంరయ్య యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంరయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

'ట్యూబ్‌లైట్' నష్టపరిహారాన్ని ఇవ్వబోతున్నాడు!

మన దేశంలో సినిమా తీసే ఖర్చుకన్నా అందులో నటించే హీరోహీరోయిన్‌లు, ఇతర నటులకే ఎక్కువగా ఇచ్చుకోవాల్సి ఉంటుంది. స్టార్ హీరోలకైతే నిర్మాత భారీగా రెమ్యునరేషన్ ఇచ్చుకోవాల్సిందే. స్టార్ హీరోల సినిమాల విడుదలకు ముందే నిర్మాత రిలీజ్ రైట్స్‌ను అమ్మేస్తాడు. దీంతో సినిమా లాభ నష్టాల ప్రభావం డిస్ట్రిబ్యూటర్‌పైనే ఉంటుంది. ఈమధ్య విడుదలైన బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ సినిమా 'ట్యూబ్‌లైట్' ఎంత పెద్ద ఫ్లాప్ అయిందో తెలిసిందే. ఈ సినిమాను నమ్మి ఫ్యాన్సీ రేట్‌కు తీసుకున్న డిస్ట్రిబ్యూటర్లకు తీవ్ర నష్టం వచ్చింది. దీంతో తండ్రి సలీమ్ ఖాన్ చెప్పిన మేరకు సల్మాన్ తన సినిమా నష్టాన్ని కొంత భరించడానికి సిద్ధపడ్డాడు. అయితే ట్యూబ్‌లైట్ వల్ల వచ్చిన నష్టానికి పరిహారాన్ని జూలైలోనే చెల్లించాలని అనుకున్నాడు సల్మాన్. కానీ 'టైగర్ జిందా హై' సినిమా షూటింగ్ వల్ల అతను విదేశాల్లోనే ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు ఆయన ముంబయ్ తిరిగి వచ్చేశారు. తాను ఇచ్చిన మాట ప్రకారం 32.5 కోట్లు నష్ట పరిహారం ఇవ్వడానికి సల్మాన్ సిద్ధమయ్యాడు. అయితే ట్యూబ్‌లైట్ సినిమాకు వచ్చిన నష్టంలో ఇది సగమేనట.



కొత్త కాన్సెప్ట్ సినిమాలు చేయాలనుకుంటా


రానా

'బాహుబలి'లో భల్లాలదేవగా తన అద్భుతమైన నటనతో దేశ, విదేశాల్లో మంచి క్రేజ్‌ను సంపాదించుకున్నారు రానా దగ్గుబాటి. 'లీడర్' సినిమాతో హీరోగా సినీ రంగ ప్రవేశం చేసిన ఆయన కృష్ణం వందే జగద్గురుమ్, ఘాజీ వంటి డిఫరెంట్ చిత్రాలతో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేశారు. ఇప్పుడు తేజ దర్శకత్వంలో రానా నటించిన డిఫరెంట్ ఎంటర్‌టైనర్ 'నేనే రాజు నేనే మంత్రి'. డా. డి.రామానాయుడు సమర్పణలో బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డి.సురేష్‌బాబు, కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలకాబోతున్న సందర్భంగా రానాతో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు...

ఈ ఏడాది మూడు సినిమాలు...
ఈ ఏడాది ఇప్పటికే నేను చేసిన బాహుబలి2, ఘాజీ చిత్రాలు విడుదలయ్యాయి. ఇప్పుడు నా మూడవ చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇవన్నీ డిఫరెంట్ జోనర్ సినిమాలు. బాహుబలి2 బిగ్గెస్ట్ హిట్ అయి తెలుగు సినిమా సత్తాను ప్రపంచానికి చాటి చెప్పింది. ఘాజీ కూడా సూపర్ హిట్ అయి విమర్శకుల ప్రశంసలను అందుకుంది. ఇక 'నేనే రాజు నేనే మంత్రి' ఔట్ అండ్ ఔట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్.

పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో...
దర్శకుడు తేజ ఈ కథ చెప్పగానే వెంటనే నేను, మా నాన్న ఓకే చేశాం. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో కొనసాగే జోగేంద్ర, రాధ లవ్ స్టోరీ ఈ చిత్రం. మాస్ డైలాగ్స్, యాక్షన్, ఎమోషన్ సీన్స్ అన్నీ ఈ చిత్రంలో ఉంటాయి. రియలిస్టిక్‌గా సాగే ఫుల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఇది.

ఓ కొత్త జోనర్‌లో...
సినిమాలో నేను రెండు డిఫరెంట్ షేడ్స్ ఉన్న జోగేంద్ర క్యారెక్టర్‌లో నటించాను. తొలిసారి ఓ కొత్త జోనర్‌ను టచ్ చేశాను. అందరికీ నచ్చుతుందనే ఈ సినిమా చేశాను.

ముగ్గురికి కథ నచ్చింది...
తొలిసారి మా సురేష్ ప్రొడక్షన్‌లో ఈ సినిమా చేస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఎప్పటినుండో మా బ్యానర్‌లో సినిమా చేద్దామని అనుకుంటున్నాను. కానీ కుదరలేదు. చివరికి ఇప్పటికి ఈ సినిమాతో కుదిరింది. ఇక నా సినిమాలన్నీ రెగ్యులర్‌గా కాకుండా కొంచెం రొటీన్‌కు భిన్నంగా ఉంటాయి. నాన్న పెద్ద స్టార్ ప్రొడ్యూసర్.
మా చిన్నాన్న బిగ్ యాక్టర్. ఇద్దరూ మా బ్యానర్‌లో ఎన్నో సక్సెస్‌ఫుల్ సినిమాలు చేశారు. అయితే మొదటిసారి మా నాన్నకు, చిన్నాన్న వెంకటేష్‌కు, నాకు కథ నచ్చింది. తేజతో కూర్చొని చర్చించి ఈ సినిమాను వెంటనే ప్రారంభించేశాం.

చిన్న అంశంగానే పొలిటిక్స్...
కెరీర్ ప్రారంభంలో చేసిన 'లీడర్' పూర్తిగా పొలిటికల్ సినిమా. కానీ ఈ సినిమాలో పొలిటిక్స్ అనేది చిన్న అంశం మాత్రమే. భర్త, భార్య మధ్య జరిగే కథ ఇది. అనంతపురం, కారైకుడి ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారం చేసే వ్యక్తి జోగేంద్ర. అలాంటి వ్యక్తికి కొన్ని పరిస్థితులు ఎదురవుతాయి. అవేమిటనేది తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే.

ప్రధాన కారణం అదే...
దర్శకుడు తేజతో పనిచేయడం మరచిపోలేని అనుభవాన్నిచ్చింది. ఈ చిత్రంలో ఆయన రాజకీయాలను చాలా అద్భుతంగా చూపించారు. ఈ కథ నాకు నచ్చడానికి ప్రధాన కారణం కూడా అదే. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయాల గురించి వివరంగా ఈ చిత్రంలో చూపించారు.

తమిళ్‌లో మార్పులు చేశాం...
ఈ సినిమా చూశాక తమిళ రాజకీయాలకు ఇది బాగా కనెక్ట్ అవుతుందని అనిపించింది. నేను పొలిటికల్ సినిమా చేసినప్పుడు ఎక్కడో ఒక చోట కనెక్ట్ అవుతూనే ఉంది. ఈ సినిమాను తమిళ్‌లో చాలా మార్పులు చేసి చేశాం.

నా క్యారెక్టర్‌లో ఎక్కువ వేరియేషన్స్...
'నేనే రాజు నేనే మంత్రి' కోసం ఫిజికల్‌గా చాలా కష్టపడ్డాను. ఆరు, ఏడు సంవత్సరాల్లో జరిగే కథ ఇది. నా క్యారెక్టర్‌ను తేజ అద్భుతంగా డిజైన్ చేశారు. వడ్డీ వ్యాపారి ఎలా ఉంటాడో అలాగే నా శరీరాన్ని మలుచుకున్నాను. అలాగే ఒక సాధారణ వ్యక్తి దురహంకారిగా మారితే ఎలా ఉంటాడో ఆవిధంగా నా క్యారెక్టర్ మారుతుంది. సినిమాలో మార్పులనేవి చాలా సెటిల్డ్‌గా ఉంటాయి.

ఫిట్‌నెస్ విషయంలో శ్రద్ధ...
నా క్యారెక్టర్‌లో ఎక్కువ వేరియేషన్స్ ఉంటాయి. ఇక నా జిమ్ ట్రైనర్ కునాల్ నాతో ఏడు సంవత్సరాలుగా ప్రయాణిస్తున్నాడు. నా శరీరాన్ని క్యారెక్టర్‌కు అనుగుణంగా అద్భుతంగా మలుస్తాడు. ఈ సినిమా కోసం ఫిట్‌నెస్ విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకున్నాను.

లక్కీగా అన్నీ మంచి సబ్జెక్ట్స్...
నాకు సినిమాలు అంటే ఇష్టం. యాక్టింగ్ అంటే ఎంతో ఇష్టం. మా కుటుంబమంతా సినిమా ఇండస్ట్రీలోనే ఉంది. లక్కీగా నాకు అన్నీ మంచి సబ్జెక్ట్స్ వస్తున్నాయి.ఏదైనా కొత్తగా చేయాలనే తాపత్రయం నాలో ఉంది. కొత్త ఆలోచనలతో వస్తున్న దర్శకులను ప్రోత్సహించాలి. అప్పుడే మంచి సినిమాలు బయటకు వస్తాయి.

పూర్తి సంతృప్తినిచ్చాయి...
కొత్త కాన్సెప్ట్ సినిమాలు చేయాలని నేను కోరుకుంటాను. సినిమా చేసే ప్రతిసారి ఆ క్యారెక్టర్ ద్వారా నేను ఏం నేర్చుకోవచ్చు అని ఆలోచిస్తాను. ప్రతిసారి చేసిన సినిమానే చేస్తే ప్రేక్షకులు, నాకు బోర్ కొడుతుంది. ఏడు సంవత్సరాల్లో నేను చేసిన అన్ని సినిమాలు నాకు పూర్తి సంతృప్తినిచ్చాయి.

నాకు ఎలాంటి భయం లేదు...
ఖచ్చితంగా 'నేనే రాజు నేనే మంత్రి' వంటి సినిమా అయితే ఎవరూ తీయరు. కాబట్టి నాకు ఎలాంటి భయం లేదు. శుక్రవారం వస్తున్న మూడు సినిమాలు భిన్నమైన జోనర్స్‌కు చెందినవి. కాబట్టి అన్నీ బాగా ఆడుతాయి. పైగా లాంగ్ వీకెండ్ కూడా ఉంది. కాబట్టి వసూళ్లు కూడా బాగుంటాయి.

బ్యూటిఫుల్ లవ్ స్టోరి


నందు, ప్రగ్యాజైస్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, బెల్లంకొండ శ్రీనివాస్, బోయపాటి శ్రీను, మిర్యాల రవీందర్ రెడ్డి

బోయపాటి శ్రీను దర్శకత్వంలో యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన చిత్రం 'జయ జానకి నాయక'. ద్వారకా క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ''ఇప్పటివరకు దర్శకుడు బోయపాటి శ్రీను చేసిన సినిమాలన్నింటిలో కంటే 'జయ జానకి నాయక' బెస్ట్ మూవీ చెప్పగలను. ఆయన ఇప్పటివరకు ఆరు సినిమాలు చేశారు. ఆరు సినిమాలు సూపర్ హిట్టే. ఈ సినిమాలన్నింటిలో ఏదో ఒక కంటెంట్ మనకు కనపడుతుంది. అలాగే ఈ సినిమాలో మంచి లవ్ స్టోరీ, ఫ్యామిలీ ఎమోషన్స్, మాస్ ప్రేక్షకులకు కావాల్సిన యాక్షన్ ఉన్నాయి. సినిమాకు మంచి కథ కుదరడమే తొలి సక్సెస్. దీంతో సినిమాపై ఎంతో నమ్మకంగా ఉన్నాం. ముందు 45 నిమిషాల సినిమాలో మంచి లవ్ స్టోరీ ఉంటుంది. తర్వాత ఫ్యామిలీ డ్రామా నడుస్తుంది. బెల్లంకొండ శ్రీనివాస్, రకుల్‌ప్రీత్ అద్భుతంగా నటించారు. నిజమైన ప్రేమ ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూస్తారు''అని అన్నారు. బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ''ఇంత మంచి సినిమాను నాకు ఇచ్చినందుకు బోయపాటి శ్రీనుకు థాంక్స్. నేను జీవితాంతం చెప్పుకునే సినిమాగా ఇది నిలుస్తుంది. సినిమాను ఇంత గ్రాండ్‌గా తీసినందుకు రవీందర్ రెడ్డికి ధన్యవాదాలు. ఈ సినిమా పెద్ద సక్సెస్ సాధించి ఆయన టాప్ లీగ్ ప్రొడ్యూసర్ అవుతారు. జానకి క్యారెక్టర్‌ను రకుల్ తప్ప మరెవరూ చేయలేరన్నంతగా ఆమె బాగా నటించింది. ప్రగ్యా కూడా ఆకట్టుకుంటుంది. జగపతిబాబు, శరత్‌కుమార్ వంటి లెజెండ్స్‌తో పనిచేయడం ఆనందంగా ఉంది''అని చెప్పారు. బోయపాటి శ్రీను మాట్లాడుతూ ''బెల్లంకొండ శ్రీనివాస్ ఎంతో ఇష్టపడి కష్టపడి చేసిన సినిమా ఇది. భద్ర తర్వాత నేను చేసిన బ్యూటిఫుల్ లవ్ స్టోరీ ఇది. ఇదొక ఫీల్‌గుడ్ మూవీ, మంచి ఎమోషనల్ మూవీ, మంచి యాక్షన్ మూవీ అని ప్రేక్షకులు సినిమా చూసిన తర్వాత అంటారు. మిర్యాల రవీందర్ రెడ్డి వంటి మంచి నిర్మాతలు ఇండస్ట్రీకి ఎంతో అవసరం''అని చెప్పారు. రకుల్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ''నాకు ఈ సినిమాలో జానకి క్యారెక్టర్ దొరకడం నా అదృష్టం. ఇంత పెద్ద ఎమోషన్ ఉన్న క్యారెక్టర్ చేయగలనన్న నమ్మకంతో నాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన దర్శకుడు బోయపాటి శ్రీనుకు థాంక్స్. సినిమాలో ప్యూర్ లవ్ స్టోరీ ఉంటుంది. పాటలు, ఫైట్స్ అన్నీ కథలో భాగంగా ఉంటాయి''అని తెలిపారు. ప్రగ్యా జైస్వాల్ మాట్లాడుతూ ''సినిమా కోసం అందరం ఓ ఫ్యామిలీలా కలిసి కష్టపడ్డాం. బోయపాటి శ్రీను నుండి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇందులో గ్లామరస్ రోల్ చేశాను''అని అన్నారు. ఈ సమావేశంలో నందు పాల్గొన్నారు.

ఐష్‌తో నటించనన్నాడు!


ఐశ్వర్యారాయ్

ఐశ్వర్యారాయ్ అంటేనే నిలువెత్తు సౌందర్యం. అందుకే ఆమె పక్క హీరోగా నటించడానికి సీనియర్ హీరోల నుంచి యంగ్ హీరోల వరకు ఆసక్తి చూపిస్తారు. ఆమధ్య కెరీర్‌లో కొంత గ్యాప్ తీసుకున్న ఈ నీలికళ్ల సుందరి 'ఏ దిల్‌హై ముష్కిల్' సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చింది. ఏకంగా యంగ్ హీరో రణబీర్ కపూర్ పక్కన హీరోయిన్‌గా నటించి అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా ఐష్... ఓం ప్రకాష్ మెహ్రా సినిమా 'ఫ్యానీ ఖాన్'లో నటించేందుకు అంగీకారం తెలిపింది. ఇందులోనూ ఆమె ఓ యంగ్ హీరోతో కలిసి నటించనుంది. ఇందుకోసం ముందుగా బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ తమ్ముడు అక్షయ్ ఒబెరాయన్‌ను తీసుకుందామని ఫిల్మ్‌మేకర్స్ అనుకున్నారు. కానీ అక్షయ్ ఒబెరాయ్ ఈ ఆఫర్‌ను వద్దనుకున్నాడట. ఐశ్వర్యారాయ్‌తో కలిసి నటించే సువర్ణావకాశాన్ని కాదనుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇందుకు కారణం అక్షయ్ అన్నయ్య వివేక్ ఒబెరాయేనట.
ఒకప్పుడు వివేక్ ఒబెరాయ్, ఐశ్వర్యారాయ్‌ల మధ్య జోరుగా ప్రేమాయణం కొనసాగింది. తర్వాత వారి మధ్య వ్యవహార బెడిసికొట్టి ఐశ్వర్య... అభిషేక్‌బచ్చన్‌కు దగ్గరై అమితాబ్ బచ్చన్ ఇంటి కోడలైంది.
తనను వద్దన్న ఐశ్వర్య పక్కన తన తమ్ముడు నటిం చం ఏమిటని అనుకున్నాడో ఏమో కానీ వివేక్ ఒబెరాయ్ 'ఫ్యానీ ఖాన్'లో నటించకుండా అక్షయ్ ఒబెరాయ్‌ను అడ్డుకున్నాడు. దీంతో సినిమా యూనిట్ చేసేదేమీ లేక మరో యంగ్ హీరో కోసం చూస్తున్నారట.



టాటా-స్కొడా మధ్య చర్చలు రద్దు

ముంబయి: టాటా మోటార్స్, స్కొడా ఆటో మధ్య భాగస్వామ్యంపై చర్యలకు ముగింపు పడింది. వాణిజ్య మార్కెట్‌లో సంయుక్తంగా కార్ల అభివృద్ధి విషయమై ఇరు సంస్థల మధ్య సహకార చర్చలు రద్దయ్యాయి. సంయుక్తంగా సాంకేతికత, వాణిజ్య అంశాల్లో సహకారం అందించుకోవడం కోసం స్కొడా మాతృ సంస్థ వోక్స్‌వ్యాగన్, టాటా మోటార్స్‌లు చర్చలు చేపట్టాయి. దీర్ఘకాలం భాగస్వామ్యం కోసం ఒప్పందం చేసుకోనున్నట్టు మార్చిలో ఇరు కంపెనీలు ఓ ప్రకటన చేశాయి.

ఐషర్ ఫలితాలు బాగున్నా షేరు డీలా

న్యూఢిల్లీ: వాణిజ్య వాహన తయారీ కంపెనీ ఐషర్ మోటార్స్ జూన్ త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను ప్రకటించినప్పటికీ మరుసటి మార్కెట్‌లో షేరు నేలచూపులు చూస్తోంది. బిఎస్‌పై షేరు విలువ 3.62 శాతం పడిపోయి రూ.30,350కు చేరుకుంది. క్యూ1 ఫలితాల్లో కంపెనీ లాభం 22 శాతం వృద్ధితో రూ.459 కోట్లకు చేరింది. ఆదాయం సైతం 29 శాతం పెరిగి రూ.2,332 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో లాభం రూ.376 కోట్లు, ఆదాయం రూ.1,801 కోట్లుగా ఉన్నాయి. వ్యయాలు కూడా 27 శాతం అధికమై రూ.1,680 కోట్లుగా నమోదయ్యాయి.

ఉత్పత్తి పెంచేందుకు పిసిబిఎల్ రూ. 300 కోట్ల పెట్టుబడులు

కోల్‌కతా: సామర్థ్యం పెంచేందుకు రూ.300 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు ఆర్‌పి గోయెంకా గ్రూప్‌కు చెందిన కంపెనీ ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్(పిసిబిఎల్) ప్రకటించింది. దక్షిణ భారత్‌లో గ్రీన్‌ఫీల్డ్ కార్బన్ బ్లాక్ ప్లాంట్‌ను మరింత వృద్ధి చేయనున్నామని అన్నారు. కార్బన్ బ్లాక్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 4.8 లక్షల టన్నులుగా ఉందని, ఇప్పుడు తాము గుజరాత్‌లోని పాలేజి, ముంద్రా ప్లాంట్లలో రూ.300 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నామని, దీని ద్వారా మరో 80 వేల టన్నులకు సామర్థ్యం పెరగనుందని పిసిబిఎల్ చైర్మన్ సంజీవ్ గోయెంకా అన్నారు. దక్షిణ భారత్‌లో గ్రీన్‌ఫీల్డ్ ప్లాంట్ 1.2 లక్షల టన్నుల సామర్థ్యం కోసం పరిశీలిస్తోందని అన్నారు. తమిళనాడులో భూమిని కల్గి ఉన్నామని, ఆంధ్రప్రదేశ్‌ను రెండో ఆప్షన్‌గా నిర్ణయించుకున్నామని ఆయన తెలిపారు.

రెండు నెలల గరిష్ఠానికి బంగారం

ముంబయి: క్షీణిస్తూ వస్తున్న బంగారం ధర మళ్లీ పైపైకి పరుగులు పెడుతోంది. గురువారం పసిడి ధర రెండు నెలల గరిష్ఠానికి చేరుకుంది. పది గ్రాముల బంగారం రూ.340 పెరిగి రూ.29,890కి చేరింది. అంతర్జాతీయ పరిస్థితులు, స్థానిక ఆభరణాల తయారీదారుల నుంచి భారీగా కొనుగోళ్లు పెరగడంతో పసిడి ధర పుంజుకున్నట్లు బులియన్ ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. బంగారం బాటలోనే వెండి పయనించింది. కిలో వెండి ధర రూ.570 పెరగడంతో రూ.40,070గా ఉంది. దీంతో రూ.40వేల మార్కును చేరుకుంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ రావడంతో వెండి ధర పెరిగినట్లు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయంగా 0.09శాతం పెరగడంతో ఔన్సు బంగారం ధర 1,278 డాలర్లకు చేరుకుంది.





స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	31531.33	-266.51	0.84%
నిఫ్టీ	9820.25	-87.80	0.89%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27560	29475.94	1.06%
ముంబై	28360	30331.55	1.47%
ఢిల్లీ	27850	29786.10	1.46%
కోల్‌కతా	27860	29796.79	0.18%
కేరళ	26950	28823.53	0.94%
బెంగళూరు	26920	28791.44	0.22%
హైదరాబాద్	27530	29443.85	0%
గల్ఫ్	1355.98	1450.25	0.71%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	గురువారం	బుధవారం	మార్పు (%)
చెన్నై	41100.00	40000.00	2.75
ముంబై	41100.00	40000.00	2.75
ఢిల్లీ	41100.00	40000.00	2.75
కోల్‌కత్తా	41100.00	40000.00	2.75
హైదరాబాద్	41100.00	40000.00	2.75



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	321	విశాఖపట్నం	330
వరంగల్	320	చిత్తూరు	365
విజయవాడ	323	చెన్నై	372
గోదావరి	323	బెంగళూరు	360



సహారాకు ఎదురుదెబ్బ

- ఆంబీ వ్యాలీపై పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఆంబీ వ్యాలీ వేలాన్ని ఆపాలంటూ పిటిషన్ దాఖలు చేసిన సహారా గ్రూప్‌నకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వేలాన్ని నిలుపుదల చేసేందుకు కోర్టు తిరస్కరించింది. మహారాష్ట్రలోని పుణె జిల్లాలో ఉన్న సహారా సంస్థకు చెందిన ఆంబీ వ్యాలీని వేలం వేయాలంటూ ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు చేసిన విషయం తెలిసిందే. ఇన్వెస్టర్ల నుంచి నిధులు సేకరించి తిరిగి చెల్లించడంలో విఫలమైన కేసులో మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ వద్ద సహారా సంస్థ రూ.1500 కోట్లు డిపాజిట్ చేయాల్సి ఉంది. గడువులోగా డిపాజిట్ చేయకపోవడంతో కోర్టు ఆంబీ వ్యాలీ వేలం ప్రక్రియ ప్రారంభించాలని ఇటీవల ఆదేశించింది. దీనిని ఆపాలంటూ బుధవారంనాడు సహారా సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సెబీకి నిధులను అందించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడినందువల్ల ఆంబీ వ్యాలీ వేలం ఆపాలని సహారా సంస్థ కోర్టును కోరింది. అయితే గురువారం ఈ పిటిషన్‌ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం సహారా అభ్యర్థనను తోసిపుచ్చింది. 8900 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఆంబీ వ్యాలీ ఆస్తి విలువ రూ.34వేల కోట్లు ఉంటుందని అంచనా. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తొలుత ఆంబీ వ్యాలీ ప్రాజెక్టును అమ్మాలని కోర్టు ఆదేశించింది. గతనెల జూలై 25న జరిగిన విచారణలో వేలం ప్రక్రియను సహారా తరఫు న్యాయవాది తీవ్రంగా వ్యతిరేకించారు. బ్యాలెన్స్ రూ.9000 కోట్లను చెల్లించడానికి 18 నెలల సమయం కోరారు. ఇన్వెస్టర్లకు రూ.24వేల కోట్లు చెల్లించడంలో సహారా గ్రూప్‌కు చెందిన సంస్థలు విఫలమైన కేసులో 2014 మార్చిలో సహారా గ్రూప్ అధినేత సుబ్రతారాయ్ అరెస్టు అయ్యారు. గతేడాది మే నెలలో రాయ్ తల్లి మరణించడంతో ఆయన పెరోల్‌పై బయటికి వచ్చారు. అనంతరం పెరోల్ గడువును ఇప్పటివరకు పొడిగిస్తూ వస్తున్నారు.

టివిఎస్ మోటార్స్ నుంచి జుపిటర్ క్లాస్

ముంబయి : ద్విచక్ర వాహనరంగ సంస్థ టివిఎస్ మోటార్ కంపెనీ మార్కెట్లోకి కొత్త మోడల్ జుపిటర్ క్లాసిక్ బైక్‌ను విడుదల చేసింది. క్లాసిక్ ఎడిషన్ ధర రూ.55,266(ఢిల్లీ ఎక్స్ షోరూమ్)గా కంపెనీ నిర్ణయించింది. ఇది దేశవ్యాప్తంగా టివిఎస్ డీలర్‌షిప్‌లలో లభ్యంకానుంది. అల్యూమినియంతోనే తయారైన 110 సిసి ఇంజన్ దీనికి అమర్చారు. విండ్ షీల్డ్ యుఎస్‌బి చార్జర్, బ్యాక్ రెస్ట్, డిస్క్ బ్రేక్ వంటి కొత్త ఫీచర్లు ఇందులో ఉన్నాయి. 2013లో టీవీఎస్ మోటార్ కంపెనీ జూపిటర్‌ను విడుదల చేసినప్పటి నుంచి 15 లక్షల స్కూటర్లు విక్రయించింది. కాలంతో పాటుగా ఈ స్కూటర్‌లో మార్పులు చేస్తూ వస్తున్నామని, ఎప్పటికప్పుడు ఇది సమకాలీనంగా కనిపిస్తుందని టీవీఎస్ మోటార్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) అనిరుద్ధ హల్దార్ ఈ సందర్భంగా అన్నారు.

అమెజాన్‌లో బిపిఎల్ మైక్రోవేవ్‌లు

న్యూఢిల్లీ: దిగ్గజ సంస్థ బిపిఎల్ సంస్థ సోలో, కన్వర్షన్ వేరియంట్లలో 20, 30 లీటర్ల మైక్రోవేవ్‌ను లాంచ్ చేసింది. ఈ ఉత్పత్తి అమెజాన్.ఇన్ పోర్టల్‌లో ఎక్స్‌క్లజివ్‌గా లభ్యం కానుంది. అదే విధంగా ఆగస్టు 27 నుంచి 30వ తేదీ మధ్య అమెజాన్ హోమ్ ఎలక్ట్రానిక్స్ సేల్ లోనూ ఈ ప్రోడక్ట్ అందుబాటులో ఉంటుందని కంపెనీ వెల్లడించింది.

కల్ట్ సరికొత్త స్మార్ట్‌ఫోన్ 'బియాండ్'

ముంబయి: కొత్త టెలికామ్ బ్రాండ్ కల్ట్ సరికొత్త స్మార్ట్‌ఫోన్ 'బియాండ్'ను మార్కెట్లోకి విడుదల చేసింది. 4జి విఒఎల్‌టిఇ కల్గిన ఈ స్మార్ట్‌ఫోన్ డిజైనింగ్ ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. దీని ధర రూ.6,999గా కంపెనీ ప్రకటించింది. ఈ ఫోన్ ఆగస్టు 18 నుంచి అమెజాన్ వెబ్‌సైట్‌లో ఎక్స్‌క్లజివ్‌గా అందుబాటులో ఉండనుంది.ఈ ఫోన్‌లో ఫీచర్ల విషయానికొస్తే డిస్‌ప్లే 5.2 హెచ్‌డి, ర్యామ్ అండ్ రామ్ 3 జిబి+ 32 జిబి, బ్యాటరీ సామర్థ్యం 3000 ఎంఎహెచ్ సామర్థ్యం కల్గి ఉంటుంది.



విచారణ జరపకుండానే చర్యలా..

- డొల్ల కంపెనీలుగా సెబీ ముద్రపై ప్రశ్నించిన శాట్

న్యూఢిల్లీ: డొల్ల కంపెనీలు(షెల్) కంపెనీలు అని ముద్రవేసిన మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీని శాట్(సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్) ప్రశ్నించింది. ఎలాంటి విచారణ జరపకుండా షెల్ కంపెనీలుగా ముద్రవేసి చర్యలు తీసుకోవడాన్ని వ్యతిరేకించింది. అనుమానిత షెల్ కంపెనీలంటూ సెబీ ముద్ర వేయడమే కాకుండా ట్రేడింగ్‌కు సంబంధించి ఆంక్షలు విధించడాన్ని సవాలు చేస్తూ జె కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టబూస్, ప్రకాష్ ఇండస్ట్రీస్, పార్శ్వనాథ్ డెవలపర్స్ వంటి కంపెనీలు శాట్‌ను ఆశ్రయించాయి. చట్టబద్ధంగా వ్యాపారం చేస్తున్నామని, తమవి షెల్ కంపెనీలు కావని, సెబీ ట్రేడింగ్ ఆంక్షలపై స్టే విధించాలని కోరాయి. దీనికి శాట్ స్పందిస్తూ.. ఆదేశాలు జారీ చేసే ముందు ఆయా కంపెనీలను ఎందుకు విచారణ నిర్వహించలేదని సెబీని ప్రశ్నించింది. సెబీ మాత్రం తన చర్యను సమర్థించుకుంది. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ నుంచి అందిన జాబితా ఆధారంగా 331 అనుమానిత షెల్ కంపెనీలపై చర్యలకు ఆదేశించినట్టు సెబీ శాట్‌కు తెలిపింది. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లను కోరినట్టు వెల్లడించింది. అయితే, కార్పొరేట్ వ్యవహారాల శాఖ నుంచి జాబితా జూన్ 9నే సెబీకి అందగా, ఆగస్ట్ 7న ఆదేశాలు జారీ చేసినట్టు తెలియడంతో ఈ మధ్య కాలంలో విచారణ నిర్వహించి ఉండొచ్చు కదా అని శాట్ ప్రశ్నించింది. ఈ పిటిషన్లపై విచారణ గురువారానికి వాయిదా పడింది. సెబీ ట్రేడింగ్ ఆంక్షలకు ఆదేశించిన 331 కంపెనీల్లో వాస్తవానికి ట్రేడవుతున్నవి సగం మేరే ఉన్నాయి.

షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ కొనుగోలుకు ఆధార్?

న్యూఢిల్లీ: ఇప్పుడు ప్రతి దానికి ఆధార్‌ను అనుసంధానం చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం కూడా ఇదే విధంగా చర్యలు చేపడుతోంది. తాజాగా మ్యూచువల్ ఫండ్స్‌ను కొనుగోలు చేయాలన్నా ఆధార్ నంబర్ తప్పనిసరి చేసే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే సంక్షేమ పథకాలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ ఖాతాలు, పాన్ కార్డులు వంటి వాటికి ఆధార్ కార్డును ప్రభుత్వం తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఇక ఈ ఆధార్ స్టాక్‌మార్కెట్లోకి ప్రవేశించనుందని, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ కొనుగోలు చేయాలన్నా కూడా ఆధార్‌ను తప్పనిసరి చేయనుందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఆర్థిక మార్కెట్ లావాదేవీలకు కూడా ఆధార్‌ను అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం, సెబీ ప్రణాళికలు



రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టి నల్లధనాన్ని వైట్‌మనీగా మార్చే ప్రయత్నాలను అడ్డుకునేందుకు ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. మార్కెట్లకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని ఇటీవల సెబీ అనధికారింగా చర్చించినట్లు ఓ అధికారి తెలిపారు.

పశ్చిమ బెంగాల్‌లో పెరిగిన మొండి బకాయిలు



న్యూఢిల్లీ : పశ్చిమబెంగాల్‌లో ఎంఎస్‌ఎంఇ(సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) రంగంలో ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) పెరిగాయంటూ దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ ఆందోళన వ్యక్తం చేసింది. వీటి కోసం బ్యాంక్ కొత్త అంచనా వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్టు పేర్కొంది. బెంగాల్‌లో పేరుకుపోయిన మొండి బకాయిల సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్‌బిఐ సిజిఎం(బెంగాల్ సర్కిల్) పార్థో ప్రతిమ్ సేన్‌గుప్తా తెలిపారు. ఇక్కడ ఎంఎస్‌ఎంఇపై ఐసిసి నిర్వహించిన సదస్సులో సేన్‌గుప్తా మాట్లాడుతూ, రాష్ట్రంలో స్టీలు ఆధారిత కంపెనీల్లో ఎన్‌పిఎలు పెరిగాయని అన్నారు. దేశవ్యాప్తంగా ఎంఎస్‌ఎంఇ కోసం కొత్త అంచనా వ్యవస్థను ఆగస్టు 5వ తేదీన ఎస్‌బిఐ ప్రవేశపెట్టిందని తెలిపారు. కొత్త వ్యవస్థ కింద ఎంఎస్‌ఎంఇలకు రూ.50 లక్షలు, అంతకు మించి రుణాల అవసరం ఉంటే బ్యాలెన్స్ షీట్‌తో పాటు ద్రవ్యలభ్యతను ఆధారంగా నిర్ణయం తీసుకుంటారు. కొన్ని ప్రశ్నలు, బ్యాంక్ స్టేట్‌మెంట్ ఆధారంగా సులభతర ఆర్థిక విధానం తీసుకొచ్చామని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

ప్రభుత్వానికి మిగులు నిధులు రూ. 30,600 కోట్లు



బదిలీ చేయాలని ఆర్‌బిఐ నిర్ణయం

న్యూఢిల్లీ: ప్రభుత్వానికి మిగులు నిధులను బదిలీ చేసేందుకు ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) ఆమోదం తెలిపింది. ఈమేరకు గురువారం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. 2017 జూన్ 30 నాటికి దాదాపు రూ.30,600 కోట్లకు పైగా మిగులు నిధులు ఉన్నాయి. డీమానిటైజేషన్ అనంతరం కొత్త కరెన్సీ నోట్ల ఖర్చు పెరగడంతో ఈసారి మిగులు నిధుల బదిలీ మొత్తం తగ్గిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. జూన్ ముగింపు నాటికి రూ. 30,659 కోట్ల నిధులను డివిడెండ్‌గా ప్రభుత్వానికి బదిలీ చేయనున్నారు. గత సంవత్సరంలో ఆర్‌బిఐ ప్రభుత్వానికి దాదాపు రూ. 65,876 కోట్ల మిగులు నిధులను బదిలీ చేసింది. అయితే ఈసారి డివిడెండ్‌గా బదిలీ చేసేంది దీనిలో సగానికి తగ్గడం విశేషం. 2017–18 సంవత్సరంలో ఆర్‌బిఐ నుంచి డివిడెండ్‌గా రూ.58 వేల కోట్లు బదిలీ చేయవచ్చని అంచనా వేశారు. ఇతర ఖర్చులు పెరగడం వల్ల అంచనాలను మారాయని అధికార వర్గాలు వెల్లడించాయి. గత ఐదేళ్లుగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రతికూల వడ్డీ రేట్ల కారణంగా రాబడులు దిగివస్తున్నాయని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ ఆర్.గాంధీ వివరించారు.

రెండేళ్లలో రూ.26 లక్షల కోట్లకు చేరనున్న కేంద్రం వ్యయం

మరో రెండేళ్లలో(2019–20 సంవత్సరం నాటికి) కేంద్ర ప్రభుత్వం మొత్తం వ్యయం రూ.26 లక్షల కోట్లకు చేరవచ్చని ఆర్థిక మంత్రిత్వశాఖ వెల్లడించింది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి రూ.21.46 లక్షల కోట్లు కేంద్రం వ్యయం ఉంటుందని అంచనా వేశారు. అయితే రెండేళ్లలో ప్రభుత్వ ఖర్చులు రూ.3.9 లక్షల కోట్లు అంటే 25 శాతం పెరిగే అవకాశముందని పేర్కొంది. ఒక్క రక్షణ వ్యయమే 22 శాతం పెరగనుందని పార్లమెంట్‌లో ఎంటిఇఎఫ్(మధ్యకాలిక వ్యయ ముసాయిదా నివేదిక) పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. 2017–18లో ప్రభుత్వం మొత్తం ఖర్చు రూ.21.46 లక్షల కోట్లు నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.23.4 లక్షల కోట్లకు చేరనుంది. 2019–20 సంవత్సరంలో ఇదిరూ.25.95 లక్షల కోట్లకు పెరగనుందని నివేదిక అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయం అంచనా రూ.3.09 లక్షల కోట్లకు చేరనుంది.

పోలీస్ రిమాండ్‌కు వికాస్ బరాల



చండీగఢ్: 29 ఏళ్ల మహిళను వేధించారు, అపహరించేందుకు యత్నించింరారు అనే ఆరోపణల కింద అరెస్టయిన హర్యానా బిజెపి చీఫ్ సుభాష్ బరాల కుమారుడు వికాస్ బరాలను, అతడి స్నేహితుడు ఆశిష్ కుమార్‌ను కోర్టు రెండు రోజులపాటు పోలీస్ కస్టడీకి పంపింది. క్రైమ్ సీన్‌ను పునర్నించేందుకు వారిని రెండు రోజులపాటు కస్టడీకి ఇవ్వాల్సిందిగా పోలీసులు కోర్టును కోరారు. వారిద్దరిని ఆగస్టు 12 వరకు పోలీస్ కస్టడీకి సివిల్ జడ్జి బర్జిందర్ పాల్ సింగ్ రిమాండ్ చేశారు. డిఫెన్స్ న్యాయవాది వారిద్దరి నుంచి ఎలాంటివి రికవరీ చేయకపోయినప్పటికీ కేసును మీడియా విచారణలా కొనసాగిస్తున్నారని, ఒత్తిడుల కారణంగానే కిడ్నాపింగ్ కేసును బనాయించారని వాదించారు. నిందితులిద్దరిని మధ్యాహ్నం 2.20 గంటలకు కట్టుదిట్టమైన భద్రతతో జిల్లా కోర్టులో హాజరుపరిచారు. వికాస్ బరాల తన ముఖాన్ని కర్చీఫ్‌తో కప్పుకున్నాడు. నిందితులిద్దరిని ఐపిసి సెక్షన్ 365, 511 కింద బుధవారం రెండోసారి అరెస్టు చేశారు. ఇంతకు ముందు శనివారం కూడా వారిని అరెస్టు చేశారు. వారిపై బెయిల్ దొరకని నేరాభియోగాలు మోపారు.

బ్యాంకుల్లో పెనాల్టీలతో పెను భారం



న్యూఢిల్లీ: ఎస్‌బిఐ, సంబంధిత బ్యాంకులలో సర్వీసు ఛార్జీల పెంపుదల, పొదుపు ఖాతాలపై వడ్డీల తగ్గింపు పట్ల లోక్‌సభలో ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రజల పొదుపు ఖాతాలపై ప్రభావం పడు తుందని, ఇది పేదల వ్యతిరేక చర్య అని గురువారం ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. స్టేట్‌బ్యాంక్స్ (ఉపసంహరణ మరియు సవరణల)బిల్లుపై కాంగ్రెస్ సభ్యులు ముద్దనుమే గౌడ చర్చను ప్రారంభించారు. ఎస్‌బిఐ తీసుకున్న నిర్ణయంతో 34 కోట్ల మంది ఖాతాదారులపై భారం పడుతోందని ప్రతిపక్షాలు తెలిపాయి. ఈ బిల్లు మేరకు ఎస్‌బిఐ అనుబంధమైన ఐదు బ్యాంకుల ఉనికిని రద్దు చేసి వాటిని ప్రధాన బ్యాంక్‌లో అనుసంధానం చేయడానికి మార్గం ఏర్పడుతుంది. ఇక బ్యాంక్‌లలో కనీస మొత్తం పరిమితిని పెంచాలనే నిబంధన సరికాదని, దీనితో రైతులు, సరైన ఆదాయ వనరులు లేని వారు కష్టాల పాలు అవుతారని కాంగ్రెస్ సభ్యులు తెలిపారు. అంతేకాకుండా బ్యాంకులలో లావాదేవీలపై సేవా రుసుం పెంచడం కూడా ప్రతికూల చర్యగా మారిందని, లక్షలాది పొదుపుఖాతాదార్లకు ఇది ఇబ్బందిగా మారుతుందని తెలిపారు.

ఇద్దరు అల్‌ఖైదా ఉగ్రవాదులు అరెస్టు



న్యూఢిల్లీ: అల్‌ఖైదా ఉగ్రవాదులతో సంబంధం ఉందనే అనుమానంతో వేర్వేరు కేసుల్లో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. సౌదీ అరేబియా నుంచి భారత్‌కు వచ్చిన సయీద్ మొహమ్మద్ జీషణ్ అలీ అనే వ్యక్తిని అల్‌ఖైదా ఉగ్రవాదిగా అనుమానించిన ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ గురువారం అదుపులోకి తీసుకుంది. అల్‌ఖైదా కార్యకలాపాలు సాగిస్తున్న ముగ్గురిని 2015 లో అరెస్టు చేయగా, అప్పటినుంచి జీషణ్ అలీ కోసం ఏడాదిగా గాలిస్తున్నామని స్పెషల్ సెల్ సీనియర్ పోలీసు అధికారులు వెల్లడించారు.

జీషణ్ అలీకి 14 రోజుల పోలీసుల కస్టడీ

అనుమానిత ఆల్‌ఖైదీ ఉగ్రవాది జీషణ్ అలీని గురువారం 14 రోజుల పాటు పోలీసుల కస్టడీకి తరలించారు. ఉగ్రవాద సంస్థల్లో చేరేందుకు భారతీయ యువకులను ప్రేరేపించేలా ప్రసంగాలు చేస్తున్నాడనే ఆరోపణల నేపథ్యంలో అలీని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. అదనపు సెషన్స్ జడ్జీ సిద్ధార్థ్ సింగ్, అలీకి రిమాండ్ విధించారు.

మూతపడ్డ 682 వస్త్ర మిల్లులు

న్యూఢిల్లీ: ఈ ఏడాది జూన్ ఆఖరున దాదాపు 682 వస్త్ర పరిశ్రమలు మూతపడ్డాయి. జూన్ 30 నాటికి 1399 మిల్లులు పనిచేస్తున్నాయి అని జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీ గురువారం లోక్‌సభకు తెలిపారు. దేశంలో మూతపడిన 682 మిల్లుల్లో 232 మిల్లులు తమిళనాడులో, 82 మహారాష్ట్రలో, 60 ఉత్తర్‌ప్రదేశ్‌లో, 42 హర్యానాలో ఉన్నాయని చెప్పారు. పనిచేస్తున్న 1399 మిల్లుల్లో 752 తమిళనాడులో, 135 మహారాష్ట్రలో, 112 ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని స్మృతి ఇరానీ ప్రశ్నోత్తరాల సమయంలో తెలిపారు.

నీటి నిల్వ సామర్థ్యానికి చర్యలు



న్యూఢిల్లీ: దేశమంతటా వానలు ఒకేలా పడలేదు. ఈ నేపథ్యంలో అదనపు నీటి నిల్వ సామర్థ్యాన్ని సృష్టించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు లోక్‌సభలో జల వనరులు, నదుల అభివృద్ధి శాఖ మంత్రి ఉమా భారతి గురువారం లోక్‌సభకు తెలిపారు. దేశంలో కొన్ని చోట్ల సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ మరి కొన్ని చోట్ల ఎక్కువగాను, తక్కువగాను పడ్డాయని ఆమె అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె ఈ విషయం చెప్పారు. 91 రిజర్వాయర్లలో నీటి నిల్వలను వారం ప్రాతిపదికన కేంద్ర నీటి సంఘం(సిడబ్ల్యుసి) పర్యవేక్షిస్తుందని ఆమె లిఖిత పూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

సినిమాలు, క్రీడల్లో మహిళలకు సమానత్వం

న్యూఢిల్లీ: దేశంలో మహిళలపట్ల వివక్ష ఎక్కువగా ఉందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపి శతాబ్ది రాయ్ గురువారం లోక్‌భలో ఆరోపించారు. సినిమాలు,క్రీడలు సహా అన్ని రంగాలలో మహిళలను సమానంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడాకారుల రాణింపు విషయంపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆమె ఈ విషయాన్ని చెప్పారు. స్వతహాగా బెంగాలీ నటి అయిన ఆమె సినిమాల్లో,క్రీడల్లో మహిళలకు పురుషులకు దక్కుతున్నంత గుర్తింపు లభించడంలేదన్నారు. క్రీడా శాఖ మంత్రి విజయ్ గోయెల్‌కు బదులుగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ ఆమె చెప్పిందాన్ని పూర్తిగా ఆమోదిస్తున్నామన్నారు

హిందీ భాషను సవరించిన స్పీకర్



న్యూఢిల్లీ: వరదల్లో ప్రజలు 'హత్యచేయబడలేదు', 'చనిపోయారు' అం టూ లోక్‌సభ స్పీకర్ కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గగోయ్ హిందీలో తప్పుగా ఉపయోగించిన పదాన్ని సవరించారు. ప్రకృతి విపత్తుపై లోక్‌సభలో చర్చ జరుగుతుండగా కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గగోయ్ మాట్లాడుతూ 'వరదల్లో 750 మంది ప్రజలు హత్యకుగురయ్యారు(హత్యా హుయి)'అని హిందీ లో తప్పుగా చెప్పారు. దానికి ఆమె వెంటనే ప్రతిస్పందిస్తూ 'హత్యా హుయి'కి బదులు మృతి చెందారు(మృత్యుహుయి)' అనాలన్నారు. అసోం రాష్ట్రానికి చెందిన ఆ ఎంపి వెంటనే తన హిందీ భాష పద దోషాన్ని సవరించినందుకు స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

ఆస్తుల రిటర్నులు దాఖలు చేయని ఐఎఎస్ అధికారులు 379

న్యూఢిల్లీ: దాదాపు 379 మంది ఐఎఎస్ అధికారులు 2016లో స్థిర ఆస్తుల వివరాలు దాఖలు చేయలేదని ప్రభుత్వం గురువారం పార్లమెంటుకు తెలిపింది. 2017 సివిల్ జాబితా ప్రకారం 5004 మంది అధికారులు ఉండగా వారిలో 379 మంది ఐఎఎస్ అధికారులు స్థిరాస్తుల రిటర్నులు దాఖలు చేయలేదని సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ లిఖితపూర్వక సమాధానంలో రాజ్యసభకు తెలిపారు. వారిలో ఇప్పుడు 38 మంది అధికారులు పదవీ విరమణ చేశారని, ఇద్దరు చనిపోయారని వివరించారు. నియమాల ప్రకారం స్థిర ఆస్తుల రిటర్నులు సకాలంలో దాఖలు చేయని అధికారులకు విజిలెన్స్ క్లియరెన్స్‌ను నిరాకరిస్తారు.

యుజిసి, ఎఐసిటిఇ విలీన యోచన లేదు

న్యూఢిల్లీ: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి)ని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఎఐసిటిఇ)తో విలీనం చేసి సింగిల్ హైయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటర్‌గా మార్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించడం లేదని గురువారం రాజ్యసభకు తెలిపింది.

విమర్శలతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

• వీడ్కోలు ప్రసంగంలో ఉప రాష్ట్రపతి అన్సారీ • మైనార్టీల అభద్రతపై ఆందోళన



న్యూఢిల్లీ: విమర్శలు లేకపోతే ప్రజాస్వామ్యం కాస్తా నియంతృత్వంగా మారుతుందని ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ చెప్పారు. ప్రభుత్వ విధానాలపై స్వేచ్ఛాయుత, నిర్మోహమాట విమర్శలు ఉండాల్సిందేనని, ప్రజాస్వామ్య ప్రక్రియకు ఇవే మూలమని స్పష్టం చేశారు. దేశ ఉపరాష్ట్రపతిగా, ఎగువ సభ ఛైర్మన్‌గా దశాబ్దకాలం ఉండి పదవి నుంచి వైదొలుగుతున్న చివరి రోజున గురువారం ఆయన రాజ్యసభలో తుది ప్రసంగం చేశారు. మాట్లాడారు. ఎగువ సభగా రాజ్యసభపై గురుతర బాధ్యత ఉందని, దేశ బహుళ సంవిధానాన్ని ప్రతిబింబించే రాజ్యాంగపు సృష్టి అని కితాబు ఇచ్చారు. ప్రభుత్వ విధానాలను ప్రతిపక్షాలు సహేతుకంగా, నిర్మొహమాటంగా విమర్శించేందుకు ప్రతిపక్షాలకు వీలుండాలని, ఇందుకు అన్ని విధాలుగా అవకాశం కల్పించాల్సి ఉంటుందని, లేకపోతే ప్రజాస్వామ్యం కాస్తా నిరంకుశత్వంగా మారుతుందని సర్వేపల్లి రాధాకృష్ణన్ గతంలో చేసిన వ్యాఖ్యలను ఆయన ఉటంకించారు. పార్లమెంట్ సజావుగా సాగడంలో అన్ని పక్షాలూ సహకరించాల్సి ఉందని, విమర్శల స్థాయి సభా సంప్రదాయాన్ని కించపరుస్తూ, సభను అడ్డుకునే స్థితికి చేర్చరాదని స్పష్టం చేశారు. మైనార్టీల పరిరక్షణ ప్రజాస్వామిక ప్రక్రియకు ప్రత్యేకతను సంతరించిపెట్టిందని, అయితే ఇదే సమయంలో దేశం పట్ల ప్రజాస్వామ్యం పట్ల మైనార్టీలకు కూడా తగు బాధ్యత ఉందని తెలిపారు. ఏ చట్టం అయినా చర్చలు తద్వారా దక్కే ఏకాభిప్రాయంతో రూపొందాల్సి ఉంటుంది. హడావిడిగా చట్టాలు తీసుకువచ్చే ప్రక్రియను సభ్యులు అడ్డుకోవల్సిందేనని అన్సారీ తెలిపారు.

అన్సారీపై బిజెపి మండిపాటు

మైనార్టీలలో అభద్రతా భావం ఉందని ఉప రాష్ట్రపతిగా వైదొలుగుతున్న అన్సారీ చేసిన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయని బిజెపి విమర్శించింది. ఓ టీవీ ఛానల్‌కు అన్సారీ ఇచ్చిన ఇంటర్వ్యూలో మైనార్టీలు ఆందోళన చెం దుతున్నారని పేర్కొనడంపై బిజెపి స్పందించింది. రిటైర్మెం ట్ తరువాత కూడా ఏదో రాజకీయ పునవారాసొన్ని ఆశిం చే ఆయన ఇలాంటి తప్పుడు వ్యాఖ్యలకు దిగారని బిజెపి ప్రతినిధి కైలాష్ విజయ్‌వార్గియా స్పందించారు. ఆయన వ్యాఖ్యలను బిజెపి ఖండిస్తోందన్నారు. ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి మాటలు మాట్లాడటం సరికాదన్నారు.

అన్సారీపై ప్రముఖుల ప్రశంసలు

రాజ్యసభ హుందాగా సాగడంలో అన్సారీ కీలక పాత్ర వ హించారని, దౌత్యవేత్తగా ఆయనకు ఉన్న గత అనుభవం ఇందుకు దోహదం చేసిందని తాను భావిస్తున్నట్లు ప్రధా ని మోడీ తెలిపారు. అన్సారీకి సంపూర్ణ ఆరోగ్య ఆయుష్షులు కలుగాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. సభలో అధికార పక్ష నేత, మంత్రి జైట్లీ మాట్లాడుతూ అన్సారీ హయాంలో అత్యున్నత ప్రమాణాల చర్చలు జరిగాయని, అదే సమయంలో సభ కు ఆటంకాలు కూడా ఏర్పడ్డాయని తెలిపారు. పదవీ నుంచి వైదొలుగుతున్న ఆయనకు వీడ్కోలు చెపుతున్నామని అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ అన్సారీ నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని తెలిపారు. ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ స్పందిస్తూ సభను సజావుగా నడిపించిన ఘనత అన్సారీకి దక్కుతుందని తెలిపారు. ఆయనతో తనకు చిరకాల సాన్నిహిత్యం ఉందని గుర్తుచేశారు. టిఎంసి నేత డెరెక్ ఓ బ్రెయిన్ మాట్లాడుతూ అన్సారీ ఆరోగ్య పరిరక్షణ అలవాట్లు ఉత్తమమమైనవని, యోగా చేస్తారు, వాకింగ్‌కు వెళ్లుతారు. గత 40 ఏళ్లుగా మధ్యాహ్న భోజనంగా కేవలం సాండ్‌విచ్ తీసుకుంటూ వచ్చారని, ఇది బహుశా ప్రపంచరికార్డు కావచ్చు అన్నారు. రాజ్యసభ టీవీ ఛానల్ ఏర్పాటులో అన్సారీ పాత్ర అభిందనీయం అని సిపిఎం నేత సీతారాం ఏచూరి తెలిపారు.

ఎన్‌ఐఎకు మత మార్పిడి వివాహం కేసు



న్యూఢిల్లీ: బలవంతపు మత మార్పిడి ద్వారా హిందూ మహిళను ముస్లిం యువకుడు వివాహం చేసుకున్న కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ)కు అప్పగించాల్సిందిగా సుప్రీంకోర్టు గురువారం కేరళ పోలీసులను ఆదేశించింది. ఇది ఇక ప్రత్యేక కేసా లేదా జాతీయ భద్రతకు విఘాతం కలిగించే తీవ్రవాద ధోరణితో కూడిన కేసా అన్నది ఎన్‌ఐఎ తేల్చాలని ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఎన్‌ఐఎ వేసిన అత్యవసర పిటిషన్‌పై సుప్రీంకోర్టులో గురువారం వాదనలు జరిగాయి. ఈ కేసు రికార్డులను ఎన్‌ఐఎకు అప్పగించాల్సిందిగా కేరళ పోలీసులను ఆదేశించాలని అదనపు సొలిసిటర్ జనరల్ మణీందర్ సింగ్ కోరారు. ఎన్‌ఐఎ గురించి మీరు ఎందుకు అనుమానపడుతున్నారు? అది ఒక ప్రత్యేకమైన దర్యాప్తు సంస్థ, మేం వారిని దర్యాప్తు చేయాలని కోరడం లేదు, వారికి కేసు రికార్డులు అందజేస్తే వాటిని పరిశీలించి, తుది నివేదికను ఇవ్వాల్సిందిగా మాత్రమే కోరుతున్నామని జహాన్ తరపు న్యాయవాది హరీష్ బీరంను ఉద్దేశించి ఖేహర్ వ్యాఖ్యానించారు. ఎన్‌ఐఎ వద్ద ఇప్పటికే ఈ కేసు విచారణ వివరాలు ఉంటే, వాటిని వింటామని ఆయన వివరించారు. కేరళకు చెందిన 24 ఏళ్ల హిందూ యువతిని మతమార్పిడి అనంతరం ముస్లిం యువకుడు షఫీన్ జహా న్ వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత తన భార్యను తన వద్దకు రాకుండా ఆమె తండ్రి అడ్డుకుంటున్నారని, ఆమెను కోర్టులో హాజరు పర్చాలని కోరుతూ జహాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే.

త్రిపురలో సిపిఐ(ఎం) కార్యాలయానికి నిప్పు

నలుగురు పార్టీ కార్యకర్తలకు గాయాలు

అగర్తలా: త్రిపురలోని సిపిఐ(ఎం) కార్యాలయంపై దాడి చేసి నిప్పు పెట్టారు. ఈ ఘటనలో నలుగురు పార్టీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. ఇండిజీనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి) కార్యకర్తలు బుధవారం ఖుముల్వంగ్ ప్రాంతంలోని బైకులకు నిప్పు అంటించడంతో అక్కడి సిపిఐ (ఎం) కార్యాలయానికి మంటలు అంటుకున్నాయని, ఈ ఘటనలో ఆ పార్టీ కార్యకర్తలకు కూడా గాయాలయ్యాయని గురువారం పోలీసులు వెల్లడించారు. ఘటనా స్థలిలో కాలిన నాలుగు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఐపిఎఫ్‌టి కార్యకర్తలు నిప్పంటించడంతో ఏడుగురు పార్టీ కార్యకర్తలు గాయపడ్డారని, 25 నుంచి 27 వరకు బైకులు మంటల్లో దగ్ధమయ్యాయని సిపిఐ(ఎం) రాష్ట్ర పార్టీ కార్యదర్శి బిజన్ ధార్ ఆరోపించారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమైన సమయంలో ఐపిఎఫ్‌టి కార్యకర్తలు పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడ్డారని ఆయన మండిపడ్డారు. ఐపిఎఫ్‌టి ప్రతిపక్ష పార్టీ బిజెపితో లీగ్‌గా ఏర్పడి రాష్ట్రంలో శాంతి వాతావరణాన్ని నాశనం చేయాలని యత్నిస్తోందని ధార్ విమర్శించారు.

పళని – పన్నీరు విలీనానికి రంగం సిద్ధం



శశికళ–దినకరన్‌పై అధికార పార్టీ వేటు?

చెన్నై: తమిళనాడులో అధికార ఎఐఎడిఎంకె (అమ్మ) లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. పన్నీరు సెల్వం–పళనిస్వామి వర్గాలు విలీనానికి మార్గం సుగమం అవుతోంది. ఇక గురువారం ముఖ్యమంత్రి పళనిస్వామి శశికళకు షాక్ ఇచ్చారు. గురువారం పార్టీ సీనియర్ల కీలక సమావేశం జరిగింది. పార్టీలో శశికళ, ఆమె మేనల్లుడు దినకరన్ ఆధిపత్యం చెల్లదని స్పష్టం చేశారు. అసలు దినకరన్‌కు పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి పదవిని ఏ అధికారంతో శశికళ కట్టబెడుతారని ప్రశ్నించారు. ఆయన నియామకం పార్టీ నిబంధనలకు విరుద్ధం అని దుయ్యబట్టారు. పళని చేసిన ప్రకటనను పన్నీరు నాయకత్వంలోని తిరుగుబాటు వర్గం స్వాగతించింది. శశికళకు విధేయుడిగా ఉంటూ వచ్చిన పళనిస్వామి ఆధ్వర్యంలోనే గురువారం పార్టీ కీలక సమావేశం జరిగింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత తొలిసారిగా పార్టీ అంతర్గత అంశాలపై పళనిస్వామి స్పందించారు. ఆగస్టు 15లోగా పళని, పన్నీరు వర్గాల విలీనం జరుగుతుందనే సూచనలను బలోపేతం చేస్తూ ఈ సమావేశంలో పళనిస్వామి శశికళను దినకరన్‌ను ఘాటుగా విమర్శించారు. విలీనానికి ముందస్తు షరతుగా దినకరన్, శశికళలను పార్టీ నుంచి బహిష్కరించాలని పన్నీరుసెల్వం వర్గం స్పష్టం చేస్తూ వస్తోంది. ఈ దిశలో సంకేతాలు ఇస్తూ గురువారం నాటి సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. దినకరన్‌పైనే కేసులు ఉన్నాయని, ఆయన నియామకం గురించి ఎన్నికల సంఘం పరిశీలన జరుపుతోందని, ఈ దశలో దినకరన్ తాజాగా నియామకాలకు దిగడం అనుచితం అని ముఖ్యమంత్రి విమర్శించారు. జయలలిత మరణం తరువాత కేవలం తాత్కాలికంగానే శశికళను పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారని, అయితే తరువాత జరిగిన పరిణామాలలో ఆ పదవి బాధ్యతలను కూడా నిర్వర్తించలేని స్థితిలో ఉన్నారని, ఇక ఆమె నుంచి నిర్ణయాలు వెలువడటం కుదరదని తెలిపారు. ఇది ఇలా ఉండగా పళనిస్వామి వ్యాఖ్యలను దినకరన్ తిప్పికొట్టారు. పార్టీ తమ అదుపులోనే ఉందని స్పష్టం చేశారు. గురువారం నాటి పార్టీ సమావేశానికి పార్టీ ప్రముఖులు కేబినెట్‌లోని సీనియర్ మంత్రులు హాజరు అయ్యారు. దినకరన్‌కు వ్యతిరేకంగా ఇప్పటికైనా అధికార పక్షం స్పందించడం మేలుకొలుపు వంటిదని పన్నీరు సన్నిహితుడు కెపి ముత్తుస్వామి తెలిపారు. జయలలిత మృతిపై దర్యాప్తు జరిపించాలి. శశికళను పార్టీ నుంచి బహిష్కరించాలనే తమ డిమాండ్లలో మార్పు లేదని స్పష్టం చేశారు. ఇది ఇలా ఉండగా ఇరు వర్గాల విలీనం 15లోగానేజరిగిపోవచ్చునని ఆర్థిక మంత్రి డి జయకుమార్ సంకేతాలు వెలువరించారు.

ఉప ముఖ్యమంత్రిగా పన్నీరుసెల్వం?

ఇరు వర్గాల రాజీ మార్గంలో కీలకమైన అంశంగా పన్నీరుసెల్వంను ఉప ముఖ్యమంత్రి చేస్తారని తమిళనాడు రాజకీయాలలో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వాదనను ఆయన వర్గీయులు ఖండించారు. అయితే దినకరన్‌కు, శశికళకు చెక్‌పెట్టేందుకు విలీనమే మార్గం అని భావిస్తున్న పళనిస్వామి ఇక పన్నీరు వర్గానికి కీలక పదవులు కట్టబెడుతారని, ముఖ్యంగా దినకరన్ ప్రాబల్య ఛాయలు పార్టీపై పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటారని విశ్లేషణలు వెలువడ్డాయి.

రాజస్థాన్‌లో పడవ విషాదం

8కి చేరిన మృతుల సంఖ్య



కోటా: రాజస్థాన్‌లోని ఝలావర్ జిల్లాలో జరిగిన పడవ విషాద దుర్ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. గురువారం ఉదయం సహాయక బృందాలు ఏడుగురి మృతదేహాలను వెలికితీసినట్టు అధికారులు వెల్లడించారు. పర్బన్ నదిలో మంగళవారం బరన్ జిల్లా నుంచి ఇక్లేరా టౌన్‌కు 17 మంది ప్రయాణికులతో వెళ్తున్న పడవ మునిగిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో గల్లంతైన వారిలో ఇద్దరు మహిళలతో కలిపి ఏడుగురి మృతదేహాలను వెలికితీసినట్టు ఎఎస్‌పి కుశాల్ సింగ్ రాజ్‌పురోహిత్ పేర్కొన్నారు. పడవ ప్రమాదం జరిగిన రోజే కకోని గ్రామానికి సమీపాన నదితీరంలో ఒక మృతదేహాన్ని వెలికితీసినట్టు ఆయన చెప్పారు. పడవలో ప్రయాణిస్తున్నవారిలో తొమ్మిది మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడగా, మరో ఎనిమిది మంది గల్లంతయ్యారని తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన జాతీయ విపత్తు స్పందన బలగం (ఎన్‌డిఆర్‌ఎఫ్), రెండు రాష్ట్రాల విపత్తు స్పందన బలగం (ఎస్‌డిఆర్‌ఎఫ్) సహా ఎనిమిది పోలీసు బృందాలు సహాయకచర్యలు చేపట్టినట్టు ఎఎస్‌పి చెప్పారు.

స్వయంప్రతిపత్తితోనే గిరిజనుల అభివృద్ధి

గడ్చిరోలి (మహారాష్ట్ర): భారత రాజ్యాంగాన్ని అనుసరించి గిరిజనులకు స్వయంప్రతిపత్తి గిరిజన మండలిలను ఏర్పాటు చేయడం ద్వారా వారికి స్వయంప్రతిపత్తి ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని దళిత నాయకుడు ప్రకాశ్ అంబేద్కర్ అన్నారు. స్వయంప్రతిపత్తి ద్వారానే గిరిజనుల అభివృద్ధి సాధ్యపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. గిరిజనుల ప్రాబల్యం గల ప్రాంతాల్లో స్వయంపత్తి మండలిలను ఏర్పాటు గురించి భారత రాజ్యాంగలో స్పష్టమైన అధికరణలు ఉన్నాయని, వీటిని ఏర్పాటు చేస్తే వారే వాటిని నిర్వహించుకోగలుగుతారని అన్నారు. రాజ్యాంగంలో ఇలాంటి అధికరణలు ఉన్నా ఇప్పటి వరకు అలాంటి ఏర్పాటు జరగలేదని, ఈ నేపథ్యంలో గిరిజనులు ముందకు వచ్చి, కేంద్రంపై వత్తిడి తేవడం ద్వారానే లక్ష్యం నెరవేరుతుందని ఆయన చెప్పారు. స్వదేశీ ప్రజల అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయం, వారసత్వం తదితరాలు సమాజంలో భిన్నమైనవని, గిరిజనులు స్వతహాగా ప్రకృతి, సహజ వనరుల ఆరాధకులని పేర్కొన్నారు. అందువల్ల వాటిని పరిరక్షించే హక్కులు వారి ఉంటుందన్నారు. మైనింగ్ చేసుకునేందుకు అడవులు, మినరల్స్‌ను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం గిరిజనులకు తీవ్ర అన్యాయం చేయడమే అవుతుందంటూ ప్రభుత్వ విధానాలను విమర్శించారు. గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇది కొనసాగాల్సివుందని, వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు.

పెండింగ్‌లో 6400 అవినీతి కేసులు

న్యూఢిల్లీ: రాజకీయవేత్తల ప్రమేయం ఉన్న 6400కు పైగా అవినీతి కేసుల విచారణ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నట్లు ప్రభుత్వం గురువారం తెలిపింది. జూన్ వరకు సిబిఐ 339 అవినీతి ఆరోపణల కేసులను నమోదు చేసింది. అందులో 487 ప్రభుత్వ ఉద్యోగులు, 660 మంది ప్రైవేట్ వ్యక్తులు, 14 మంది రాజకీయవేత్తల ప్రమేయం ఉన్నట్లు సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ రాజ్యసభకు లిఖితపూర్వకంగా పేర్కొన్నారు.

ప్యాకేజ్డ్ ఆహారం ప్రవేశపెట్టే యోచనలేదు!

న్యూఢిల్లీ: పాఠశాలల్లో పెట్టే మధ్యాహ్న భోజనంలో ప్యాకేజ్డ్ ఆహారం ఇచ్చే యోచన ఏదీ లేదని ప్రభుత్వం గురువారం రాజ్యసభకు తెలిపింది. 'ఇప్పుడున్న మధ్యాహ్న భోజన పథకంలో తాజాగా వండి వార్చే ఆహారం స్థానంలో ప్యాక్డ్ ఆహారాన్ని ఇచ్చే యోచన ఏది లేదని' మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఉపేంద్ర కుష్వాహ లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు

57వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

డార్జిలింగ్‌లో జిజెఎం పార్టీ కార్యాలయానికి నిప్పు!

డార్జిలింగ్: పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ హిల్స్ చౌకబజార్ ప్రాంతంలో ఉన్న గూర్ఖాలాండ్ జన ముక్తి మోర్చా (జిజెఎం) పార్టీ కార్యాలయానికి గురువారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. కార్యాలయానికి తాళం వేసి ఉండగా, ఇప్పటివరకూ ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లినట్టు సమాచారం అందలేదు. అయితే ప్రత్యేక గూర్ఖాలాండ్ కోసం జిజెఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 57వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో సమ్మె ఆరంభమైనప్పటి నుంచి డార్జిలింగ్ ప్రాంతంలో జిజెఎం పార్టీ కార్యాలయంపై దాడి జరగడం ఇదే తొలిసారి. జిజెఎం పార్టీ కార్యాలయంపై దాడికి పోలీసులు, జిల్లా అధికారులే కారణమని జిజెఎం నాయకత్వం ఆరోపించింది. దీంతో పోలీసులు జిజెఎం ఆరోపణలను ఖండించారు. గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు మాస్క్‌లు ధరించి పెట్రోల్ బాంబులతో పార్టీ కార్యాలయంపై విసిరారు. దీంతో కార్యాలయమంతా మంటల్లో దగ్ధమైంది. పోలీసు సిబ్బంది మఫ్టీలో మాస్కులు ధరించి తమ పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడ్డారని, ప్రజాస్వామ్య ఉద్యమంలో పిరికితనంతో ఇలాంటి దాడులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జిజెఎం నేత బినయ్ తమంగ్ ఆరోపించారు. మరోవైపు పోలీసుల జిజెఎం నేతల ఆరోపణలు నిరాధారణమైనవిగా కొట్టిపారేశారు. పార్టీ అంతర్గత విబేధాల కారణంగానే ఈ ఘటన చోటు చేసుకుందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. జిజెఎంలో మరో వర్గం నిరవధిక సమ్మె కొనసాగింపునకు వ్యతిరేకిస్తూ ఈ ఘటనకు పాల్పడినట్టు తమకు సమాచారం ఉందని అన్నారు. డార్జిలింగ్‌లో నిలిపివేసిన ఇంటర్‌నెట్ సేవలను పునరుద్ధరించాలని, పోలీసు బలగాలను వెనక్కి పంపాల్సిందిగా జిజెఎం డిమాండ్ చేసింది.



మన తెలంగాణ
11
హైదరాబాద్
శుక్రవారం
11, ఆగస్టు 2017
www.manatelangana.news



నేతను కోల్పోకుండా ఓటు గట్టి చేసుకోండి

ఇస్లామాబాద్: ఎన్నికైన నాయకులను అప్రజాస్వామికంగా సాగనంపడం జరగకుండా పాకిస్థాన్ ప్రజలు తమ ఓటును పరిరక్షించుకోవాలని ఉద్వాసన పొందిన ప్రధాని నవాజ్ షరీఫ్ గురువారం నాడు పిలుపునిచ్చారు. ఆయన పనామా పేపర్లను కుంభకోణంలో దోషి కాబట్టి ప్రధాని పదవికి అనర్హునిగా సుప్రీం కోర్టు ఇటీవల తీర్పు నిచ్చింది. ఫలితంగా ఆయన తన పదవి నుంచి వైదొలిగారు. రావల్పిండిలో ఆయన భారీ ర్యాలీ ప్రసంగించారు. తన రాజకీయ బల ప్రదర్శనలో భాగంగా ఇస్లామాబాద్ నుంచి లాహోర్‌కు యాత్ర జరుపుతున్నారు. రాత్రి రావల్పిండిలో బస చేసి తెల్లారాకా పెద్ద ర్యాలీలో ప్రసంగించారు.

రాజీవ్ హత్య కేసులో కేంద్రం పిటిషన్ స్వీకరణ

న్యూఢిల్లీ: రాజీవ్‌గాంధీ హత్యకేసులో దోషుల విడుదలకు తమిళనాడు ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై ఆగస్టు 14న సోమవారం ధర్మాసనం విచారించనుంది. రాజీవ్ హత్య కేసుకు సంబంధించి 2014లో కేంద్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో జస్టిస్ రంజన్ గొగోయ్‌తో కూడిన బెంచ్ ప్రభు రామసుబ్రమణ్యం, దోషి ఏజీ పెరరివలన్ తరపు న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ హత్య కేసులో దోషులైన పెరరివలన్ సహా మురగన్, శంతన్, రాబర్ట్ పీయస్, నళిని...శిక్ష అనుభవిస్తున్నారు.

వెనక్కి తగ్గని జూడాలు

- ఫలించని వైద్యమంత్రి మంత్రాంగం
- కొనసాగుతున్న ఆందోళన
- విధులు బహిష్కరించి డోమ్ గేట్ ఎదుట ధర్నా



మన తెలంగాణ/హైదరాబాద్ గోషామహల్: ప్రభుత్వ వైద్యశాలల్లో సెక్యూరిటీ సిబ్బందిని పెంచి వైద్యులకు రక్షణ కల్పించాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు (జూడా)లు చే పట్టిన ఆందోళన రెండవ రోజు కొనసాగింది. గురువారం జూనియర్ డాక్టర్లు విధులను బహిష్కరించి ఉస్మానియా ఆసుపత్రి పాతభవనం డోమ్ గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జూడాలు మూకుమ్మడిగా సూపరింటెండెంట్ ఛాంబర్‌కు చేరుకుని పెద్దపెట్టున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. నిరసన వ్యక్త ం చేశారు. ప్రాంగణంలో బుధవారం విధులను బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఓపి భవనం ఎదుట ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు జి.శ్రీనివాస్, అధ్యక్షులు పి విజయేందర్, కార్యదర్శి నిదావుల్లా, అభిషేక్, నవీన్, వెంకటరమణ తదితరులు మీడియాతో మాట్లాడుతూ అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ఉస్మానియా ఆసుపత్రి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారిందని పేరుకు రెండు రాష్ట్రాల్లో అతి పెద్దాసుపత్రి అయినా కనీసం వార్డుల్లో అత్యవసర సమయాల్లో ఇవ్వాల్సిన మందులు, ఇంజెక్షన్‌లు, వైద్య పరికరాలు అందుబాటులో లేవని, ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందిలో సమన్వయం లేకుండా పోయిందన్నారు. వైద్యులపై దాడుల ఘటనలు నివారించేందుకు వెంటనే ఆసుపత్రిలోని అన్ని ఎమర్జెన్సీల వద్ద సెక్యూరిటీ సిబ్బందిని పెంచడంతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉస్మానియా ఆసుపత్రిలో ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ప్రొటెక్ష న్ ఫోర్స్ సంఖ్యను పెంచాలన్నారు. గురువారం సచివాలయంలో జూడాలతో జరిగిన చర్చల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డితో పాటు ఉస్మా నియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జివిఎస్ మూర్తి, ఆర్ఎంఓ1 డాక్టర్ అంజయ్య, అన్ని విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారని, రెండు గంటల పాటు సు దీర్ఘంగా చర్చలు జరిగినా ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా అర్ధాంతరంగా ముగిశాయన్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో వెంటనే సెక్యూరిటి సిబ్బంది పెంచి, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిఎంఈ ఇచ్చిన హామీ మేరకు ఉస్మానియాలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందిని పెంచాలని, ఆసుపత్రిలోని అన్ని వార్డుల్లో అత్యవసర మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. మా డిమాండ్లను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు ప్రకటించారు.

కానరాని ప్రత్యామ్నాయ చర్యలు..

జూనియర్ డాక్టర్లు విధులను బహిష్కరించి ఆందోళనకు దిగడంతో వివిధ ప్రాంతాల నుంచి వైద్యం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి వచ్చిన రోగులు సకాలంలో వైద్యమందక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తమ వారికి సకాలంలో వైద్యం అందుతుందో...లేదోనని రోగులు, వారి సహాయకులు ఆందోళనతో నిస్సహాయ స్థితిలో గంటల తరబడి నిరీక్షించినా ఫలితం లేక నిరాశగా తిరుగుముఖం పట్టారు. సుదూర ప్రాంతాల నుండి ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు ఓపీ వైద్యసేవలు అందుబాటులో లేక పోవడంతో ఉసూరుమంటూ ఇంటికి తిరిగి వెళ్లారు. జూడాల ఆందోళన నేపథ్యంలో ఆసుపత్రి పాలక వర్గం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టక పోవడం పట్ల పలువురు రోగులు, వారి సహాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వైద్యసేవల్లో అంతరాయం కలుగకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

అంబర్‌పేట స్కైవే కొలిక్కి త్వరలోనే పనులు ప్రారంభం !

మన తెలంగాణ /హైదరాబాద్ : రాజధాని హైదరాబాద్‌లో నిర్మించతలపెట్టిన స్కైవే పనులు కొలిక్కి వస్తున్నాయి. అంబర్ పేట (ఛే నెంబర్ జంక్షన్) ఎలివేటర్ కారిడార్ పనులకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) సూత్ర ప్రాయ అంగీకారం తెలియజేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు మంజూరు పనులు చివరి దశలో ఉన్నాయని అతి త్వరలోనే ప్రభుత్వానికి క్లియరెన్స్‌తో కూడిన నివేదిక అందనుందని ఎన్‌హెచ్‌ఏఐ వర్గాల ద్వారా తమకు సమాచారం అందిందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికార వర్గాలు మన తెలంగాణకు తెలిపాయి. అంబర్‌పేట ఎలివేటర్ కారిడార్ బ్రిడ్జ్ పేరిట ప్యాకేజీని ఫైనల్ చేస్తున్నారు. ఎంజిబిఎస్ బస్టాండ్ నుండి ఉప్పల్ వెళ్లే వరంగల్ హైవేలో ఛే నెంబర్ జంక్షన్‌కు కొద్ది ముందు నుండే ఈ స్కై వేను నిర్మిస్తారు. ఛే నెంబర్ జంక్షన్ కంటే కొద్ది ముందే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ ప్రారంభం కానుంది. 1.46 కి.మీ పొడవులో దీనిని నిర్మిస్తారు. రామంతాపూర్ దూర్‌దర్శన్ కేంద్రం దాటాక డీ మార్ట్ వరకు ఈ స్కైవేను నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ఎలివేటర్ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 244 కోట్లు కాగలదని అధికారులు అంచనా వేశారు. రాజధాని హైదరాబాద్ నడి బొడ్డు కావడంతో ఇళ్ల తొలగింపు, లేదా భూసేకరణకు జిహెచ్ఎంసి రూ.133 కోట్ల వరకు భరించనుందని, ఆపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరించవచ్చని అధికార వర్గాలు వెల్లడించాయి. ఒక వేళ కేంద్రం నిధులు ఇవ్వడానికి ముందుకు రాక పోయినా రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్ నుండి నిధులను కేటాయించేందుకు అంగీకారం తెలుపనుందని కూడా అధికారులు వెల్లడించారు. ఎన్‌హెచ్‌ఏఐ నుండి అనుమతులు రాగానే స్కై వేల కోసం టెండర్లు పిలుస్తామని, రెండేళ్ల కాల వ్యవధిలోనూ పనులు ముగిసేలా చూస్తామని అధికార వర్గాలు తెలిపాయి. అంబర్‌పేట ఎలివేటర్ కారిడార్ పనులు పూర్తి అయిన వెను వెంటనే ఉప్పల్ జంక్షన్ వద్ద కూడా ఇలాంటి స్కైవే నిర్మాణ పనులను ప్రభుత్వం చేపట్టనుందని వారు వెల్లడించారు.


తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తాం

లక్ష్మణ్ బృందానికి కేంద్రమంత్రుల హామీ



మన తెలంగాణ/న్యూఢిల్లీ : తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా.లక్ష్మ ణ్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర బిజెపి ప్రతినిధి బృందం గురువారం ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిసింది. తెలంగాణ బిజెపి నాయకులు లేవనెత్తిన ఆయా అంశాలపై కేంద్రమంత్రులు సానుకూలంగా స్పందించడంతోపాటు తెలంగాణ అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ బృందంలో బీజేపీ జాతీయ కార్యదర్శి మురళీధర్ రావు, రాష్ట్ర అధ్యక్షుడు డా. లక్ష్మ ణ్, బిజెపి శాసనసభాపక్ష నేత కిషన్ రెడ్డి తదితర నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా డా.లక్ష్మ ణ్ మాట్లాడుతూ....తెలంగాణాలో రైల్వే ప్రాజెక్టులు, సమస్యలపై రైల్వే మంత్రి సురేశ్ ప్రభు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులు, డబ్లింగ్, ట్రిబ్లింగ్ ప్రతిపాదనల గురించి వివరించామన్న ఆయన, వరంగల్ లో రైల్వే వ్యాగన్ వర్కషాప్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞాపనపత్రం ఇచ్చామన్నారు. త్వరలోనే అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తానని రైల్వే మంత్రి సురేశ్ ప్రభు హామీ ఇచ్చారని తెలిపారు. కేంద్ర మంత్రి అనంత కుమార్‌ను కలిసి రామగుండం ఎరువుల కర్మాగారం గురించి మాట్లాడామని, తెలంగాణ అవసరాలతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు సరిపోయేంత ఉత్పత్తి రామగుండం ఫ్యాక్టరీలో చేస్తామని, ఈ ఫ్యాక్టరీ వల్ల రైతులకు ఎరువుల కొరత తీరుడమే కాకుండా అనేక మందికి ఉపాధి కలుగుతుందని అనంతకుమార్ స్పష్టం చేశారని డా.లక్ష్మ ణ్ తెలిపారు. సామాన్యులకు, నిరుపేదలకు ఉపయోగపడేలా జెనరిక్ మందులిచ్చే జన్ ఔషధి షాపులను తెలంగాణాలో ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని అనంతకుమార్ దృష్టికి తీసుకు వెళ్లామని తెలిపారు. ఐడీపీఎల్‌కు చెందిన నిరుపయోగంగా ఉన్న 900 ఎకరాల భూమిని ఇతర అవసరాలకు ఉపయోగించుకునేలా వీలు కల్పించాలని కేంద్ర మంత్రి అనంతకుమార్ ని కోరామన్నారు. తెలంగాణాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్‌ను కలిసి వివరించామని డా.లక్ష్మ ణ్ వెల్లడించారు. తెలంగాణాలో ఫసల్ బీమా యోజన పథకానికి తెలంగాణ రైతులు నోచుకోవడం లేదని, రాష్ట్రప్రభుత్వం భూసార పరీక్షలు జరగడం లేని విషయాన్ని, రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందడం లేదన్న విషయాన్ని కూడా కేంద్ర వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. ఫసల్ బీమా కోసం రైతులు, కేంద్రం ప్రీమియం కట్టినా, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద ప్రీమియం కట్టకపోవడం వల్ల రైతులకు పరిహారం అందడం లేదని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి తమతో వివరించారని, దీనిపై తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాస్తానని లక్ష్మ ణ్ అన్నారు. గతంలో ఇన్ పుట్ సబ్సిడీ సకాలంలో ఖర్చు చేయకపోవడం వల్ల రైతులకు మేలు జరగలేదు కాబట్టి, ఇకపై అలా జరగకుండా చూస్తామని, రాష్ట్రానికి లేఖ రాస్తామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి హామీఇచ్చారన్నారు. తెలంగాణ బీజెపి నేతలు తనను కలసిన సందర్భంగా కేంద్ర పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.... సెప్టెంబరులో ఉజ్వల పథకాన్ని తెలంగాణలో అమలు చేస్తామని,రూ. 500 కోట్లు పెట్టుబడితో హైదరాబాద్‌లో భాగ్యనగర్ గ్యాస్ విస్తరణ పనులు చేపడతామని తెలంగాణ బిజెపి నేతలకు హామీ ఇచ్చారు. రామగుండం ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీకి రిలయన్స్ గ్యాస్ పైప్ లైన్ అనుసంధానం చేస్తామని, ఈ అన్ని పనులు ప్రారంభించడానికి సెప్టెంబర్లో తెలంగాణకు రానున్నట్లు బిజెపి నేతలకు ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.


రైల్వేను ప్రైవేటీకరిస్తే ప్రతిఘటన తప్పదు



ఎఐఆర్ఎఫ్ జిఎస్ శివగోపాల్ మిశ్రా

మన తెలంగాణ / హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం రైల్వేను ప్రైవేటీకరిస్తే ప్రతిఘటన తప్పదని, సమ్మె ద్వారా రైల్వేను స్థంభింప చేస్తామని అఖిల భారత రైల్వే మెన్ ఫెడరేషన్ (ఎఐఆర్ఎఫ్) ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా హెచ్చరించారు. రైల్వే ప్రైవేటీకరణ చర్యలను విరమించుకోవాలని, ఖాళీగా ఉన్న వేలాది ఉద్యోగాలను భర్తీ చేసి రైల్వేను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లోని ఎస్‌సిఆర్ మజ్దూర్ యూనియన్ (ఎస్‌సిఆర్ఎంయు)కార్యాలయంలోగురువారం జరిగిన యూనియన్ మహిళా, యువజన విభాగాల సమావేశాల్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. రైల్వే భద్రతా విభాగంలో పనిచేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్న ఉద్యోగుల పిల్లలకు తప్పనిసరిగా ఉద్యోగులు ఇవ్వాలని మిశ్రా డిమాండ్ చేశారు. ఏడవ వేతన సంఘం వల్ల ఉద్యోగులకు అన్యాయం జరిగిందని, ఇప్పటికైనా దానిని సవరించి న్యాయం చేయకపోతే మరోసారి సమ్మె తప్పదని ఆయన హెచ్చరించారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, ఫిట్‌మెంట్ ఫార్ములాను వెంటనే సవరించి అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌సిఆర్ఎంయు సికింద్రాబాద్ డివిజన్ ఉపాధ్యక్షులు కె.యాదవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్, హైదరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షులు కె.ర వీందర్ రాజ్, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల భాగస్వామ్యంతోనే ఎస్‌సిఆర్ పురోగతి



మన తెలంగాణ / హైదరాబాద్ : ఉద్యోగులు, గుర్తింపు కార్మిక సంఘాల బాధ్యతాయుతమైన సహకార భాగస్వామ్యంతోనే దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) భారతీయ రైల్వేలో ప్రతిష్టాత్మకమైన జోన్‌గా ఎదిగిందని ఎస్‌సిఆర్ జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ అన్నారు. రైల్ నిలయం ఆవరణలో గురువారం జరిగిన ఎస్‌సిఆర్ మజ్దూర్ యూనియన్ (ఎస్‌సిఆర్ఎంయు) 47వ వార్షిక జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎస్‌సిఆర్ పనితీరు, సరుకు, ప్రయాణికుల రవాణాలో మెరుగైన పురోగతి కొనసాగుతున్నదని, గత త్రైమాసికంలో 12 శాతం వృద్ధితో ఆదాయాన్ని సాధించిందని, ఈ పురోగతిలో ఉద్యోగులు కీలక భూమిక పోషిస్తున్నారని వినోద్ కుమార్ వివరించారు. ఎస్‌సిఆర్ఎం యు ఆధ్వర్యంలో చేపట్టిన పలు అంశాలు రైల్వే ఉద్యోగులకు ఎంతో ప్రయోజనం చేకూర్చాయన్నారు. ఉద్యోగుల భవిష్యత్, సంక్షేమానికి ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామని, అవసరమైన చోట పదోన్నతులు కల్పిస్తున్నామన్నారు. కారుణ్య నియామకాల అంశాన్ని అత్యంత మానవతా ధృక్పధంతో పరిష్కరిస్తున్నామన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సదుపాయాలను కల్పించేందుకు రైల్వే ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని, అవసరమైన వైద్యులను నియమిస్తున్నామన్నారు. ఉద్యోగుల కుటుంబాల కో సం నిర్వహించిన 'మీ కోసం' పాస్‌పోర్ట్ మేళా, 'మన కోసం' ఉద్యోగ మేళా కార్యక్రమాలు విజయవంతం కావడంలో మజ్దూర్ పాత్ర అభినందనీయమన్నారు.ఇదే స్ఫూర్తి తో ఇతర ప్రాంతాల్లో కార్యక్రమాలను చేపట్టనున్నట్లు జనరల్ మేనేజర్ ప్రకటించారు.

సమగ్ర ఒప్పందానికి చైనా సూచన

మన మీడియా ప్రతినిధులతో చైనా సైన్యాధికారి

బీజింగ్: భారత, చైనా దేశాలు నూతన సరిహద్దు ఒప్పందాన్ని సిక్కిం సెక్టార్‌పై కుదుర్చుకోవాలని చైనా సైనిక విశ్లేషకులు సూచించారు. డోక్లాం సంక్షోభం విషయంలో చైనా ఎట్టిపరిస్థితిలో రాజీ ధోరణి ప్రదర్శించదని పిఎల్‌ఎ ఉన్నత స్థాయి విశ్లేషకులు పేర్కొన్నారు. భారతీయ జర్నలిస్టుల బృందం సమక్షంలో వారు భారత్‌పై కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమ సత్తాను భారత్ తక్కువగా అంచనా వేసిందని మీడియా బృందంతో వారన్నారు. తమ భూభాగంలోకి (డోక్లాంలోకి) సైన్యాన్ని పంపే సాహసం భారత్ చేసిందని ఆరోపించారు. తమ భూభాగంలోనే రోడ్డు నిర్మిస్తున్నామని, అందుచేత అడ్డుకోవడానికి దించిన సైన్యాన్ని భారత్ తక్షణం వెనక్కితీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. 1890 ఒప్పందం బ్రిటన్‌కు, చైనాకు మధ్య కుదిరిందని ఒక ఉన్నత సైన్యాధికారి అన్నారు. దాని స్థానే భారత్‌తో సరిహద్దులపై సమగ్ర ఒప్పందానికి సూచించారు. భారత మీడియా బృందానికి కల్నల్ ఝూవో జీయావో ఝౌ బుధవారం ఈ సూచన చేశారు. ఆయన చైనా, అమెరికా రక్షణ సంబంధాల సైన్యాధికారి. మిలటరీ సైన్స్ అకాడమికి చెందిన సంస్థ అది.

గువామ్‌లో అమెరికాను గురిపెట్టే ఉత్తర కొరియా వ్యూహం

తాజా ప్రకటనలో పోంగ్యాంగ్ వెల్లడి



సియోల్: అమెరికాపై ప్రకటనల యుద్ధాన్ని, క్షిపణుల దాడి వ్యూహాన్ని ఉత్తర కొరియా తీవ్రం చేసింది. అధ్యక్షుడు ట్రంప్ కారణంలేని హడావుడి చేస్తున్నారని ఉత్తర కొరియా విమర్శించింది. అమెరికా భూభాగం గువామ్‌ను గురిపెట్టి క్షిపణుల దాడి జరిపే వ్యూహాన్ని ఉత్తర కొరియా అసాధా రణంగా బయటపెట్టింది. అమెరికా అణ్వాయుధ సంపత్తి ఇంతకు ముందు కంటే ఎంతో అధికంగా పెంపొందినట్లు ట్విట్టర్‌లో ట్రంప్ తాజాగా ప్రకటన చేశాక ఈ వ్యూహాన్ని ఉత్తర కొరియా బయటపెట్టింది. అంతకు ముందు ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ యున్‌కు అత్యంత గట్టి సందేశాన్ని ట్రంప్ ఇచ్చారు. ప్రపంచం ఇంతకు ముందు ఎన్నడూ చేయనట్లుగా ఉ. కొరియాపై నిప్పులు కక్కుతోందని తన సందేశంలో ఆయన పేర్కొ న్నారు. కొరియా ద్వీపకల్పాన్ని దాటిపోయే విధంగా కొత్త వినాశానికి ఈ ప్రకటనల యుద్ధం దారితీస్తుందన్న భయాలు సర్వత్రా వ్యాపించాయి.

కొండూరు రవీందర్ రావును సన్మానించిన తమిళనాడు సిఎం



మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ అధ్యక్షులు కొండూరు రవీందర్ రావును తమిళనాడు ముఖ్యమంత్రి కె. ఫళని స్వామి ఘనంగా సన్మానించారు. చెన్నైలో జరిగిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో.ఆపరేటివ్ బ్యాంక్స్ బోర్డు, జనరల్ బాడీ సమావేశంలో ఈ సన్మానాన్ని కొండూరు అందుకున్నారు. తెలంగాణలో ప్రాథమిక రైతు సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేయుక్రమంలో మన రాష్ట్ర సహకార అభివృద్ధిని ఫళనిస్వామి కొనియాడారని ఒక ప్రకటనలో రవీందర్ రావు తెలిపారు.

నేటి నుండి 16వ టెంట్ డెకొరేటర్స్ సదస్సు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఈ నెల 11 నుండి 13వ తేదీ వరకు రామోజీఫిల్మ్ సిటిలో 16వ ఆల్ ఇండియా టెంట్ డెకొరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ సదస్సు జరుగనుందని సంస్థ వైస్ ఛైర్మన్ సూరజ్ సింగ్ మల్హోత్రా ఒక ప్రకటనలో తెలిపారు. ద ఏఆర్ ఫౌండేషన్, హెల్పింగ్ 2 హ్యాండ్స్ సంస్థల సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు 16 రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరు కానున్నారని ఆయన వెల్లడించారు. జిఎస్‌టి అనంతర పరిణామాలు, ఆతిథ్య రంగం, టెంట్ ఇండస్ట్రీ ఒడిదుడుకులను చర్చించనున్నట్లు తెలిపారు.

మార్కెట్‌లోకి హెచ్‌రిచ్ ఆల్కలైన్ వాటర్ అయోనైజర్

మన తెలంగాణ / హైదరాబాద్ : పరిశుద్ధ తాగునీటి కోసం దేశంలోనే తొలి సారిగా పూర్తిస్థాయి హైడ్రోజన్ పూరిత వాటర్ అయోనైజర్‌ను మెడిలైట్ హెల్త్‌కేర్ సంస్థ మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టింది. ఇప్పటికే మార్కెట్లో ఎన్నో రకాల వాటర్ ప్యూరిఫయర్లు ఉన్నా అవన్నీ కేవలం క్లీన్ వాటర్‌ను మాత్రమే అందిస్తున్నాయని, తాజాగా తాము పూర్తి స్థాయిలో హైడ్రోజన్ పూరిత వాటర్ అయొనైజర్‌ను విడుదల చేశామని మెడిలైట్ ఎండి డా. శ్రీనివాస యాదవ్ కందుల పేర్కొన్నారు. హెచ్‌రిచ్ ఆల్కలైన్ అయోనైజర్ విడుదల సందర్భంగా ధరపై 10 శాతం రాయితీనిఇస్తున్నట్లు తెలిపారు.

అవయవ మార్పిడిపై అవగాహన అవసరం

మన తెలంగాణ/హైదరాబాద్ : అవయవ దానం రోజు (అర్గాన్ డొనేషన్ డే ఆగస్టు 13)ను పురస్కరించుకుని అపోలో హాస్పిటల్స్‌తో పాటు జీవన్‌ధాన్, 'సిఐఐ యంగ్ ఇండియన్' సంయుక్తంగా అవయవాన్ని బహుమతిగా 'గిఫ్ట్ యాన్ ఆర్గాన్' ఇవ్వండి... అదనంగా జీవించండి అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అవయవ దానంతో పాటు ఎంతో దురవస్థతో జీవితపు చివరిదశలో అవయవ మార్పిడికై ఎదురు చూస్తున్న రోగులపై యువతలో అవగాహనను కల్పించడం జరుగుతుంది. గురువారం జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్స్‌లో డాక్టర్లు హరి ప్రసాద్, స్వర్ణలత, ఎజికె గోఖలే, మనీష్ వర్మ, సుబ్రమణ్యం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, అవయవ దానానికి చెందిన కార్యక్రమం జీవన్‌ధాన్ రాష్ట్రంలో అద్భుతంగా ప్రారంభమైంది, కానీ ఎంతో అవసరమై దాదాపు మరణశయ్యపై ఉన్నటువంటి లక్షలాది రోగుల అవసరాలను సంతృప్తిపరచవలసి ఉన్నది. 'సిఐఐ యంగ్ ఇండియన్'కు చెందిన యువత తమ అవయవాలను దానం చేయడానికి ముందుకువచ్చి ప్రతిజ్ఞ చేయడం జరిగింది, అదేవిధంగా అవయవాలను దానంగా పొందిన గ్రహీతలు కృతజ్ఞతగా వైద్యులను సన్మానించారు.



2496 మంది వీధి బాలల రక్షణ

మన తెలంగాణ / హైదరాబాద్ : ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా 2496 మంది వీధి బాలలను మహిళా శిశు సంక్షేమ అధికారులు రక్షించారు. వీరిలో 2108 బాలురు, 388 బాలికలు ఉన్నారు. పేదరికం, కుటుంబ పరంగా తల్లిదండ్రులు విడాకులు తీసుకోవడం, ఉద్దేశ పూర్వకంగానే కొందరు తల్లిదండ్రులు వదిలేసి పోవడం, లేదా మాఫియాల చేత కిడ్నాప్‌కు గురికావడం, (పిల్లలను ఎత్తుకెళ్లడం), అలాగే అంధ, బధిర, మూగ పిల్లలు కావడం చేత కన్నవారే వారిని వదిలించుకోవడం లాంటి కారణంగా వీధి బాలలుగా మారారు. అలాంటి పిల్లలు వీధుల్లో భిక్షాటన, హోటళ్ల పాచి పని చేయడం, టి, కాఫీలను రోడ్లపై తిరుగుతూ అమ్మడం, ఇతర ప్రమాదకర పనులు చేస్తూ కనిపించడంతో మహిళా శిశు సంక్షేమ అధికారులు ఆ పిల్లలను కాపాడారు. గత జులై నెలంతా వీధి బాలల రక్షణ కార్యక్రమం ఆపరేషన్ ముస్కాన్ మూడో విడత నిర్వహించి వీధి బాలలను రక్షించారు. పట్టుబడ్డ చిన్నారుల్లో తెలంగాణ వారు 2116 కాగా బీహార్, అస్సాం, కర్నాటక, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాకు చెందిన వారు 94 మంది ఉండడం విశేషం.

నర్సంపేటను జిల్లా కేంద్రం చేయాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : నర్సంపేటను వరంగల్ రూరల్ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ నర్సంపేట అఖిలపక్షం కమిటీ కోరింది. ఈ మేరకు టిడిపి నేత రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి సింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా నర్సంపేట నియోజకవర్గంలోని 6 మండలాలు, పరకా ల, వర్ధన్నపేట నియోజక వర్గాల్లోని కొన్ని మండలాలలను కలిపి వరంగల్ రూరల్ జిల్లా గా ప్రకటించిందని, జిల్లా కేంద్రంపై స్పష్టమై న ప్రకటన చేయలేదన్నారు. నర్సంపేట జిల్లా కేంద్రంకు అన్ని రకాలుగా సౌకర్యంగా ఉండటంతో పాటు వసతులు కూడా ఉన్నాయన్నా రు. ప్రభుత్వం నర్సంపేటను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని సిఎస్‌కు విజ్ఞప్తి చేశారు.

మోడీని కలిసిన బిసి సంఘాల నేతలు




మన తెలంగాణ/ న్యూఢిల్లీ: ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు తదితర 14 డిమాండ్లతో బిసి సంఘాల నేత ఆర్. కృష్ణ య్య, బిసి ఎంపిలు ప్రధాని నరేంద్ర మోడీని కలిసారు. గురువారం పార్లమెంటులోని ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞాపనా పత్రాన్ని ప్రధానికి ఇచ్చారు. ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ రాజకీయ రంగంలో రిజర్వేషన్లు లేకపోవడం వల్ల బిసిల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందన్న విషయాన్ని ప్రధానికి వివరించామన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్లు ఉంటే తప్ప అందరికీ ప్రాతినిధ్యం లభించదన్న విషయాన్నిమోడీకి చెప్పామన్నారు. రాజ్యాంగ రచన సమయంలో అన్యాయం జరిగిందని, 123 సార్లు రాజ్యాంగాన్ని సవరించినా ఒక్కసారి కూడా బిసిల కోసం సవరణ జరగలేదని ప్రధానికి వివరించినట్లు కృష్ణయ్య వెల్లడించారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లు, క్రీమీ లేయర్ తొలగింపు, 14 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేపట్టాలని కోరామని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించి, బిసిలకు చెందాల్సింది చాలా ఉందని వ్యాఖ్యానించారని ఆర్.కృష్ణయ్య తెలిపారు. అనంతరం టిడిపి ఎంపి నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ బిసిల్లో సమర్థవంతమైన నాయకత్వం ఉంది. చదువుకున్నవారు ఉన్నారు, కానీ చట్టసభల్లో మాత్రం ప్రాతినిధ్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వండి అని తీర్మానం చేశారు. దీన్ని పార్లమెంటు ఆమోదించాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు అయిపోయినా,10–15 శాతం మించి చట్టసభల్లో లేరన్నారు.

కనీస వేతన కల్పనకు సమగ్ర బిల్లు

న్యూఢిల్లీ : దేశంలోని అసంఘటిత రంగ కార్మికులకు జాతీయ స్థాయిలో కనీస వేతనాల ఖరారు చేసేందుకు ఉద్దేశించిన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. 40 కోట్ల మందికి పైగా అసంఘటిత కార్మికులకు సార్వత్రికంగా కనీస వేతనం కల్పించడం, వేతనాలను సకాలంలో చెల్లించడం, చెక్కులు, లేదా ఎలక్ట్రానిక్ పద్ధతిలోచెల్లింపులకు వీలు కల్పించాలని సంకల్పించారు. బిల్లును లోక్‌సభలో కార్మిక మంత్రి బండారు దత్తాత్రేయ ప్రవేశపెట్టారు. కార్మికుల వేతనాలు, భత్యాల సవరణకు ఈ బిల్లు దోహదం చేస్తుందని మంత్రి వివరించారు. ప్రతి ఐదేళ్లకు ఓసారి ప్రభుత్వం కనీస వేతనాలను సమీక్షించేందుకు అవకాశం ఉంటుంది. నైపుణ్యం, పనిశ్రమ భారం, పరిగణనలోకి తీసుకుని కనీస వేతనాలను ఖరారు చేస్తారని తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు



మన తెలంగాణ/ సిటీబ్యూరో : గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యకి ని, మరో మహిళను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 16.36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సి.వివేకనందరెడ్డి ఆదేశాల మేరకు ఏఈఎస్ అం జిరెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఇంద్రాసేనరెడ్డి సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అప్పర్ దూల్‌పేట్ బాల్‌రాంగల్లీ యాతీమ్ ఖానాకు సురేందర్‌సింగ్ (36),అనితాభాయి (43) ఇళ్లపై దాడులు నిర్వహించి వారిని అరెస్టు చేశారు. 16.36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే బాల్‌రాంగల్లీలో గంజాయి విక్రయిస్తున్న మంజూబాయి ఇంటిపై దాడి చేయగా ఆమె తప్పించుకుంది.

సక్లయిన్ సలహాల వల్లే : మొయిన్ అలీ



లండన్: పాకిస్థాన్ దిగ్గజం సక్లయిన్ ముస్తాక్ అందించిన సలహాలు, సూచనల వల్లే తాను ఈ స్థాయికి చేరుకోగలిగానని ఇంగ్లాండ్ స్టార్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ అన్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో ముగిసిన టెస్ట్ సిరీస్‌లో మొయిన్ అలీ అసాధారణ ఆటతో ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్ జట్టు తాత్కాలిక స్పిన్ సలహాదారుడిగా సక్లయిన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. అతని పర్యవేక్షణలోనే తాను మెరుగైన స్పిన్నర్‌గా ఎదిగానని మొయిన్ అన్నాడు. జట్టుకు సక్లయిన్ సేవలు ఎంతో అవసరమని, అతన్ని పూర్తి స్థాయి బౌలింగ్ కోచ్‌గా నియమించాలని సూచించాడు. అతని పర్యవేక్షణలో ఇంగ్లాండ్ స్పిన్ విభాగం మరింత బలోపేతంగా మారడం ఖాయమన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ అనుభవం కలిగిన సక్లయిన్ ఎంతో ప్రతిభావంతుడైన కోచ్ అని మొయిన్ ప్రశంసించాడు. జట్టు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సక్లయిన్‌కు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించాలని కోరాడు. ఈ విషయంలో ఇంగ్లాండ్ బోర్డు సానుకూలంగా స్పందిస్తుందనే నమ్మకాన్ని మొయిన్ వ్యక్తం చేశాడు.

ఎదురులేని భారత బ్యాట్స్‌మెన్

మన తెలంగాణ / క్రీడా విభాగం: ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటింగ్ లైనప్ కలిగిన జట్లలో భారత్‌దే అగ్రస్థానం. ప్రస్తుతం టెస్టుల్లో భారత ఆటగాళ్లు నిలకడైన ఆటతో ప్రకంపనలు సృష్టిస్తున్నారు. కెప్టెన్ విరాట్ కోహ్లితో సహా చాలా మంది టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ అద్భుత ఆటతో జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. సీనియర్లు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, వివిఎస్ లక్ష్మణ్, వీరేంద్ర సెహ్వాగ్ వంటి దిగ్గజాలు అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా దాని ప్రభావం భారత బ్యాటింగ్‌పై కనపడలేదనే చెప్పాలి. ఇతర జట్లు సరైన బ్యాట్స్‌మెన్ లేక ఇబ్బందులు పడుతుంటే టీమిండియా పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నంగా ఉంది. ప్రతిభావంతులైన ఆటగాళ్లతో నిండిన భారత్ తుది జట్టు ఎంపికలో ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొవాల్సి వస్తోంది. ప్రపంచంలోని అత్యుత్తమ బ్యాట్స్‌మన్లలో ఒకడిగా పేరొందిన రోహిత్ శర్మకే తుది జట్టులో చోటు దక్కడం లేదు. దీన్ని బట్టి భారత బ్యాటింగ్ ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఓపెనింగ్ స్థానం కోసం కూడా భారత్‌లో ఆసక్తికర పోటీ వాతావరణం నెలకొంది. మురళీ విజయ్, కెఎల్ రాహుల్, శిఖర్ ధావన్, అభినవ్ ముకుంద్‌ల మధ్య ఓపెనర్ల స్థానం కోసం తీవ్ర పోటీ నెలకొంది. ప్రస్తుతం మురళీ విజయ్ గాయం వల్ల దూరం కావడంతో ధావన్, రాహుల్‌లకు పోటీ లేకుండా పోయింది. కాగా, రాహుల్ రాకతో రెండో టెస్టులో మరో ఓపెనర్ అభినవ్ ముకుంద్ పెవిలియన్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. ఇక, మురళీ విజయ్ కోలుకుని జట్టులోకి వస్తే ధావన్, రాహుల్, విజయ్‌ల మధ్య ముక్కోణపు పోటీ తప్పదు. ఇక, రోహిత్ శర్మ కూడా ఓపెనింగ్ చేయగలిగే సత్తా కలిగిన వాడే. అతను కూడా ఛాన్స్ దొరికితే సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నాడు. మరోవైపు కరుణ్ నాయర్, జయంత్ యాదవ్, పార్థివ్ పటేల్, దినేష్ కార్తీక్, మనోజ్ తివారీ, మనీష్ పాండే తదితరులు కూడా టెస్టు జట్టులో స్థానం కోసం తహతహలాడుతున్నారు. ప్రపంచంలోని మరే జట్టుకు ఇంత బలమైన బ్యాటింగ్ లైనప్ అందుబాటులో లేదని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ఆకాశమే హద్దుగా చెలరేగుతున్న చటేశ్వర పుజారా

ప్రస్తుతం టీమిండియాకు ప్రాతినిథ్యం వహిస్తున్న వారిలో చటేశ్వర్ పుజారా ఆకాశమే హద్దుగా చెలరేగి పోతున్నాడు. భారత్ సాధిస్తున్న వరుస సిరీస్‌లలో పుజారా పాత్ర వేల కట్టలేనిది. క్లిష్ట సమయాల్లో అద్భుత ఇన్నింగ్స్‌తో పుజారా జట్టుకు అండగా నిలుస్తున్నాడు. నిలకడైన ఆటకు మరో పేరుగా చెప్పుకునే పుజారా ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా నిలకడైన ఆటతో ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. లంక సిరీస్‌లో ఇప్పటికే సెంచరీతో కదం తొక్కాడు. ఓపెనర్ శిఖర్ ధావన్ కూడా తొలి మ్యాచ్‌లో కళ్లు చెదిరే శతకం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా ముకుంద్ కూడా మెరుగైన ఆటతో జట్టుకు అండగా నిలిచాడు. రెండో టెస్టులో ఓపెనర్ రాహుల్ కూడా సత్తా చాటాడు.

రహానె మెరుపులు

అజింక్య రహానె కూడా మెరుపులు మెరిపిస్తున్నాడు. అద్భుత సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా, ఆల్‌రౌండర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలు కూడా అర్ధ సెంచరీలతో కదంతొక్కారు. యువ సంచలనం హార్దిక్ పాండ్యా కూడా బ్యాట్‌తో అలరించాడు. ఇక, రెండు టెస్టుల్లోనూ మహ్మద్ సమి బాల్‌తోనే కాకుండా బ్యాట్‌నూ ఝులిపించాడు. ఉమేశ్ యాదవ్ కూడా సత్తా చాటాడు. దీన్ని బట్టి భారత బ్యాటింగ్ లైనప్ ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాగా, టాప్ ఆర్డర్, లోయర్ ఆర్డర్ అద్భుత ఫాంలో ఉండడంతో లంకతో శనివారం నుంచి ప్రారంభమయ్యే చివరి టెస్టులోనూ టీమిండియా భారీ స్కోరు సాధించడం ఖాయంగా కనిపిస్తోంది.







టైటిల్‌కు చేరువలో ఆనంద్

సెయింట్ లూయిస్: అమెరికాలో జరుగుతున్న సింక్వెఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌లో భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ సంయుక్తంగా మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు. వరుసగా రెండో విజయం సాధించిన ఆనంద్ 4.5 పాయింట్లతో సంయుక్తంగా మొదటి స్థానంలో నిలిచాడు. రష్యా ఆటగాడు ఇయాన్ నెపోమ్‌నియాట్చితో జరిగిన పోరులో ఆనంద్ జయభేరి మోగించాడు. ప్రారంభం నుంచే దూకుడును కనబరిచిన ఆనంద్ వరుసగా రెండో విజయాన్ని తన ఖాతాలో జమ చేసుకున్నాడు. ఏడు రౌండ్‌లు ముగిసే సమయానికి ఆనంద్ తన ప్రత్యర్థులు మాక్సిమి వాచిర్ లగ్రేవ్ (ఫ్రాన్స్), లెవాన్ అరోనియన్ (ఆర్మేనియా)తో కలిసి సంయుక్తంగా అగ్ర స్థానంలో కొనసాగుతున్నాడు. కేవలం రెండు రౌండ్‌లు మాత్రమే మిగిలిన ఈ టోర్నమెంట్‌లో టైటిల్ కోసం ముక్కోణపు పోటీ నెలకొంది. చివరి రెండు రౌండ్లలో ఎవరూ నిలకడైన ఆటను కనబరిస్తే వారికే టైటిల్ దక్కే అవకాశాలున్నాయి.

వన్డే సిరీస్‌లో సీనియర్లకు విశ్రాంతి?

ముంబయి: శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌కు భారత కెప్టెన్ విరాట్ కోహ్లికి విశ్రాంతి ఇచ్చే ఆలోచనలో భారత క్రికెట్ బోర్డు ఉన్నట్టు సమాచారం. వరుస క్రికెట్‌తో తీరిక లేకుండా ఉన్న కోహ్లితో సహా ఇతర సీనియర్లకు విశ్రాంతి ఇవ్వాలని బోర్డు భావిస్తున్నట్టు తెలిసింది. శ్రీలంకతో భారత్ ఐదు వన్డేలు, మరో ట్వంటీ–20 మ్యాచ్ ఆడనున్న విషయం తెలిసిందే. ఈ సిరీస్‌కు విరాట్ కోహ్లికి విశ్రాంతి ఇచ్చి రోహిత్ శర్మకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలనే ఉద్దేశంతో బిసిసిఐ ఉన్నట్టు తెలిసింది. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంత వరకు వెల్లడి కాలేదు. అయినా కోహ్లికి మాత్రం విశ్రాంతి ఇవ్వడం ఖాయమని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ బిసిసిఐ ప్రముఖుడు మీడియాతో చెప్పాడు. కోహ్లితో పాటు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమి, భువనేశ్వర్ కుమార్ తదితరులకు విశ్రాంతి ఇచ్చేందుకు బిసిసిఐ నిర్ణయించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెల్లువెత్తాయి. ఆస్ట్రేలియా సిరీస్, ఆ వెంటనే ఐపిఎల్, ఛాంపియన్స్ ట్రోఫీ, వెస్టిండీస్ సిరీస్, ప్రస్తుతం లంక పర్యటన నేపథ్యంలో సీనియర్లకు విశ్రాంతి లేకుండా పోయింది. దీంతో యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే బిసిసిఐ పెద్దలు ఉన్నట్టు సమాచారం.

ఫీల్డింగ్ కోచ్‌గా హడిన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఫీల్డింగ్ కోచ్‌గా ఆ జట్టు మాజీ వికెట్ కీపర్ బ్రాడ్ హడిన్‌ను నియమించారు. ఈ విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా ఒక ప్రకటనలో వెల్లడించింది. గ్రేగ్ బ్లెవెట్ స్థానంలో హడిన్‌కు బాధ్యతలు అప్పగించాలని క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయించింది. త్వరలోనే హడిన్ ఈ బాధ్యతలు చేపడుతాడు. వికెట్ కీపర్‌గా, బ్యాట్స్‌మన్‌గా హడిన్ ఆస్ట్రేలియాకు సుదీర్ఘ కాలం పాటు సేవలు అందించాడు. వికెట్ల వెనక అతని ప్రతిభ అమోఘం. కళ్లు చెదిరే క్యాచ్‌లకు, స్టంపౌట్‌లకు హడిన్ పెట్టింది పేరు. ఆస్ట్రేలియా విజయాల్లో హడిన్ కీలక పాత్ర పోషించే వాడు. ఇయాన్ హిలీ, గిల్‌క్రిస్ట్ రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత హడిన్ వికెట్ కీపర్ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాడు. కాగా, అతని పర్యవేక్షణలో ఆస్ట్రేలియా ఫీల్డర్లు మరింత రాటు దేలుతారనే నమ్మకాన్ని సిఏ వ్యక్తం చేసింది. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని హడిన్ హామీ ఇచ్చాడు.



నాదల్, ఫెదరర్ ముందంజ

న్యూయార్క్: రోజర్స్ కప్ టెన్నిస్ టోర్నమెంట్‌లో రఫెల్ నాదల్ (స్పెయిన్), రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) శుభారంభం చేశారు. యూఎస్ ఓపెన్‌కు సన్నాహకంగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో దిగ్గజ ఆటగాళ్లిద్దరూ తొలి రౌండ్‌లో సునాయాస విజయాలతో ముందంజ వేశారు. ఫ్రెంచ్ ఓపెన్‌తో నాదల్, వింబుల్డన్ ఓపెన్ టైటిల్‌తో ఫెదరర్ జోరు మీదున్న విషయం తెలిసిందే. కాగా, రోజర్స్ కప్‌లో వీరిద్దరూ టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగారు. మూడు సార్లు రోజర్స్ కప్ టైటిల్ సాధించిన టాప్ సీడ్ నాదల్ తొలి రౌండ్‌లో 6–1, 6–2 తేడాతో క్రొయేషియా ఆటగాడు బొర్నా కొరిక్‌ను చిత్తు చేసి ముందుకు వెళ్లాడు. ప్రారంభం నుంచే నాదల్ తన మార్క్ షాట్లతో చెలరేగి పోయాడు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ సునాయాస విజయం సాధించాడు. మరో పోటీలో రెండో సీడ్ ఫెదరర్ జయకేతనం ఎగుర వేశాడు. ఫెదరర్ 6–2, 6–1 తేడాతో కెనడా ఆటగాడు పీటర్ పొలన్‌స్కిను ఓడించాడు. మరోవైపు కెనడా యువ సంచలనం షావొ వాలొవ్ 6–3, 7–6 తేడాతో మాజీ యూఎస్ ఓపెన్ ఛాంపియన్ డెల్ పొట్రోపై సంచలన విజయం సాధించాడు. హోరాహోరీ మ్యాచ్‌లో 16 ఏళ్ల షావొవాలొవ్ అద్భుత ఆటతో డెల్‌పొట్రోను మట్టి కరిపించాడు. తర్వాతి రౌండ్‌లో షావొవాలొవ్ దిగ్గజ ఆటగాడు నాదల్‌తో తలపడుతాడు.



ఒక మెట్టు దిగిన భారత్.. ఫుట్‌బాల్ ర్యాంకింగ్స్



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ ఒక స్థానాన్ని కోల్పోయి 97వ ర్యాంక్‌లో నిలిచింది. తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ ఒక స్థానం కిందికి పడిపోయింది. 96వ స్థానం నుంచి 97కి పడిపోయింది. అయితే టాప్–100లో మాత్రం భారత్ తన స్థానాన్ని నిలబెట్టు కోవడం విశేషం. ఇటీవల కాలంలో భారత్ పెద్దగా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడడం లేదు. దీంతో ర్యాంక్‌లను మెరుగు పరుచుకునే వీలు లేకుండా పోయింది. అయితే ఒక ర్యాంక్‌ను మాత్రం కోల్పోక తప్పలేదు. ప్రస్తుతం భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు 341 రేటింగ్ పాయింట్లతో ఉంది. కాగా, ఆసియాలో భారత్ 12వ స్థానంలో నిలిచింది. ఇరాన్ ఆసియాలో నంబర్‌వన్ జట్టుగా కొనసాగుతోంది. మరోవైపు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో బ్రెజిల్ నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. జర్మనీని వెనక్కి నెట్టి బ్రెజిల్ టాప్ ర్యాంక్‌ను దక్కించుకుంది. అర్జెంటీనా మూడో, స్విట్జర్లాండ్ నాలుగో ర్యాంక్‌లో నిలిచాయి. పోలండ్ ఐదో ర్యాంక్‌ను దక్కించుకుంది.

జైపూర్, తలైవాస్ జట్ల గెలుపు

నాగ్‌పూర్ : ప్రొ కబడ్డీ సీజన్ ఐదులో భాగంగా గురువారం నాగ్‌పూర్‌లో జరిగిన మ్యాచుల్లో జైపూర్ పింక్ పంథర్స్, తమిళ్ తలైవాస్ జట్లు విజయం సాధించాయి. నువ్వానేనా అన్నట్టు సాగిన మ్యాచ్‌లో జైపూర్ 30–28 తేడాతో పుణేరి పల్టన్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 29–24 తేడాతో బెంగళూరు బుల్స్ జట్టుపై విజయం సాధించింది. పుణేరి పల్టన్‌తో జరిగిన మ్యాచ్‌లో జైపూర్ అద్భుత పోరాట పటిమను కనబరిచింది. చివరి వరకు నరాలు తెగేంత ఉత్కంఠ మధ్య పోరు సాగింది. రెండు జట్లు కూడా ప్రతి పాయింట్ కోసం సర్వం ఒడ్డాయి. జైపూర్ జట్టులో మంజీత్ ఛిల్లర్ చెలరేగి ఆడాడు. అసాధారణ రీతిలో ఆడిన మంజీత్ ఏకంగా 9 పాయింట్లు సాధించి ప్రకంపనలు సృష్టించాడు. జస్విర్ సింగ్ ఐదు, తుషార్ సింగ్ నాలుగు పాయింట్లు సాధించి తమవంతు పాత్ర పోషించారు. పల్టన్ జట్టులో సందీప్ అద్భుతంగా ఆడాడు. అతను అద్భుత ఆటతో 9 పాయింట్లు సాధించినా ఫలితం లేకుండా పోయింది. మిగతా వారు విఫలం కావడంతో పుణేకు ఓటమి తప్పలేదు.

బుల్స్‌కు షాక్...

మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 29–24 తేడాతో ఆతిథ్య బెంగళూరు బుల్స్ జట్టును చిత్తు చేసింది. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన తమిళ జట్టు ఏ దశలోనూ బుల్స్‌ను కోలుకోనివ్వలేదు. ప్రపంజన్, వినీత్, అమిత్, జియాన్ లీ దర్శన్‌లు తమిళ్ విజయంలో ముఖ్య భూమిక పోషించారు. ప్రపంజన్ అసాధారణ రీతిలో ఆడాడు. ప్రపంజన్ ఆరు పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా వారిలో అమిత్, జియాన్ లీ నాలుగేసి పాయింట్లు సాధించారు. బెంగళూరు జట్టులో రోహిత్ ఏకంగా 12 పాయింట్లు సాధించినా మిగతావారు విఫలమవడంతో బుల్స్‌కు ఓటమి తప్పలేదు.



ప్రణయ్ @ 15

• బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ హెచ్.ఎస్. ప్రణయ్ 15వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో ప్రణయ్ రెండు స్థానాలను మెరుగు పరుచుకున్నాడు. ప్రతిష్ఠాత్మకమైన యుఎస్ ఓపెన్ టైటిల్‌ను నెగ్గడంతో ప్రణయ్ మెరుగు పడింది. ఇటీవల కాలంలో ప్రణయ్ ఇంత మెరుగైన ర్యాంక్‌ను సాధించడం ఇదే ప్రథమం. మరోవైపు తెలుగుతేజం కిదాంబి శ్రీకాంత్ టాప్–10లో చోటు నిలబెట్టుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో శ్రీకాంత్ 8వ స్థానంలో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం మరే భారత ఆటగాడు టాప్ టెన్‌లో లేడు. కాగా, భారత్‌కే చెందిన అజయ్ జయరాం 17వ స్థానంలో నిలిచాడు. మరోవైపు సాయి ప్రణీత్ కూడా టాప్–20లో చోటు సంపాదించాడు. ఈ ర్యాంకింగ్స్‌లో ప్రణీత్‌కు 19వ ర్యాంక్ లభించింది. కాగా, కొరియా ఆటగాడు సాన్ వాన్ హో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. మలేసియా ఆటగాడు లీ చాంగ్ వీ రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. డెన్మార్క్ స్టార్ విక్టర్ అక్సెల్‌సెన్ మూడో ర్యాంక్‌లో నిలిచాడు. చైనా ఆటగాళ్లు షి యూఖి నాలుగో చెంగ్ లాంగ్ ఐదో స్థానాన్ని దక్కించుకున్నారు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.